# అభిసారిక

OCTOBER

As 8





ప్రణయాన్వేషి

## ఈ సంచికలో

హేవలాక్ ఎల్లిస్, మొపాసా, ఎ. సూర్యారావు, మొదలైనవారి రచనలూ, పెళ్ళిళ్ళ పేరయ్యలు, పాఠకుల ఉత్తరాలూ, తిమింగలం సెక్సు జీవితం, బ్రహ్మచర్యం, సందేహాలకు సమాధానాలు, వింత ఆచారాలు, వార్తా ప్రపంచం మొదలైన వైజ్ఞానిక వ్యాసాలూ అవీ, ఇవీ ఇంకా ఎన్నో—


# శాస్త్రీయలైంగిక విజ్ఞానానికి మీరీ పుస్తకాలు చదివి తీరాలి!

హేవలాక్ ఎల్లిస్ రచనలు ★ 'క్రాంతినాథ్' అనువాదం

## "సిగ్గు"

మనం ఎందుకు సిగ్గుపడాలి? స్త్రీ, పురుషునికన్న ఎక్కువసిగ్గును ఎందుకుప్రదర్శించాలి? సిగ్గుకూ నాగరికతకూ సంబంధం వుందా?.... ఇలాంటి లక్షప్రశ్నలకు యీపుస్తకంలో జవాబులున్నవి. ప్రతి ఒకరూపాయి.

## "ఋతుధర్మాలు"

బహిష్టు అంటే ఏమిటి? బహిష్టుకూ చంద్రకళలకూ సంబంధం ఏమిటి? లైంగికఉధృతం ఋతుధర్మంగానే నేటికీఉన్నదా? ఆరోగ్యవంతమైన దాంపత్య జీవితంలోని రతులసంఖ్య నిర్ణయించబడిందా? బహిష్టులో రతి నిషిద్ధమనేందుకు శాస్త్రకారులు ఏమంటున్నారు? బహిష్టుకూ స్త్రీకికలిగే కామవాంఛలకూ ఎలాటి సంబంధంవుంది? ఇలాటి ప్రశ్నలన్నిటికీ శాస్త్రీయ పరిశోధనా ఫలితాలతో కూడిన జవాబులున్నవి. ప్రతి ఒకరూపాయి. ప్రతిపుస్తకానికీ పోస్టేజి ప్రత్యేకం.

రూ 2-8-0 పంపేవారికి పై రెండు పుస్తకాలు రిజిస్టర్డుపోస్టు పంపబడుతవి. అభిసారిక ఏజంట్లదగ్గర దొరుకుతవి. లేదా,

**అభిసారిక కార్యాలయం, 4, బాలుమొదలి వీధి, మద్రాసు-17.**




సంపుటి: 1 | అక్టోబర్, 1954 | సంచిక: 4

దేశంలోని ప్రజల ఆరోగ్యం చాలావరకు ఆర్థిక పరిస్థితులమీద ఆధారపడి వుంటుంది. తగినంత సంపాదన ఉన్నవారు, విశాలమైన ఇళ్ళల్లో నివశించటం, సుఖపడేందుకు అవసరమైన ఆరోగ్య వాతావరణాన్ని సృష్టించుకోవటం చేయగలరు. అన్నపానాదుల్లోనైతేనేం, నిత్యజీవితంలోని క్రిమికీటకాదుల తాకిడిని తప్పించుకునేందుకూ, వాటిని పోరాడి జయించేందుకు ఐతేనేం, అథవా వ్యాధి సంక్రమించినట్లయితే, తగిన చికిత్సను పొందేందుకైతేనేం వారికి తగినన్ని అవకాశాలున్నవి.

కాని ఇదే తగినంత సంపాదన లేనివారిపట్ల విరుద్ధమౌతుంది; వారికి సరిగా తినేందుకు ఉండదు; సరైన పోషణ లేనందువల్ల అనారోగ్యం, ఉండే కొంపలు తగినంత విశాలంగా ఉండనందువల్ల, అందరికీ కావలసిన గాలీ, వెలుతురూ ఉండవు. ఇన్ని ఇబ్బందులమధ్యా ఏదైనా వ్యాధి సంక్రమించినట్లయితే, నిత్యజీవితానికే కటకట్లుగావుండే వారి గతి వేరుగా చెప్పనక్కర్లేదు; ధర్మాసుపత్రిలో ఎవరైనా దయదలుస్తే సరి; లేదా వ్యాధి కరుణించి, దానంతటది పోవటమో, లేదా రోగిని ఎగరేయటమో తప్ప మరోమార్గంలేదు.

ఏ అంటువ్యాధి వచ్చినా యీ గుడిసెలనుంచే బయలుదేరి,

వారినే అధికంగా హతమారుస్తుంది. ఐతే వీం ఆరోగ్యం సంగతి, వారికే కాకుండా వారి చుట్టుపట్ల నివశించేవా రందరికీ సంబంధించే వుంటుం దనటం అతిశయోక్తి కాదు, అంటువ్యాధి వారూ, వీరూ అనే భేదం లేకుండా పాకకుండా వుండేందుకు ఈ బీదల ఆరోగ్యంకూడా బాధ్యత వహిస్తుంది. దీనికి ప్రభుత్వమే కంకణం కట్టవలసిన అవసరం వుంది.

పైకి చెప్పకోని, చికిత్సకోసం బయలుదేరే వ్యాధులు అటుంచి సుఖవ్యాధుల్ని పరిశీలించినట్లయితే, నేడు దేశంలో నూటికి కనీసం 60 మందన్నా ఈ సుఖవ్యాధుల్ని ఎప్పుడో ఒకసారి అనుభవించే వుంటారు; ఈ అంచనాలు పరిసరాల్లో వున్నవారి జీవితానుభవాలు చూసినట్లయితే, ఎవరికైనా తేలిగ్గా అర్థంకాగలవు. అసలు సుఖ వ్యాధి ఎందుకు రావాలనేది ప్రశ్న కాదు; అది అంటువ్యాధిగా పరిణమించి, వ్యాధిగ్రస్థుల్నే కాకుండా అతని కుటుంబములోని వ్యక్తుల్నీ, ఏ పాపమెరుగని, రాబోయ్యే సంతానాన్నీ కలుషితం చేయకుండా చూడవలసిన బాధ్యత ప్రతిఒక్కరికీ వుంది.

అంధత్వం సంగతిచూస్తే నూటికి 80 మంది అంధులు గనేరియా కారణంగా వికలాంగు లవుతున్నారు. ఇదే నిష్పత్తిలో మిగతా సుఖవాధ్యుల తాలూకు దుష్ఫలితాలూ ఉంటవి.

ఇలాటిది జరగకుండా ఉండేందుకు, ఒక రకం నైతిక దృక్పథం అత్యవసరం. వ్యాధిగ్రస్థుడు వెంటనే చికిత్సను పొందాలి. ఆధునిక శాస్త్రీయ విజ్ఞానం యీ సుఖవ్యాధుల్ని చాలా తేలిగ్గా నివారించగలిగి వుంది. కనుక ఇతర వ్యాధులవలెనే దీన్నీ భావించి, త్వరలో విముక్తి పొందాలి; వ్యాధితో బాధపడినన్నాళ్ళూ, దాంపత్య జీవితంనుంచి విరమించాలి; వైద్యుడు వ్యాధి పూర్తిగా నయమైనదని రూఢిచేసే వరకూ బ్రహ్మచర్యాన్ని అవలంబించాలి. ఇందులో రోగగ్రస్థుని స్వార్థంకూడా వుంది; ఏ శరీరభాగం దెబ్బతిన్నదో, దానికి తగినంత విశ్రాంతి నివ్వకుంటే అది త్వరలో కోలుకోదు కదా!

వ్యభిచార వృత్తిని నిర్మూలించేందుకుగాను అనేక చట్టాలు ఏర్పడుతూనే వున్నవి; వ్యభిచార చరిత్ర తిరగేస్తే, ఎంతమంది కొమ్ములుతిరిగినవాళ్లు ఎన్ని చట్టాల్ని చేసినా ప్రయోజనంలేదనే సంగతే రుజూ అవుతూ వొచ్చింది. కాకపోతే ఒక రూపంలో అది కనిపించకుండాపోతే, మరో రూపంలో సాక్షాత్కరిస్తుంది. అందు లోనూ ఆర్థికంగా వెనుకబడిన దేశంలో వ్యభిచారం పెద్ద మోతా దుల్లో కనిపిస్తుంది.

దాన్ని రూపుమాపేందుకు ముందుగా కనీసం వ్యభిచారిణుల ఆరోగ్యం విషయమై జాగ్రత తీసుకోవాలి. వారి ఆరోగ్యం, మరో రూపంలో సామాజిక ఆరోగ్యమే ననవొచ్చు. ఇతర దేశాల్లోవలె వ్యభిచారిణుల్ని ఆరోగ్య శాఖవారు తరుచు పరీక్షించటం, అవసర మైతే చికిత్సలివ్వటం అత్యవసరం. ★

ముఖ్యంగా చదువతగ్గ 3 పుస్తకాలు!

1. సెక్సుమర్మాలు : (మొదటిభాగం)
2. గర్భనిరోధం
3. సెక్సు మర్మాలు (రెండవభాగం)

అందమైన ముఖచిత్రాలతోవున్న ఈ పుస్తకాలు ఒక్కొక్కటి 0-3-0 మాత్రమే! ఎనిమిదణాలు మనియార్డరు ద్వారా పంపినవారికి 3 పుస్తకాలూ పంపబడుతవి. ఏజంట్లకు 25% కమిషన్. కమిషన్ మినహాయించుకుని పైకం పంపినవారికే పుస్తకాలు పంపబడుతవి. శాంపిల్ కాపీ కావాలంటే ఒక్కొక్క దానికి నాలుగణాలు తపాలా బిళ్ళలు పంపాలి.

జాతీయ ప్రచురములు
పోస్టుబాక్సు 1878
6. వెంకట్రామయ్యర్ వీధి, మద్రాసు. 1.

నపుంసక తైలం

అంగనరములు బలహీనత చెంది, చిన్నదైన, తిరిగి యథాప్రకారమై పూర్తి సంభోగ సౌఖ్యమనుభవించుటకు.

1 సీసా రూ. 11-4-0

గర్భనిరోధిని

ఇటుమీదట గర్భం రాకుండా ఆపుటకు బహిష్టు రోజులలో సేవించే మందు. శరీరారోగ్యంకు భంగంలేదని అనేకమందిచే నిర్ధారణ చేయబడినది. 1,2, సం॥ల వరకు మందు గుణం యిచ్చును. 1సీసా రూ. 10/- వి. పి. 1-4-0. కావలసినవారు పైకం ఎడ్వాన్సుగా పంపేది. దర్మిలా అనేక జీవితకృవ మందులు బయలుదేరుచున్నను, 50సం॥ల ప్రఖ్యాతి నమ్మకం కలది యీసంస్థయే!

డాక్టర్ రత్నం సన్స్ మెడికల్ హాల్
మలకపేట బిల్డింగ్సు, హైద్రాబాదు.

# వార్తా ప్రపంచం

పాకిస్థాన్ పంజాబ్‌లో రెండువారాల వ్యవధిలో ఇద్దరు యువతులు సెక్సుమార్చుకున్న వార్తలు వొచ్చినవి. మొదటి ఆమె మనస్తత్వ వేత్త 15 సం॥ల వయసు కూతురు. ఆమె స్త్రీగా ఉన్నప్పటి పేరు ఖాల్దియా షఫ్‌కాడ్ జఫిరీ; పురుషుడుగా మారాక షఫ్‌కాడ్ జఫిరీ.

రెండో ఆమె మిస్ ముండాన్ - జంగ్ జిల్లాలోని అహమ్మద్ అనే చెప్పులు కుట్టుకునేవాని కూతురు. యీమెలో క్రమంగా విరుద్ధ జాతి లక్షణాలు పెంపొందినవి; దాంతోపాటు యీమె మనస్తత్వంలో కూడా మార్పువొచ్చింది. ఇప్పుడు ఆమెపేరు-మియాన్‌ముండాన్‌గా మారింది!

★

గుండెకు శస్త్రచికిత్స చేయటం చాలా ప్రమాదంకనుక, శస్త్రకారులకు గుండెజబ్బులున్న వాళ్ళకు తాము చేయగలదేమిటనే విషయం చాలా కాలంగా గొప్ప సమస్యగానే వుండిపోయింది. కృత్రిమమైన గుండెకాయనిచ్చి శస్త్రచికిత్స చేయటంవరకూ సాగిన వీరు, యీ మధ్యనే మరో కొత్తపద్ధతి కనిపెట్టారు.

అత్యుత్తమమైన యీ పద్ధతిలో గుండెకాయకు బదులు వేరొక గుండెకాయే సులభంగానూ, తేలిగ్గానూ సరిపోతుంది. యీ సత్యాన్ని ఆధారంగా తీసుకొని, మిన్నెసోటా విశ్వవిద్యాలయ వైద్య ప్రముఖులు కొత్తపద్ధతి శస్త్రచికిత్సలు ఆరంభించారు.

ఇది గుండెలోపాలతో పుట్టిన శిశువులకు అత్యంత ఉపయోగకరంగావుంది. శిశువు గుండెమీద శస్త్రచికిత్స జరిగినంతసేపూ, వేరొక గుండె, ఊపిరితిత్తులూ పనిచేసి. శిశువు శరీరంలోని రక్త ప్రవాహానికి

ఆటంకం లేకుండా సాగాలి. ఐతే యీ రక్తం శిశువు రక్తంతో కల వాలి; అంటే వేరొక గ్రూప్‌ది కాకూడదు.

దీనికి సరిపడేరక్తం శిశువు తండ్రిదే! రెండు టేబిల్స్ ఒకదాని పక్క వేరొకటివేసి, ఒకదానిమీద శిశువునూ, రెండోదానిమీద తండ్రినీ పడుకోబెట్టి, శిశువుమీద శస్త్రచికిత్స జరిగినంతసేపూ తండ్రి రక్తం శిశువురక్తంతో ప్రవహించేట్లు చేయటమే సూక్ష్మంగా యీ చికిత్సావిధానం. యీవిధంగా 30 లేదా 40 నిమిషాలు జరగాలి.

ఐతే ఇందులోకూడా చాలా ప్రమాదాలు సంభవించవొచ్చు. తగినన్ని జాగ్రతలు తీసుకొని 11 మంది శస్త్రవైద్యులు యీ చికిత్సకు పూనుకున్నారు. తండ్రితొడలోని రక్తనాళంనుంచి వేడిరక్తాన్ని శిశువు గుండెల్లోకి పంప్ చేయ నారంభించగానే చికిత్స ఆరంభమౌతుంది. యీ ఆపరేషన్ 17½ నిమిషాల్లో పూర్తయింది. రోగికి ప్రమాదం జరగ లేదు; అతని గుండెలోని కొద్ది ఖాళీ స్థలం పూరించబడింది.

కొద్ది రోజులయాక బిడ్డ నిమోనియాతో చనిపొయ్యాడు; గుండె బలహీనతలు వున్నవారికి యీ రకం వ్యాధులు తేలిగ్గావొస్తవి. వైద్యులు ఇదే విధంగా మరో 3 ఆపరేషన్లు చేశారు. ఇటు రోగులూ, అటు తండ్రులూకూడా ఏ విధమైన రోగచిహ్నాలనూ చూపలేదు.

అమెరికాలో వేల బిడ్డలు బలహీనమైన గుండెల్తో జన్మించటం కద్దు. యీ శస్త్రచికిత్సా విధానం ఉత్తరోత్రా చాలా ఉపయోగ కరంగా పరిణమించి, కనీసం సగంమందిని ఆరోగ్యవంతులుగా చేయ గలదని నమ్మవొచ్చు.

★

1945 లో నాగసాకీమీద ప్రయోగించబడిన ఆటంబాంబు రేడియేషన్ గర్భిణీ స్త్రీలమీద ఏ విధంగా పరిణమించిందనే విష యం లాస్ ఏంజిలీస్ పరిశోధకులు అంచనాలు తీశారు. రేడియే షన్ జరిగేందుకు దగ్గర్లోవున్న 98 మందిలోనూ, 30 మందిపట్ల బల మైన హాని జరగటంవల్ల అందులో ముగ్గురికి గర్భవిచ్ఛిత్తి ఐంది; నలు

గురు బిడ్డలు మానసికంగా చాలా బలహీనులుగా వున్నారు. మిగతా 68 మందీ పెద్దప్రమాదం నుంచి తప్పుకోగలిగారు; ఐతే వారిలోకూడా విగతజీవుల జననం, షాక్ తగిలిన బిడ్డలు కలగటం లేకపోలేదు; మొత్తంమీద రేడియేషన్‌కు దరిదాపుల్లోవున్న వారిలో కనిపించే దుష్ఫలితాలు, రేడియేషన్‌కు దూరంలోవున్న వారిపట్ల కలిగిన దుష్ఫలితాలకన్న చాలా ఎక్కువగానే వున్నవి.

★

న్యూగినియా మధ్య భాగంలోని ఒకానొక భాగంలో లక్షమంది ప్రజలునివశించే ఒక భాగంవుంది; ఇక్కడికి వెళ్ళటానికి పెద్దకొండలూ, సూర్యరశ్మికూడా చొరని అడవులు అడ్డంవున్నవి. యీ ప్రజలకూ, మిగతా ప్రపంచానికీ, ఏ విధమైన సంబంధమూ లేకుండానే వుంది.

విమాన ప్రయాణాల్లో వీరి ఉనికి కనిపెట్టబడింది. పెద్ద ప్రదేశాలు వ్యవసాయానికి ఉపయోగించబడటం గమనించబడి, వీరి ముఖ్య వృత్తి వ్యవసాయమేనని భావించబడుతోంది. బహుశా శతాబ్దాల తరబడిగా వీరు మార్పులేని జీవితాల్ని గడుపుతూవుండి వుండాలి.

వీరి ఇళ్లు గడ్డితో కప్పబడివున్నవి. వందమైళ్ల పొడుగులో వున్న అనేక లోయల్లో వీరు వ్యవసాయం చేస్తున్నారు. వీరి స్థితిగతుల్ని విచారించేందుకు ఆస్ట్రేలియన్ ప్రభుత్వం, త్వరలోనే కొంత మంది పరిశోధకుల్ని అక్కడికి పంపే ఏర్పాట్లు చేస్తూవుంది.

★

యువతుల్ని పట్టుకోవటం, వారిని చావబాదటం, అత్యాచారాలు, బలాత్కారాలు చేయటం మొదలైన నేరాల్ని, గొప్ప తున్న మంచి చదువు సంస్కారాలున్న ఏడుగురు అమెరికన్ యువకుల విషయం అమెరికన్‌లలో గొప్ప సంచలనాన్ని కలిగించింది.

ఇందులో నలుగుర్ని అరెస్టుచేశారు. వీరు సామాన్యంగా పార్కుల్లో కాపలాలు వేసి, యువతుల్నీ యువకుల్నీ ఒంటరిగా పట్టుకొని, వారిని గొడ్డును బాదినట్లు బాదటం, బలాత్కరించి, చివరకు చంపటం వరకూ వెళ్లారు

ఓహియోలో 17 సం॥ల వయసున్న ఒకానొక యువకుడు, మరో 12 సం॥ల వయసున్న ఒకానొక కుర్రవాని సహాయంతో, తన ఈడు యువతి సైకిల్ దొంగిలించి, ఆమెను బలాత్కరించాడు.

ష్కరియర్ అనే మరో దైవభక్తిపరుడు, రోజూ తప్పని సరిగా చర్చికి వెళ్ళే నియమమున్నతను, ఒక ఆడపిల్లను బలాత్కరించి, తరువాత కత్తితో పొడిచి చంపాడు.

యీగుంపులో 15 సం॥ల కుర్రాడుకూడా ఉన్నాడు. దీని విషయమై అమెరికన్ పోలీసులు, పార్కులన్నీ గాలిస్తూ చాలా మం దిని అరెస్టు చేశారు.

★

సృష్ట్యాదినుంచీ ఆహారాన్ని సంపాయించటానికి ప్రతి జీవరాశీ ప్రయత్నిస్తూనేవుంది; మానవుడు ఇంకా తెలివిగా ఆలోచించి, నానా అవసలూ పడుతూ, అనేక పరిశోధనల్ని చేసి ఆహారాన్ని వృద్ధిచేయ టానికి విశ్వప్రయత్నాలు చేస్తూనేవున్నాడు. అందులోనూ, ప్రపంచ జనాభా విపరీతంగా పెరిగిపోతూండటంవల్ల ఆహార సమస్య రోజు రోజుకూ కఠినంగా తయారవుతూనేవుంది.

దక్షిణ ఆసియా శాస్త్రీయ పరిశోధనాలయ ప్రధాని డాక్టర్ పి. సి. యంగ్ అనే అమెరికన్, సౌరాష్ట్రంలో వేరుసెనగనుంచి, పాలు, పెరుగు తయారుచేయటం భారీగా జరిగే అవకాశాలున్నవని ప్రకటిం చాడు. సౌరాష్ట్రం ఇండియాలోని వేరుసెనగ పంటలో 5-వ భాగాన్ని పండిస్తుంది.

వేరుసెనగపాలలో ఆహారంలో ఉండవలసిన భాగాలన్నీ ఉన్నవి; ఇది ఆవు, గేదెపాలకు ప్రత్యామ్నాయంగా ఉపయోగించ వొచ్చు. గేదెపాల ధరలో ఇది 5-వ భాగమే కావటంవల్ల, ఆర్థిక దృష్ట్యాకూడా దీన్ని ఉపయోగించవొచ్చు.

పూర్వం వేరుసెనగపిండిని ఎరువుగా ఉపయోగించేవారు; దీన్ని ఇప్పుడు ఆహారంగానే ఉపయోగించే అవకాశం ఏర్పడింది. ★



# పెళ్ళిళ్ళ పేరయ్యలు

సమాజవ్యవస్థ ఆరంభమైనప్పటినుంచీ వివాహం ఒక పెద్ద సమస్యగానే తయారైంది. ఇది ప్రతివ్యక్తి జీవితాన్నీ ఏదోవిధంగా తారుమారుచేస్తూ అనేక మార్పులకు కారణభూత మాతూనే వుంది.

వివాహాన్ని విజయవంతం చేసుకునేందుకు అనాదినుంచీ మానవుడు విశ్వ ప్రయత్నాలు చేస్తూనేవున్నాడు. తనకు నచ్చిన స్త్రీని ఎన్నుకునేందుకు అనేక మార్గాల్ని అన్వేషిస్తూనే వొస్తున్నాడు. కొంతమంది పత్రికప్రకటనల ద్వారానూ మరి కొంతమంది పెళ్ళిళ్ళ పేరయ్యల ద్వారానూ తమ వధువుల్ని ఎన్నుకుంటూనే వున్నారు. ఐతే 'నాలుగు అబద్ధాలాడైనా పెళ్ళిచెయ్యమ'నే సామెతను పట్టుకొని వేళ్లాడటంవల్ల, యీ పెళ్ళిళ్ళ పేరయ్యల బతుకులు అబద్ధాల మీదనే ఆధారపడటం, క్రమంగా సమాజంలో వారు దిగజారటం జరిగింది.

మొదట్లో 'పెళ్ళిళ్ళ పేరయ్యలు' లేరు. సమిష్టిగా ప్రతి మొగవాడికీ, ప్రతి ఆడదీ భార్యగానే వుండేది. క్రమంగా వ్యక్తిగతమైన ఆస్థులంటూ ఏర్పడే సాగాక, ఒకోడు ఒకత్తెనో, లేక కొంత మంది స్త్రీలనో స్వంతం చేసుకోవటం జరిగింది. అంటే ఆడది కూడా ఆస్థిలో ఒక భాగమైందన్నమాట. యీ ఆస్థిని కొనుక్కునేందుకు, లేదా సంపాయించేందుకు మరికొంత మంది సహాయం అవసరమైంది; పెళ్ళిళ్ల పేరయ్యలు పుట్టటం అప్పుడే మొదలైంది.

ఐతే మొదట్లో యీ పేరయ్యలకు చాలా గౌరవం వుండేది. కాబోయే దంపతుల సౌఖ్యమంతా అతని మీద ఆధారపడి వుండేది. నీటముంచినా పాల ముంచినా అతనే! అదీగాక వివాహం పవిత్రమైనదిగా భావించబడుతుండటం వల్ల, ఆ పవిత్రత పేరయ్యగారి వృత్తికి కూడా సోకింది. యీ పెళ్ళిళ్ళ పేర

య్యాలు చాలా కాలంగా వుంటున్నారు. ఇండియాలోనే కాకుండా, మహమ్మదీయ దేశాల్లోనూ, క్రైస్తవమత దేశాల్లోనూ, దాదాపు లోకమంతటా ఏదోవొక రూపంలో వీరు యీనాటికీ పటివులుగానే వున్నారు.

సామాజిక జీవనం ఆరంభమయాక ప్రతి వారూ ఏదో వొక వృత్తిని ఆధారం చేసుకోవాల్సి వొచ్చింది. మొదట్లో లేని అనేక వృత్తులు ఏర్పడసాగినవి. అన్ని పనులూ ఏ ఒక్కరూ చేయలేరు కనుక, ఒకోరు ఒకోపని చేసుకుంటూ ఇతరులకూ, అవసరమైన వారికీ చేదోడు వాదోడుగా వుంటూ సామాజిక జీవనాన్ని సుఖమయం చేయసాగారు. ఇలా కొత్తగా కనిపెట్టబడిన వృత్తుల్లో యీ పెళ్ళిళ్ళ పేరయ్యలు, వివాహానికి మధ్యవర్తిత్వాన్ని వహించే వృత్తిని సృష్టించారు.

పెళ్లీడుకు వొచ్చిన యువతీయువకుల వివాహం ఎంత ముఖ్యమైనదైనప్పటికీ, వరుణ్ణో వధువునో వెతుక్కుంటూ తిరగటం ఒకపట్టాన తేలదు. వారి తరఫున వారి పెద్దలు తిరగసారంభించినా, అసలు ప్రపంచమే కొత్తగా కనిపించే పర్యంత మౌతుంది. అదీగాక తగిన సంబంధం ఎక్కడవుందో తెలుసుకునేందుకు దేశమంతా వెతకటమంటే మాటలు కాదు; తిరిగేందుకు ఎంతో ఓపిక కావాలి. చాలా ధనవ్యయం, కాలవ్యయం; త్వరలోనే విసుగెత్తి పోతుంది.

యీ అవసలు లేకుండా చాలా కాలంగా వృత్తిలోవున్న పెళ్లిళ్ల పేరయ్యలు, నీకు కావలసిన వివరాల్ని ఇట్టే చెపుతారు. వారి దృష్టిలోవున్న వధువుల్నో, వరుల్నో వారి వారి కుల గోత్రాలలో, చదువు సంధ్యల్లో, ఆస్తివివరాల్లో, కుటుంబ గౌరవాల్లో, వంశపారంపర్యతల్లో సహా ఏ కరువు పెడతారు. నీవు అనుకున్న విధానికి దగ్గర్లోపడ్డ వ్యక్తుల్ని చూసి, బేరసారాలు కుదుర్చుకొని వివాహమాడేందుకు సహాయపడతారు.

వీరివల్ల ఇంకో పెద్ద ఉపయోగం వుంది. వీరి అవసరమల్లా బంధువర్గాల్లోని వరులు, లేదా వధువులు దొరకనప్పుడే కదా! అంటే కొత్త వ్యక్తుల్తో వైవాహిక విషయాలు మాట్లాడటమంటే ఒకరకం 'డెలికసీ' వొచ్చిపడుతుంది. నిర్మొహమాటంగా, ఖచ్చితంగా ఏమీ చెప్పటం పడదు. అలా మాట్లాడుతే తనను గూర్చి ఏమనుకుంటారోననే భయం పీడిస్తుంది. అలాటి సమయాల్లో వారికీ వీరికీ మధ్య డోల్లు పుచ్చుకొమ్ముల్లే తిరుగుతూ, వారి హృదయాన్ని వీరికీ, వీరి హృదయాన్ని వారికీ వివరిస్తూ, చివరకు మధ్యవర్తిగా తానే ఫైసల్ చేయటం జరుగుతుంది.

పూర్వం మన దేశంలో పెళ్లిళ్ల పేరయ్యల గౌరవం చూడాలంటే పురా

---

ఏనుగు బరువు 5 టన్నులు; పరిపూర్ణంగా పెరిగిన దాని దంతాలబరువు 200 పౌనులు ఏగును 2,000 పౌనుల బరువును మోయగలదు. దీని పిండం బరువు 58 పౌనులు.

ణాలు తిరగేస్తే తెలుస్తుంది. రుక్మిణీ కల్యాణంలో, బ్రాహ్మణుడే మధ్యవర్తి. నలోపాఖ్యానంలో దమయంతినీ, నలుణ్ణి వెతుక్కొచ్చేందుకు వెళ్ళింది బ్రాహ్మణులే! రాకుమారులకూ, రాజకుమార్తెలకూ తగిన వధువును, లేదా వరుణ్ని వెతికేందుకు దేశదేశాలూ తిరిగేపనీ, వారి వారి, చిత్రపటాలు పోగుచేసీ, గుణగణాల వివరాల్ని చెప్పి ఒప్పించటం వీరి పని. రాజాస్థానాల్లో పెళ్లిళ్ల పేరయ్యలది పెద్ద చెయ్యిగానే వుండేదనే దృష్టాంతరాలు అనేకం ఉన్నవి.

రాజాస్థానాల్లో ఐతే ఉద్యోగులుగానే వుండేవారు; వీరిని భరించగలిగే తాహతు రాజులకు ఉండేది. మరి సామాన్యుల సంగతేమిటి? సామాన్యుల విషయంలో కేవలం 'బ్రోకర్' పద్ధతుల మీదనే పెళ్ళిళ్ళ పేరయ్యలు పనిచేసేవాళ్లు. సామాన్యంగా, కట్నంతాలూకు పైకంలో నూటికి ఇంత అనేపద్ధతి వుండేది. ఇందువల్ల ఎంత ఎక్కువ కట్నం రాబట్ట గలుగుతే తన కమీషన్ కూడా అంత ఎక్కువవుతుంది కనుక, యీ పేరయ్యలు తీయతీయని మాటలుచెప్పి వరుని తాలూకు జనానికి ఎక్కువకట్నం ఇప్పించి ప్రియతములవుతారు; కుటుంబానికి అటు భారంగా వున్న ఆడపిల్లను వొదిలించి, వధువు తాలూకువారికి సన్నిహితుడవుతాడు. యీ విధంగా అటు డబ్బూ ఇటు గౌరవంకూడా సంపాయించుకో గలుగుతాడు.

రోజూవృత్తిమీద సమాజంలోతిరిగే వ్యక్తి కనుక, ఒకో కుటుంబాన్ని గూర్చిన వివరాలు ఎన్నో తెలుసుకునే అవకాశాలు ఇతనికి ఉంటవి. వినికిడి వలన, కుతూహలంవల్ల ఎంతో ఇన్ఫర్మేషన్ పోగుచేసుకుంటాడు. సాధారణజనం యీ వివిరాలు తెలుసుకునే అవకాశం ఉండదు. కనుక పెళ్ళిళ్ళ పేరయ్యను పట్టుకుంటే సంవత్సరాల తరబడి పట్టేపని, క్షణాల్లో తేలిపోతుంది. ఇక్కడ పేరయ్య వ్యాపారే కాకుండా, సామాజికంగా చాలామంది లోటుపాట్లు తెలిసిన ఘనుడు! అందుకనే సమాజంలో అతనికి భయపడి, అందరూ అతన్ని గౌరవించాల్సిన అవసరం ఏర్పడింది.

కేవలం మధ్యవర్తిత్వంచేసి ధన సంపాదనే కాకుండా, దేశంలోని యువతీ

> ఉమర్ ఖయ్యాం 11-వ శతాబ్దపు పారశీక కవి. ఈయన కవిత్వం అనేక భాషల్లోకి అనువదించబడింది. ఔరంగజేబు ఉమర్ ఖయ్యాం రచనలను ఎవరూ చదవకూడదనివిగా శాశించాడు; కాని ఔరంగజేబు కుమార్తె, జేబున్నిసా ఉమర్ ఖయ్యాం రచనలను పారాయణ చేస్తూండేది; ఈ విషయమై ఔరంగజేబును అడిగినప్పుడు, ఆ రచనలు సామాన్యులకు అర్థంకావని తప్పుకోవాల్సి వొచ్చింది.

యువకులకు సహకారంగా వుంటూ, వారివారి వైవాహిక సమస్యల్లో చేదోడు వాదోడుగా వుంటూ అటు ధన సంపాదనా, ఇటు కొంత సామాజిక సేవా చేసుకోవటం కుదరదా? ఇదేమీ సాధ్య పడనిది కాదు. ఐతే వ్యక్తిగత లాభాల మాట కాస్సేపు మరిచిపోయి, విజయవంతమైన దాంపత్యాన్ని ఏర్పాటు చేయటమే గురిగా పెట్టుకోవాల్సిన అవసరం ఎంతైనా వుంది. మంచి వ్యాపారం- మంచి పద్ధతులమీదా, నమ్మకాలమీదా, గౌరవం మీదా, ఆయా కాతాదార్ల తృప్తిమీదా ఆధారపడి వుంటుందనే సత్యం యీ నాటిది కాదు. ఇది కొంచెం చుట్టుతోవ ఐనప్పటికీ, కాలం సాగేకొద్దీ రాజమార్గంగా తయారై, వ్యాపారాభివృద్ధికి ఎంతైనా తోడ్పడుతుంది. ఏదో విధంగా అటువారికీ, ఇటువారికీ నచ్చచెప్పి, మూడుముళ్ళూ వేయించి, కమీషన్ చేతులో వేసుకొని తులకటం తేలికే కావొచ్చు కాని, ఆదంపతులు జిన్మంతా యీ మధ్యవర్తి జీవానికి పడి ఏడవటం తప్పదు. పోతే, వారికీ వీరికీ నిచ్చే మనువులే మాట్లాడినట్లయితే, ఆవివాహం విజయవంతమై, ఆ దంపతులు తమ స్నేహ బృందాలకు కూడా యీ మధ్యవర్తుల్ని సంప్రదించమనటం, ఆవిధంగా కాతాదార్లు అధికమవటం జరుగుతుంది. యీ రెండోపద్ధతిలో కావలసిందల్లా శ్రమా, ఓర్పూను.

> గ్రీక్ మతాధికారులు సౌందర్యపోటీలను గర్హిస్తూ ఒక ప్రకటనచేశారు. ఈపోటీలు మానవ సభ్యతకూ, గ్రీక్ ఆచార వ్యవహారాలకూ విరుద్ధమనీ, క్రమంగా ఇందువల్ల జాతి అభిరుచులు నీచబరచబడుతవి కనుక, ఎవ్వరూ ఇందులో పాల్గొనరాదని అన్నారు. ప్రభుత్వం కూడా ఈ ఒత్తిడికి లొంగి, సౌందర్యపోటీల్ని బహిష్కరించింది.

ఇలాటి దృష్టితోనే విదేశాల్లో అనేక వివాహ బ్యూరోలు వెలసినవి. మన దేశంలో కూడా చెదురుగా వున్నాయి కాని, వాటిద్వారా విజయవంతమైన వివాహాలు జరుగుతూన్న వార్తలులేవు. ఒకవేళ వున్నా, అవి వేళ్లమీద లెక్కపెట్టేవిగానే ఉండటం వల్ల, వాటి ప్రస్తావన ఇక్కడ వొదిలేస్తున్నాం.

యీ బ్యూరోల్లో పనిచేసేవాళ్లకు వ్యక్తిగతమైన లాభాలంటూ వుండవు- వారి జీతాలు మినహాగా. అందుకనివారు బొంకవలసినపనీ, ఎలాగైనా ముడిపెట్టించేందుకు పలుకు బడుల్ని ఉపయోగించ వలసిన అవసరం మొదలైనవి లేవు. ఎంతకూ కాతాదారుని ఎంతబాగా తృప్తిపరచటమా అనేదే వారిగురి.

యీ బ్యూరోల వల్ల మరో ఉపయోగం వుంది. పత్రికలో ఎక్కడో ప్రకటన చూసి, తీరా రంగంలోకి దిగాక, ఆ ప్రకటనలో నూటికి 80

పొంతులు అబద్ధాలేనని తెలుసుకున్న కేసులు అనేకం. ప్రకటనకు ఇచ్చేవన్నీ సద్గుణాలే కాని, దుర్గుణాలు కాకుండా ఉండటం సర్వసామాన్యం కనుక, యీ విధమైన మోసం జరిగే అవకాశం ఎంతైనా వుంది. మరో ఇబ్బంది ఏమంటే యీ రకంగా కొంతమంది మోసపోయ్యారని తెలుసుకున్నాక, పొరపాటున మంచి ప్రకటన కనిపించినా, అదీ ఏదో చెల్లని నాణెంలాగే చూడబడుతుంది. దీనికి తోడు ఆ ప్రకటన మోసం చేసేందుకు ఎంతబాగా ప్రయత్నించి వుంటుందో, ప్రకటన చదివి వరునిగానో వధువుగానో దరఖాస్తు పెట్టుకునే వారి మనస్తత్వం, అంతకు తక్కువ మోసాన్ని గురి చూడదు. ఇదీ అదీ కలిస్తే మోసం రెండింతలవుతుంది. ఐతే గంతకుతగ్గ బొంతల్లే ఉభయులూ సరిపెట్టుకోవటం న్యాయమే ఐనప్పటికీ, తాను ప్రయత్నించిన మోసం సంగతి మరిచిపోయి, ఎదుటివ్యక్తి తాలూకు మోసాన్నే మనసులో ఉంచుకొని ఆ సంబంధాన్ని వొదులుకోవటమో, లేదా చేసుకున్నట్లయితే జీవితమంతా వ్యథతో గడపటమో జరుగుతుంది. అసలు పత్రికా ప్రకటన చూడగానే ఎవరో పనికిరానివాళ్ళు, తమ ప్రాంతాల్లో వివాహయోగ్యత లేనివాళ్లు యీ విధంగా దేశంమీదికి ఉరికారనే భావం మనలో చాలామందికి ఉండటంలో ఆశ్చర్యం లేదు. ఇదీ, యీదేశంలోని పెళ్ళి ప్రకటనల విలువ!

పత్రికా ప్రకటన ద్వారా వధువును లేదా వరుణ్ని సంపాయించే విధానం మొట్టమొదట 1727 లో జరిగింది. హెలిన్ మోరిసన్ అనే యువతి తన దృష్టిలో పరిపూర్ణమైన పురుషుడు ఎలాటివాడో వివరిస్తూ, అలాటి భర్త కావాలని ఇంగ్లండులోని 'మాంఛెస్టర్ వారపత్రిక' లో మొట్టమొదటి సారి ప్రకటించింది.

యీ ప్రకటన ఫలితాలు ఇవి: ప్రకటన చదివిన వారందరూ నైతికంగా పతన మౌతున్నామని భయపడ్డారు. ఇది చాలా విచిత్రంగా ఉండటమే గాక, ప్రభుత్వంకూడా యీవిధానాన్ని గర్హిం

తగినంత ఆహారం దొరకకుంటే వేరొక ప్రదేశాలను వెతుక్కోవటమనేది సృష్ట్యాది నుంచీ జీవరాసులన్నీ చేస్తూన్న పనే. ఐతే ఇలా ఎంతదూరం వెళ్ళగలవు – ఎలా వెళ్ళగలవు అనేది ప్రశ్న.

ఆస్ట్రేలియాలో నివశించే ఒకానొక జాతి బాతు ఈ విధంగా 2,000 మైళ్ళు వెళ్ళింది; ఇది అంతదూరం ఎలా పోగలిగిందో ఆశ్చర్యమే! ఈ మధ్యనే ఆస్ట్రేలియాలోని బుర్డెకెన్ నదీ తీరంలో పట్టుబడిన బాతుమీద, 1952 జూన్ 5 వ తారీకున మెల్‌బోర్న్‌లో ఫిషరీస్ డిపార్ట్‌మెంట్ వారు వేసిన గుర్తులు కనిపించినవి.

చింది. ఆ యువతి అరెస్టు కాబడి, ఆమె మానసిక ఆరోగ్యం ఎలాటిదో పరీక్షించేందుకు పిచ్చాసుపత్రికి పంప బడింది.

227 సం ల తరువాత, అంటే యీనాడు పత్రికల్లో ప్రకటన ద్వారా భర్తల్నీ, భార్యల్నీ పొందటం నేరం కాదు. ఇదీ ఒక మంచి పద్ధతిగానూ, సభ్యతా ప్రపంచం ఒప్పుకున్న విధానంగానూ చలామణీ అవుతోంది.

పోతే పశ్చిమ దేశాల్లో సంగతి చూద్దాం: పెళ్ళిళ్ళు కుదిర్చేందుకు కొన్ని సంస్థలే బయలుదేరినవి. యీ సంస్థలు నమ్మకానికీ, సేవకూ ప్రసిద్ధికెక్కినవి. వివాహమాడగోరే యువతీ యువకుల ఫోటోలు, వారివారి వృత్తులు, కుటుంబ చరిత్రలూ మొదలైనవన్నీ పోగుచేసి సరైన సంబంధాన్ని వెదకటంవీరిపని.

దీనికి ఒక పద్ధతంటూ వుంది. వరుడో, వధువో కావలసినవారు, వారి ఆఫీసుకు వెళ్లి, ఒక అప్లికేషన్ ఫారాన్ని పూరించాలి; అందులో అనేక వివరాలు అడుగబడుతవి; వంశవృక్షం దగ్గర్నుంచీ, వ్యక్తిగతమైన అభిరుచులూ, చదువు సంసంధ్యలూ, ఆస్తిపాస్తులూ, ఉద్యోగ సద్యోగాలూ, తూకం, ఎత్తు మొదలైనవి- పెద్దచాట భారతమంత వుంటుంది. యీ ఫారానికి ఒక ఫోటోకూడా తగిలించాలి. మరోఫారంలో తనకు ఎలాటి యువతి కావల్సింది, ఆమె ఏయే వయవయస్సుల మధ్య ఉండాలి, ఎంత ఎత్తు ఉండాలి, ఏరకం మొహం కావాలి, ఎంతవరకూ చదివి ఉండాలి. దాంపత్య జీవితానికి ఆమె సంపాదన కూడా అవసరమా, సన్నగా వుండాలా, లావుగా వుండాలా మొదలైన అనేక వివరాలు రాయాలి. ఇప్పటికి రిజిస్ట్రేషన్ జరుగుతుంది; దీనికి నియమించబడిన ఫీజు కట్టెయ్యాలి. అవసరమైనప్పుడు తెలియపరుస్తామనటంతో ప్రస్తుతపని పూర్తవుతుంది.

కాన్పుల లెక్కల్ని పరిశీలిస్తే కవలలు, అంతకన్న ఎక్కువమంది ఒకే కాన్పులో కలగటానికి 87 కూ ఒక అవినాభావసంబంధం వున్నట్లు తేలుతుంది. ఉదాహరణకు: ప్రతి 87 కానుల్లోనూ ఒక కాన్పు కవలల్ని ఇస్తుంది. ప్రతి $87^2$ $(87 \times 87)$ అంటే 7,569 కాన్పుల్లోనూ, ఒక కాన్పులో ముగ్గురు బిడ్డలు జన్మిస్తారు. ప్రతి $87^3$ $(87 \times 87 \times 87)$ అంటే 658,503 కాన్పుల్లోనూ ఒక కాన్పులో నలుగురు శిశువులు పుడతారు. ప్రతి $87^4$ $(87 \times 87 \times 87 + 87)$ అంటే, 57, 279, 761 కాన్పుల్లోనూ ఒక కాన్పులో ఐదుగురు బిడ్డలు కలుగుతారు. ఒకే కాన్పులో ఐదుకుమించిన సంతానం కలగటం, కలిగినా వారు సజీవులుగా ఉండటం ఇంతవరకూ రూఢిగా తేలలేదు.

వరుని దరఖాస్తు దగ్గర పెట్టుకొని, అతను కోరేరకం వధువుకోసం పూర్వపు దరఖాస్తులన్నీ జాగ్రత్తగా పరిశీలించ బడుతవి. సుమారుగా సరిపడే దరఖాస్తు లేమన్నావుంటే వాటిని తీసివుంచి, వరుడు పిలవబడుతాడు. వాటిల్లో నుంచి ఒక దరఖాస్తు ఏరుకోవటంలో అతని పని పూర్తవుతుంది.

ఇప్పుడు యీ వరునితాలూకు వివరాలు, అతను ఎన్నుకున్న వధువుకు చూపబడుతవి. ఆమె ఇంటర్ వ్యూకు ఒప్పుకున్నట్లయితే, అదిఏర్పాటు చేయబడుతుంది. వారిద్దరూ మాట్లాడుకున్నాక ముఖాముఖీ తేల్చుకోవటం జరుగుతుంది.

యీ సంస్థలు దేశంలోని నలుమూలల్లోనూ వున్న యువతీ యువకుల వివరాల్ని గుచ్చిఎత్తి ఉంటవి. ఎవరుకానీ, వారి చుట్టుపట్ల వ్యక్తులు తప్ప దూరాన వున్నవారితో పరిచయాన్ని కలిగివుండరు కదా! తన మనసుకు నచ్చిన వ్యక్తి తాను తిరిగే సమాజంలో కనిపించక పోయినప్పటికీ, యీరకం సంస్థల సహాయంతో దేశమంతా గాలించినట్లే అవుతుంది. తన స్వప్నసుందరి, లేదా స్వప్న సుందరుడు దొరకవొచ్చు.

మరికొన్ని సంస్థలు వివాహాన్నికోరే యువతీయువకుల ఎడ్రసుల్ని మాత్రమే పోగుచేసి వుంచి, నియమితమైన ఫీజు చెల్లించే వారికి, కొన్ని ఎడ్రసులు అప్పగించటం, వారు ఉత్తరాలద్వారా పరిచయులై, క్రమంగా స్నేహంగా మారి, ఆ తరువాత ప్రణయంగామారి దంపతులవటంకూడాకద్దు. ఐతే ఇది అనుకున్నంత విజయవంతమైన పద్ధతిగాతోచదు.

సైన్సు అభివృద్ధికా సాగాక, జీవితంలోని ప్రతి కోణంలోనూ ఎన్నో మార్పులు వొచ్చినవి. అదే విధంగా యీ పెళ్ళిళ్ల పేరయ్య తనంలోకూడా మార్పులు సంభవించినవి.

ఉదాహరణకు: వధూవరులు ఒకరి ఫోటోను మరొకరు చూసుకొని నచ్చిందనుకోవటం, తీరా మనిషిని చూసేటప్పటికి, ఫోటోకూ, వ్యక్తికీ పోలికలు వున్నా చాలా భేదంవున్నట్లు తెలుసుకొని నిరాశపడటం జరుగుతోంది; లేదా ఏ నడకో బాగుండకపోవటం, ఆమె ప్రవర్తనే నచ్చకుండటం జరగొచ్చు. స్టిల్ ఫోటోలో వ్యక్తి ఏ కోణం నుంచి బాగుంటాడో చూసి, ఫోటోగ్రాఫర్ తన కళను ఉపయోగించటంవల్ల యీ మోసానికి అవకాశం ఏర్పడుతోంది.

అందుకని యీ సంస్థలు కొత్త పద్ధతిని ప్రవేశపెట్టినవి: వ్యక్తి తాలూకు సినిమా ఫిలిం తీయటం, దాన్ని చూపటం. ఇందువల్ల ఆ వ్యక్తిని వివిధ కోణాల్లో చూడొచ్చు; ఆమె నడక, వయ్యారం, కూర్చునే పద్ధతీ, నిలబడే పద్ధతీ, నవ్వే విధానమూ మొదలైనవన్నీ స్పష్టంగాముందే తెలుసుకోవచ్చు.

ఇంత వరకూ నచ్చుతే, ఆమె కంఠస్వరం తాలూకు టేప్ రికార్డింగ్ వేయబడుతుంది. ఆ మనిషంతా బాగుండి, కంఠస్వరం బాగుండకుంటే మళ్ళీ అసంతృప్తే కదా! దీంతో పరీక్షలుచాలా వరకు పూర్తయినట్లే. అవతలి వ్యక్తికికూడా, యీ వ్యక్తి తాలూకు ఫిలిం చూపబడుతుంది; నచ్చినట్లయితే ఇంటర్ వ్యూ ఏర్పాటు చేయబడుతుంది. ఆ తర్వాత దంపతులవటం, కాకుండటం వారి వొంతు! ★



# నీలి నీడలు

రచన: సూర్యారావు.

మేడపై అంతస్తుమీద ఒకనీడ నడిచి చివరకు వచ్చింది. అక్కడకు వచ్చి సందేహిస్తున్నట్లు ఆగింది. ఆగి కిందికి చూసింది. అంత ఎత్తునుంచి కిందికి దూకితే...! ఆకస్మికంగా నాకు సందేహం కలిగింది. చేతిలోనికలాన్ని టేబిలు మీదపెట్టి-టెరేస్‌మీద వెలుతురు ప్రసరించని ప్రదేశంలోకి వచ్చి-ఎదురుగా వున్న ఆ మేడకేసి చూస్తూ నుంచున్నాను. ఎవరో మగవాడే! అతని కదలికలను బట్టి ఆత్మహత్యకు ప్రయత్నిస్తున్నాడని ఊహించాను. పాపం! అతని జీవితంలో ఆత్మహత్యకు పురికొలిపే సంఘటన లేం జరిగాయో! అతని హృదయం ఎంతగానో గాయపడి వుండాలి. లేకపోతే నిండు ప్రాణాన్ని నిలువునా తీసుకోడానికి ఉపక్రమించడు. అంతులేని ఆలోచనలతో అలాగే నిలబడిపోయాను. అతను ఏక్షణంలోనైనా మేడమీదినుంచి క్రిందికి దూకెయ్యవచ్చు. ఇవేళ నాకళ్లముందు ఓ ఘోరకృత్యం జరగబోతున్నది. నావొళ్ళు జలదరించింది. చూస్తూ చూస్తూ ఆ మనిషిని చావనివ్వడం ఘోరం అనిపించింది. అతను యింకా మేడచివరి అంచుమీద రాతివిగ్రహంలా కదలకుండా నుంచుని వున్నాడు. బహుశా చివరిసారి దైవప్రార్థన చేసుకుంటున్నాడేమో! ఆ యింట్లో వున్న వాళ్ళను లేపి యీ విషయం తెలియజేస్తే అతన్ని తాత్కాలికంగా ఆత్మహత్యా ప్రయత్నంనుంచి తప్పించవచ్చు.

రెండవ అంతస్థులోకి చూశాను. ద్వారానికీ కిటికీలకూ కర్టెన్సుకట్టి వున్నాయ్. ఆ కర్టెన్సులోంచి బయటకు నీలికాంతి ప్రసరిస్తోంది. డోర్‌కర్టెన్ మీద ఒకనీడ కనిపిస్తోంది. ఆ నీడకు పొడుగాటి వాలు జడవుంది. చేతిలో పుస్తకంవుంది. యీ లోకంతో సంబంధంలేనట్లు కుర్చీలో కూర్చుని హాయిగా చదువుకుంటోంది. పాపం! ఆమెకు మూడవ అంతస్థుమీది వ్యక్తిచేసే ఆత్మహత్యా ప్రయత్నం తెలీదు. తెలిస్తే అంత ప్రశాంతంగా కూర్చోగలదా?

యింతలో మరో నీలినీడ గదిలో ప్రవేశిస్తున్నట్లు కనిపించింది. లాల్చీ, పంచె కనిపిస్తున్నందువల్ల యిప్పుడు ప్రవేశించిన మనిషి మగవాడని గుర్తించాను. ఆ నీడ బరువుగా కదిలి కుడిప్రక్కకు పోయి అదృశ్యమయ్యింది. ఆమె లేచింది. చివాలున ఎడమప్రక్కకు పోయి అదృశ్యమయ్యింది. అదేదో స్వప్న భూమిలా కనిపించింది.

యింతలో ఆత్మహత్యకు ప్రయత్నిస్తున్న వ్యక్తి జ్ఞాపకంవచ్చాడు. మూడవ అంతస్థుకేసి చూశాను. ఆశ్చర్యం! అతను అక్కడలేడు. నేను పరధ్యానంగావున్న సమయంలో కొంపదీసి క్రింద పడలేదుకదా! నా సందేహానికేమీ ఆస్కారంలేదు. ఇంత ఎత్తు నుంచి మనిషి క్రిందికి దూకితే శబ్దం కాదా? అతను ఆత్మహత్యా ప్రయత్నాన్ని విరమించి లోనికి వెళ్లిపోయి వుంటాడు. రెండవ అంతస్థులో ప్రవేశించి కుడివైపు అదృశ్యమైన నీడ అతనిదే అని ఊహించి తృప్తిపడ్డాను. యిక ఆ రాత్రి నేను ప్రారంభించిన కథను పూర్తి చెయ్యలేక పోయాను. దీపం ఆర్పి నిద్రపోయాను.

మర్నాటి టపాలో రాజారావు దగ్గరనుంచి ఉత్తరం వచ్చింది. దానిలో వాడు రాసిన యీ మాటలు నాలో కలవరాన్ని కలిగించినై.

"—ఒక్కో సమయంలో నాలో ఎంతో ఉత్సాహం కలుగుతుంది. ప్రపంచంలో నేను సాధించలేని కార్యమంటూ ఏదీ లేదనిపిస్తుంది. నేను అతి దగ్గర భవిష్యత్తులో ఏదో గొప్పవాణ్ణి అయిపోతున్నట్లుగా భావించుకుంటాను. యిక అక్కడి నుంచి జీవితమంతా ఆనందమయంగా గడపొచ్చని-తీరని కోరికలన్నీ తీరి పోతాయని దృఢమైన విశ్వాసం కలుగుతుంది. కాని మరికొన్ని సమయాల్లో నేను వట్టి అసమర్థుణ్ణని — నేనేమీ సాధించలేనని—

ఇంతకుపూర్వం రష్యాలో గర్భస్రావాలు నేరాలుగా పరిగణించబడుతూండేవి. 1954 ఆగష్టు ౮-వ తారీకున గర్భస్రావం చేసుకోవటం నేరం కాదనే చట్టం అమల్లోకి వొచ్చింది.

పూర్వం ఒక్క వైద్యసలహా మీద తప్ప గర్భస్రావం జరగకూడదనే చట్టంవుండేది. ఇప్పుడు ఇష్టానుసారం గర్భస్రావం చేసుకోవొచ్చు. ఐతే ఎవ్వరూ స్త్రీలను గర్భస్రావం చేసుకోమని వొత్తిడి చేయరాదు.

మరోపక్క బిడ్డల్ని కనటాన్ని సోవియట్ ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. పదిమందీ, అంతకన్న ఎక్కువ బిడ్డల్నికన్న తల్లుల్ని 'వీరమాతలు'గా గౌరవించటం నేటికీ వుంది.

ఎన్నాళ్లు బ్రతికినా యీ జీవితం నిరర్థకం అని—నాలో నిస్పృహా, నిరాశా కలుగుతాయి. యీ జీవితాన్ని బలవంతంగా ముగించుకోవడమే మంచిదనిపిస్తుంది. మనసు విప్పి చెప్పుకోడానికి నీకంటే నాకెవరూ లేరుగనక నా సమస్యలను నీకు తెలియజేసి నిన్నుకూడా బాధ పెట్టవలసి వస్తోంది.'

పాపం! రాజారావు నరాల బలహీనతతో బాధపడుతున్నాడని తెలుసుకున్నాను. నరాల బలహీనతనుంచి వాడిని తప్పించకపోతే ఏ క్షణంలోనైనా వాడు ఆత్మహత్య చేసుకోవచ్చు. వాణ్ణి కొంతకాలం యీ ప్రశాంతమైన ప్రదేశంలో వుంచితే బలహీనత నుంచి కోలుకుంటాడేమోనని తలిచాను. వెంటనే బయలుదేరి రమ్మని ఆ రోజే తిరుగు టపాలో రాజాకు ఉత్తరం రాశాను.

ఆ రాత్రికూడా పై అంతస్థు మీద నీడ కనిపించింది. విందు ప్రాణాన్ని తీసుకోగల గుండె ధైర్యం అతనిలో లోపించి వుండాలి. లేకపోతే అతను యీ రోజూకూడా మేడచివరి భాగానికి వచ్చి కళ్లప్పగించి చూస్తూ ఎందుకు వూరుకోవాలి? ఒక వేళ కళ్లు మూసుకునే ఉరకడానికి ప్రయత్నిస్తున్నాడేమో? రెండవ అంతస్థులో యధాప్రకారం నీలికాంతి ప్రసరిస్తోంది. నీలినీడ పుస్తకం చదువుకుంటోంది. ఆమె ఎవరు? అతనెవరు? ఆమెలో ప్రశాంత చిత్తం, అతనిలో చంచలత్వం ఎలా ఏర్పడినై? యీ తీరని సందేహాలు నాలో అలా కొంత కాలం నిలిచి పోయినై.

వారంరోజుల తరవాత రాజారావు వచ్చాడు. జబ్బుపడి లేచినవాడిలా చాలా బలహీనంగా వున్నాడు. గడ్డం మాసివుంది. ఎప్పుడూ చక్కగా ముస్తాబై అందంగా వుండే రాజారావు ఇలా ఎందుకు మారిపోయాడో నాకే ఆశ్చర్యంగా వుంది.

'నాకు వొంట్లో సరిగా లేదు. కొంత సేపు విశ్రాంతి తీసుకోవాలి. నారూముకు పోదాం నడు!' అన్నాడు రాజారావు.

నేను ఆఫీసు పని వేగం ముగించుకొని రాజారావుతో బయలుదేరాను. యిల్లు చేరుకునేసరికి బాగా చీకటి పడింది. యిద్దరం స్నానం, భోజనం

'ప్రణయమా? చాలామంది చెప్పగా విన్నాను. పుస్తకాల్లో చదివాను- కాని నిత్యజీవితంలో అనుభవించేందుకు ఆ ప్రేమ దొరకదేం? నాలాంటి ఇరవై ఏళ్ల స్త్రీని, నీలాంటి అరవై ఏళ్ళ పురుషుడు వివాహమాడి తాను హృదయపూర్వకంగా ప్రేమిస్తున్నట్లు చెపుతాడు, ఐతే భార్యవలెగాక, కుమార్తెవలె ప్రేమించ గలిగిననాడు, నాకు ప్రేమమీద నమ్మకం కుదురుతుంది!'

—బాల్జాక్.

ముగించి కూర్చున్నాం. చల్లని గాలి మనసుకు ఆహ్లాదాన్ని కలిగిస్తోంది.

ఎదుటి మేడవైపు చూపిస్తూ రాజారావుతో యిలా అన్నాను. 'ఆ మేడలో ఎవరో ఒక ఆడదీ ఒక మగవాడూ వున్నారు. వాళ్లిద్దరనీ వేరువేరు ప్రక్కతుల్లా కనిపిస్తాయి. రెండవ అంతస్థు కేసి ఒకసారి చూడు!"

యిద్దరం అటు చూస్తూ నిశ్శబ్దంగా కూర్చున్నాం. రెండవ అంతస్థులో ఆమె ప్రశాంతంగా చదువుకుంటోంది. ఆమె అందమైనదీ కానిదీ తెలియదు కాని, అవయవ పుష్టిగల మనిషి అనిమాత్రం తెలుస్తోంది: నేనింకా ఆ నీలినీడ వైపే చూస్తున్నాను. యింతలో రాజారావు కంగారుగా 'ఒరేయ్! వాడెవడో మేడ మీది నుంచి కిందికి దూకేస్తున్నాడు!' అని అరిచాడు.

'నువ్వేం తొందరపడకురా! వాడెవడో మీ అన్నయ్యలా వున్నాడు. రోజూ మేడకోసకు వస్తాడు. క్రిందికి గెంతడానికి ప్రయత్నిస్తాడు. తిరిగి ప్రయత్నాన్ని విరమించుకొని లోనికి పోతాడు. వాడూ బహుశా నీలా నరాల బలహీనతతో బాధపడుతూ వుండాలి!" అన్నాను.

'అర్థం లేకుండా మాట్లాడుతున్నావు. నరాల బలహీనత వున్నంత మాత్రాన మనిషి చావడానికి ప్రయత్నిస్తాడా?' అన్నాడు రాజారావు కోపంగా.

తప్పకుండా ప్రయత్నిస్తాడు నరాల బలహీనత వున్న మనిషి ప్రతిచిన్న ఘటనకూ నిరుత్సాహ పడతాడు తను అధఃపాతాళంలోకి తొక్కబడుతున్నట్లు భావించుకుంటాడు. ఆనందాన్ని విచారాన్ని కూడా భరించలేడు.'

'ఆ మేడలో వుంటున్న వాళ్ళెవరో నీకు తెలుసా?'

'వాళ్ళ గురించి నాకేం తెలీదు. ఉదయం ఆఫీసుకు పోయి వూళ్ళో తిరిగి భోజనం చేసి వచ్చేసరికి రాత్రి 9 గంటలవుతుంది. వాళ్ళెవరో వాళ్ల గురించి తెలుసుకునే అవకాశమే నాకు కలగలేదు' అన్నాను.

ఏదో దీర్ఘంగా ఆలోచిస్తున్న వాడిలా రాజారావు అలాగే కూర్చుండిపోయాడు.

★

రాజారావు వచ్చిన దగ్గరనుంచీ నాకు కాలక్షేపానికి లోటు లేకుండా పోయింది. రోజూ సాయంత్రం 5 గంటలయ్యేసరికి బీచికిపోయి మాట్లాడు

> 'ఈ స్త్రీలు నటకురాండ్రు. జీవితంలో ఒక్క ప్రేమను తప్ప వేరేమీ నటించవలసిన అవసరం వారికిలేదు. కేవలం యాంత్రికంగా బతకగలరు. తమాషా-వారు తమ నటనతో, ప్రసిద్ధ నటనా దురంధరుల్నికూడా మోసపుచ్చ గలరు!'
>
> —బాల్జాక్.

కుంటూ కూర్చునేవాళ్లం. హోటల్లో భోజనంచేసి రాత్రి 8 గంటలకు యిల్లు చేరుకునేవాళ్ళం. రాజారావు యీ వారం రోజులలోనూ బాగా కోలుకున్నాడు. వాడిని ఒక్క క్షణంకూడా ఖాళీగా కూర్చోనిచ్చేవాణ్ని కాను. ఆనందాన్ని, ఉత్సాహాన్ని కలిగించే పుస్తకాలుయిచ్చి చదవమనేవాణ్ని. సాయంత్రంవేళ, రాత్రులు నాతో—నేను ఎక్కడకు వెడితే అక్కడకు తీసుకువెడుతూ వుండేవాణ్ని. యీ చికిత్సవల్ల వాడిలో చాలా గుణం కనిపించింది.

నేను చేసిన చికిత్సవల్ల కలిగిన సత్ఫలితానికి నాలోనేను సంతోషించే సమయంలో రాజారావు ఆకస్మికంగా మాయమయ్యాడు. నేను చాలా కలవరపడ్డాను. కొంపదీసి సముద్రంలో దూకెయ్యలేదు కదా? ఎంతో జాగ్రత్తగా పువ్వుల్లో పెట్టినట్లు మనసు నొవ్వకుండా చూస్తూవుంటే ఆత్మహత్య చేసుకోవలసిన అవసరం ఎందుకు కలిగింది? నేను లేని సమయంలో పాత సంఘటన ఏదో జ్ఞప్తికి తెచ్చుకొని నిస్పృహతో బాధపడి ఆత్మహత్య చేసుకున్నాడేమో! నాలో ఎన్నో సందేహాలు కలిగాయి. వాణ్ని యీ వూరు రప్పించకపోయి నా బ్రతికి బాగుండే వాడేమో? నాలో నేను చాలా బాధపడ్డాను. మనసు చలించి ఎక్కడికైనా పోయాడేమో తిరిగివస్తాడని ఆశించాను.

ఆరోజూ రాలేదు. ఆ మర్నాడూ రాలేదు.

నేను చేసిన స్వయం కృతాపరాధానికి నాలో నేను బాధపడుతూ నాలుగురోజులు గడిపాను. యీ మధ్య ఎదుటిమేడపై అంతస్థుమీద ఆత్మహత్యకు ప్రయత్నించేవ్యక్తి కనిపించడం లేదు. కాని రెండవ అంతస్థులో ఒక నీడకుబదులు రెండు నీలినీడలు కనిపిస్తున్నై. ఆమె మునుపటిలా దీక్షగా పుస్తకం చదవడంలేదు. రాత్రి 9 గంటలయ్యేసరికి మగవాడి నీడ మేడమీదికి వాస్తోంది. స్త్రీ నీడ అతన్ని ఆప్యాయంగా తన చేతుల్లోకి తీసుకుంటోంది. ఆ భార్యాభర్త లిద్దరూ రాజీపడ్డారని వూహించాను. అటునుంచి నా దృష్టిని మళ్లించి రాజారావు గురించి ఆలోచించేవాణ్ని.

రాజారావు మొదటినుంచీ విచిత్రమైన మనిషి. ఏ క్షణంలో ఎలా వుంటాడో ఎవరికీ తెలీదు. యిలాంటి విచిత్రమైన తత్వంగల మనుషులు అరుదుగా వుంటారు. లేకపోతే ఏమనిషి చూస్తూ చూస్తూ ప్రాణం తీసుకోవడానికి సిద్ధపడతాడు?

ఎవరైనా ఎక్కడైనా ఆత్మహత్య చేసుకున్నారనే వార్తలు కనిపిస్తాయేమోనని వార్తాపత్రికలలో వెదికాను. విషంత్రాగి ప్రాణత్యాగం చేసినవాళ్ళే

ఏ దేశంలోనూ కనిపించనంత విపరీతంగా జపాన్‌లో ఆత్మహత్యలు జరుగుతవి. 1954 జనవరి – మే నెలల మధ్య జరిగిన ఆత్మహత్యల సంఖ్య 8,095; అంటే సరాసరిన రోజుకు 54!

వరైనా వున్నారేమోనని హాస్పిటలుకు ఫోన్ చేశాను. యీ వారంరోజుల్లోనూ ఆత్మహత్యలకు సంబంధించిన వార్తలు పేపర్లలోనూ పడలేదు: హాస్పిటల్ లోనూ ఎవరూ చావలేదు.

యిక రాజారావు గురించి నిరాశ చేసుకోవడం కంటే నాకు గత్యంతరం లేక పోయింది. ఆ రాత్రి తీరికగా కూర్చుని స్నేహితులందరికీ యీ విషాద వార్త తెలియజేస్తూ—వాళ్లెవరి దగ్గర కైనా రాజారావువస్తే నాకు వెంటనే తెలియజెయ్యమని కోరుతూ — ఉత్తరాలు రాయడం ప్రారంభించాను. యింతలో ఎవరో వీధితలుపు గట్టిగా కొడుతున్న చప్పుడు వినిపించింది. ఏ టెలిగ్రాం అయినా వచ్చిందేమోనని తొందరగా మేడదిగి వీధి తలుపు తెరిచాను. ఆశ్చర్యంతో అలాగే నిలిచిపోయాను.

“దెయ్యం పట్టిన మనిషిలా అలా చూస్తావేరా?” అన్నాడు రాజారావు వీధి తలుపువేసి లోనికి వస్తూ.

చిక్కి శుష్కించి పోయి వుండే రాజారావు కొత్త పెళ్లి కొడుకులా తయారై వచ్చాడు. లోపలికి పోయిన చెక్కిళ్లు కొత్త రక్తం పట్టి పైకి వచ్చాయి. మనిషి కొంచెం పుష్టిగా వున్నాడు. మాసిపోయిన బట్టలతో మాయమైన మనిషి సిల్కులాల్చీ, సిల్కు షరాయితో యిప్పుడు ప్రత్యక్షమయ్యాడు. మత్తు గొలిపే సెంటు వాసన — తాంబూలంతో ఎర్రనైన పెదాలు - యీ వారంరోజుల కాలంలో యింత అద్భుతమైన మార్పు ఎలా సాధ్యమయిందా అని నాలో నాకు చాలా ఆశ్చర్యం కలిగింది.

“నేను చాలా అదృష్టవంతుణ్ణవుతానని నాకు చిన్నప్పటి నుంచీ ఓ నమ్మకం వుంది. యిన్నాళ్లకు నీ దయ వల్ల నా కోరిక నిజమయింది.”

“అంటే?” మరింత ఆశ్చర్యపోతూ ప్రశ్నించాను.

“రా! పైకిపోయి మాట్లాడుకుందాం!” తాపీగా అన్నాడు రాజారావు.

యిద్దరం మేడమీద కూర్చున్నాం. రాజారావు సిగరెట్ వెలిగించి చెప్పడం ప్రారంభించాడు.

“నువ్వు నాకు చాలా ఉపకారం చేశావురా! లేకపోతే నేనా ఎదుటి మేడకేసి దృష్టి మళ్ళించకుండా వుండే వాణ్ణి. నువ్వు చెప్పినప్పటి నుంచీ నాలో నేను చాలా ఆలోచించాను. ఆ మేడలో ఎవరు వుంటున్నారు? ఎందుకలా విభి

‘జైలులో వుండటం కన్న, అనారోగ్యంగా వుండటం పెద్ద నేరాన్ని చేసినట్లు రుజూ చేస్తుంది; మొదటిది మానవ నిర్మితమైన చట్టాన్ని ధిక్కరించటంవల్లా, రెండోది భగవత్ నిర్మితమైన చట్టాన్ని ధిక్కరించటంవల్లా ప్రాప్తించటమే కారణం.’

న్నంగా ప్రవర్తిస్తున్నారు? వేగంగా అసలు విషయం తెలుసుకోవాలనే బుద్ధిపుట్టింది. పగలంతా ఒంటరిగా కూర్చుని మేడకేసిచూస్తూ వుండే వాణ్ణి. ప్రతి రోజూ మిట్ట మధ్యాహ్నం ఒక వ్యక్తి ఆ మేడలోంచి బయటకు వచ్చే వాడు. ఏభై యేళ్ల మనిషిలా కనిపిస్తాడు. లావుగా బలంగా వుంటాడు. ఎక్కడికో పోయి - ఒక గంట పోయిన తరవాత - తిరిగి వచ్చేవాడు. అంత వరకూ ఆ యింట్లోవున్న స్త్రీ నాకు కనిపించలేదు. ఆమె ఎలా వుంటుందో చూడాలన్న కుతూహలం నాలో ఎక్కువ కాసాగింది. ఒక నాడు అతను బైటకు వెళ్లగానే ఆమె తలుపు తెరిచి రోడ్డుకేసి చూసింది. ఒక్కసారిగా నా హృదయం స్పందించింది. ఆమె లలిత!

'ఎవరూ? లలితా?' అన్నాను ఆశ్చర్యంగా.

లలిత మాతో కలిసి చదువుకొంది. ఆరోజుల్లో లలితా రాజా రావులమీద ఎన్నో పుకార్లు వుండేవి. వీడికి లలిత అంటే ప్రాణం. కాని వీడి ఆశ నిరాశ చేసి వాళ్ళకుటుంబమే మావూరు విడిచి పెట్టి పోయింది. ●

'చెప్పేది పూర్తిగా వినరా!' అన్నాడు చిరాగ్గా, సిగరెట్టు గట్టిగా పీల్చి తిరిగి చెప్పడం ప్రారంభించాడు.

'ఆమె మన మేడవేపుకి చూసింది. మాయిద్దరి చూపులూ కలుసుకున్నాయ్. ఆమె తలుపు చప్పుడయ్యేట్లు గట్టిగా వేసి లోనికి వెళ్ళిపోయింది. కాని ఉత్తర క్షణంలోనే మేడమీదికి వచ్చి తెర తొలగించి నాకేసి చూడసాగింది. గుండ్రనిముఖం ఉంగరాల జుత్తు సందేహం లేదు. ఈమె లలితే! ఈ అయిదేళ్ళలోనూ బాగా మారిపోయింది. కొంచెం లావయింది. దూరంగా వున్నందు వల్ల ఆమె అంత స్పష్టంగా కనిపించడం లేదు. ఆమెకేసి రెప్పవాల్చకుండా చూస్తూ పరిచయ సూచకంగా చిరునవ్వు నవ్వాను. ఆమె వెంటనే నా కుశల ప్రశ్నకు చిరునవ్వుతో జవాబిచ్చింది. నా సందేహం పూర్తిగా తొలగి పోయింది. నేను వస్తున్నానని సౌజ్ఞ చేశాను. ఆమె రావద్దని తిరిగి సౌజ్ఞ చేసింది. నేను నిరాశతో కుర్చీలో కూలబడ్డాను. ఆమె లోనికి వెళ్లి పోయింది. ఆ మర్నాడు అతను బైటకు వెళ్ళిపోగానే ఆమె మేడమీది తెర తొలగించి నాకేసి చిరునవ్వుతో చూసింది. నేను వస్తున్నానని తిరిగి సౌజ్ఞ చేశాను. యీసారి ఆమె రమ్మని చెయ్యి వూపింది. చీకటి నిండివున్న నా హృదయంలో ఒక్కసారిగా వెయ్యి జ్యోతులు వెలిగించినట్లయ్యింది. వేగంమన మేడదిగి ఎదుటి మేడదగ్గరకు వెళ్ళాను. తలుపు తెరచే వుంది. తొందరగా లోనికి ప్రవేశించి, తలుపు గడియ

> 'భర్త ఎప్పుడూ భార్యకన్న ముందుగా, నిద్రపోకూడదు; ఆమె తరువాత మేల్కొనూ రాదు.'
>
> —బాల్జాక్

చేసి, కొట్టుకుంటున్న గుండెలతో మేడ ఎక్కాను. గదిచుట్టూ తెరలు కట్టి వున్నాయ్. గదిలో మసక చీకటిగా వుంది. నాకేదో స్వప్నంలా వుంది. నా కళ్లు చలిస్తున్నాయ్. ఏవస్తువునూ సరిగా చూడలేక పోతున్నాను. కదలకుండా ఆమె సోఫాలో కూర్చుని చిరునవ్వుతో చూస్తోంది. ఒక్కసారిగా ఆమెను నా హృదయానికి హత్తుకొని 'ఎన్నాళ్ళకు కనిపించావ్ లలితా?" అన్నాను. ఆమె ముఖాన్ని దగ్గరకు తీసుకొని బెదురు చూపులు చూస్తున్న ఆమె కళ్ళల్లోకి చూశాను. ఒక్కసారిగా నా శరీరం అంతా భయంతో ముకిళించుకుపోయింది. ముచ్చెమటలు పోశాయి. ఆమెను నా కౌగిలిలోంచి విడిచిపెట్టి దూరంగా నుంచున్నాను. ఆమె లలిత కాదు!!!'

"అరె! ఆమె లలిత కాదూ!" అన్నాను మధ్యలో అందుకొని ఆశ్చర్యంతో.

"కాదు. కాని అన్నీ లలిత పోలికలే! దూరాన్నుంచి గుర్తించలేక పోయాను." ఒక క్షణం ఆగి-మరో సిగరెట్ వెలిగించి-తిరిగి చెప్పడం ప్రారంభించాడు రాజారావు.

'ఆమె లలిత కాదు. సుభద్ర. ఆమెను వదిలి నేను దూరంగా నుంచోవడం చూసి ఆమె ఆశ్చర్యంతో ప్రశ్నించింది. 'ఏం! అలా భయపడుతున్నారేం'?

'పొరబాటు జరిగింది. క్షమించాలి! నా స్నేహితురాలు లలిత అనుకున్నాను' అన్నాను బ్రతిమాలే ధోరణిలో.

'మిమ్మల్ని ఆహ్వానించినందుకు మీరే నన్ను క్షమించాలి.' అందామె నాకు మరింత దగ్గరగా వచ్చి.

యీ విధంగా సుభద్రకూ నాకూ గాఢమైన పరిచయం కలిగింది. ఆరోజు మొదలు ప్రతిరోజూ అతను బైటకు పోగానే నేను లోనికి వెళ్లి ఒక గంట వుండి వొచ్చేవాణ్ని.' ఆగాడు రాజారావు.

'యింతకూ అతనెవరో చెప్పావ్ కావు!' అన్నాను.

'అతనా? అతను ఆమె భర్త! సుభద్ర మొదటినుంచీ తన కోరికలన్నీ తీర్చగల పెద్ద ఉద్యోగి నయితేకాని పెళ్లిచేసుకోనని పట్టుపట్టిందట. తీరని ఆశయంతో పాతికేళ్ళ వయసు వచ్చేవరకూ అవివాహితగా వుండిపోయిందట. పెళ్ళికాదనే భయంతో ఆమె తల్లిదండ్రులు తొందరగా పెళ్లిచేశారు. చివరకు పెద్ద ఉద్యోగే దొరికాడు. కాని యీమెకు పెళ్ళైన రెండేళ్ళకే అతను రిటైర్ అయిపోయాడు. రానురాను వాళ్ళలో మనస్పర్థ లెక్కువై అతను చేతకాక ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించే వరకూ పరిస్థితులు వచ్చాయి. కాని సుభద్రమాత్రం చలించలేదు. అతను అర్జంటు పనిమీద ఏదోవూరికిపోయాడు. యీ వారంరోజులూ ఆమె నన్ను బయట అడుగుపెట్టనివ్వలేదు. అతను

'నీ తాలూకు ప్రతిబింబం ఎదుటివ్యక్తి కళ్ళల్లో స్పష్టంగా కనిపించందే, ఆవ్యక్తి మోసగాడని ఎలా తెలుసుకోగలుగుతావు?'

యివేళే వచ్చాడు. అడుగో! పై అంతస్థు కేసి చూడు!'

పై అంతస్థు కేసి చూశాను. నీడ మేడ చివరకు వచ్చి నిలుచునివుంది. రెండవ అంతస్థుకేసిచూశాను. ఆ నీలినీడ నిశ్శబ్దంగా పుస్తకం చదువుకుంటోంది.

'ఓరోయ్ రాజారావు! నువ్వుచేసిన పనిలో ఎంతటి అవినీతి వుందో నీకు తెలుసునా?' ప్రశ్నించాను.

'నీతికానీ అవినీతికానీ నామనసును నా స్వాధీనంలో పెట్టుకోలేక పోయాను.' అన్నాడు రాజారావు.

'మనసును స్వాధీనంలో పెట్టుకోలేక పోయానంటే ఎవరూ హర్షించరు. మనం ఒంటిరిగా అడివిలో నివసించడం లేదు. యిది సమాజం. మనంచేసే ప్రతి పనీ సమాజానికి హాని కలిగించనిదిగా వుండాలి. ఆమె కట్టుబాట్లకు లొంగి వుండడానికి అంగీకరించి పెళ్లి చేసుకుంది. యిప్పుడు ఆమె నీసహకారంతో కట్టుబాట్లను భగ్నంచేసి సమాజాన్ని మోసగిస్తోంది. అన్ని చోట్లా యీ విధంగా జరుగుతూ వుంటే యిక వివాహ వ్యవస్థలో గౌరవం ఏం మిగులుతుంది? ఒకవేళ ఆమెకు ఆ భర్తమీద యిష్టం లేక పోతే విడిచి పెట్టి బహిరంగంగా నిన్ను పెళ్ళిచేసుకోమను. అప్పుడు నిజంగా, మీ సాహసాన్ని లోకం గుర్తిస్తుంది. దానివల్ల సమాజానికి మేలుకూడా కలుగుతుంది." అన్నాను మందలించే ధోరణిలో.

వాడు ఒక క్షణం ఆలోచించి అన్నాడు.

"నువ్వు చెప్పింది నిజమే! ఆమెకు నేనంటే ఎంతో ప్రేమ. నా మాటకు ఎదురు చెప్పదు. రేపు వెళ్ళినప్పుడు ఆమె భర్తను విడిచిపెట్టి రమ్మంటాను."

నేను అప్పుడేం తిరిగి మాట్లాడలేదు.

మర్నాటి రాత్రి నేను వచ్చేసరికి రాజారావు విచారంగా కూర్చుని వున్నాడు.

"ఆమె అతన్ని విడిచిపెట్టి రావడానికి యిష్టపడలేదు." అన్నాడు దిగులుగా.

వాడి పరిస్థితికి జాలిపడి యిలా అన్నాను.

"ఆమె నీతో రావడానికి ఒప్పుకోదన్న విషయం నాకు ముందే తెలుసు. నీవు స్వయంగా విషయం అర్థం చేసుకోవడం కోసం నేను ముందుగా నీకేం చెప్పలేదు. ఆమె చాలా తెలివైనది. నీతో వచ్చి కష్టాలను అనుభవించేంతటి తెలివి తక్కువ మనిషి కాదు. ఆమెకు ఆ యింట్లో అన్ని సౌకర్యాలూ వున్నాయి. ఎటొచ్చీ పురుషుడొక్కడే తగిన వాడు కాడు. నీలాంటి యువకులు వున్నంత కాలం ఆమెకు ఆసౌఖ్యానికి కూడా లోటు వుండదు. మన సమాజంలో అవినీతి నిలిచి వుండడానికి కారణం యిప్పటికైనా తెలిసిందా?" అన్నాను.

రాజారావు మాట్లాడలేదు. తనలో తాను బాధపడుతున్నాడని ఊహించాను. ఆ మర్నాడే తిరిగి రాజారావు మాయమయ్యాడు. యీ నాటికీకూడా ఎక్కడవున్నాడో ఏమైపోయాడో నాకు తెలీదు. ఎదుటి మేడలో మాత్రం ఒక యువకుని నీలినీడ ఆమె నీడతో పాటు నాకు రోజూ కనిపిస్తోంది. ★



# సందేహాలకు... సమాధానాలు



ఈ శీర్షిక పాఠకుల సందేహాలను ఆహ్వానిస్తుంది. సెక్సుకూ శారీర శాస్త్రానికీ సంబంధించిన సమస్యలు ఎన్నో, సమాధానాలు లేకుండానే చాలా కాలంగా మానవుల మనస్సుల్లో ఉండిపోయినవి. వాటిని తీర్చేందుకే ఇక్కడ ప్రయత్నం జరుగుతుంది.

అనుభవశాలి ఐన ఒక డాక్టర్-శరీరతత్వ రీత్యానూ, మానవ మనస్తత్వ శాస్త్రరీత్యానూ ఈ జవాబుల్ని ఇస్తున్నాడు. ఒకొక్కచోట జవాబు సూచన మాత్రంగానే ఉండిపోతుంది. ఇతర కారణాలు ఎన్నో వున్నా, ఒకవ్యక్తి నమ్మ గలిగే కారణం మాత్రమే ఇవ్వబడుతూంది. శాస్త్రస్వరూపం పరిపూర్ణరూపం దాల్చేనంత వరకూ ఇలాటిది తప్పదు.

పాఠకులు పంపే ప్రశ్నలన్నిటికీ జవాబులివ్వటం కష్టం. సాధ్యమైనన్ని ప్రశ్నలకు జవాబులు ఇవ్వబడుతవి. మీరు త్వరపడినందువల్ల లాభంలేదు. క్రమపద్ధతిలో ఇది జరుగవలసివుంటుంది. సం॥ అభిసారిక]

1. ఒక్క స్ఖలనంలో పురుషుడు ఎన్ని వీర్యకణాలను విడుదల చేస్తాడు? ఒక్క వీర్యకణమే గుడ్డును పొదగగలప్పుడు, మిగతా వాటి ఉపయోగం ఏమిటి? ఏ వీర్యకణం పొదిగినా ఒకే రకం బిడ్డ కలుగుతాడా?

ఆరోగ్యవంతుడైన పురుషుని ఒక్క స్ఖలనంలో 40 కోట్ల వీర్యకణాలు విడుదలవుతవి. ఒకో గుడ్డును పొదిగేందుకు ఒకొక్క వీర్యకణమే అవసరమనుకున్నప్పుడు పురుషుని ఒక్క స్ఖలనం, 15 సం ల వయసు పైబడిన లోకంలోని స్త్రీ జాతికంతనూ గర్భప్రాప్తిచేయగలదు!

ఐతే ప్రకృతి, ఏ జాతి నశించినా మానవజాతి నశించకుండా వుండేందుకు చాలా జాగ్రతలు తీసుకున్నది. జాతివిస్తరణకు ఎక్కువ అవకాశాల్ని కలిగే

చింది; కొన్ని జంతు జాతుల్లో ఋతుధర్మం వున్నప్పటికీ, మానవుల్లో అది లేకుండా చేయటంలోని ఉద్దేశంకూడా జాతి విస్తరణే ఐవుండాలి.

స్ఖలనంలోని వీర్యకణాల్లో చాలా వరకు యోని ప్రవేశద్వారంలో విడుదలయే, ద్రావక సంబంధమైన ద్రవపదార్థాల్లో నాశనమౌతవి. యీ తాకిడికి తట్టుకొని ముందుకు సాగగలిగేవి బలమైన వీర్యకణాలే అవుతవి. అంటే బలహీనమైన వాటిని గర్భధారణకు ఉపయోగించకుండా ఒక రకం వడబోత జరుగుతుందన్న మాట!

చావగా మిగిలినవి యీదుకుంటూ వెళ్లి గుడ్డును చుట్టుముట్టుతవి, గుడ్డు పైభాగం గట్టి పదార్థంతో తయారై ఉండటంవల్ల వీర్యకణం తేలిగ్గా గుడ్డులోకి ప్రవేశించలేదు. వీర్యకణంలోవుండే ఒకరకం రసాయనిక జారుడుపదార్థం (hyaluranidase) గుడ్డులోని గట్టిపదార్థాన్ని మెత్తగాచేసి, ఒక్క వీర్యకణంలోనికి ప్రవేశించే అవకాశాన్ని కలిగిస్తుంది; యీ విధానానికి చాలా వీర్యకణాల సహాయం కావాలి. అందుకనే ఒక్క స్ఖలనంలో కొన్ని కోట్ల వీర్యకణాలున్నవి.

ప్రతి వీర్యకణం ఒకే మాదిరిగా వుండదు. కొద్దికొద్ది భేదాలతో ఉంటవి. ప్రతి వీర్యకణంలోనూ ఒకే సంఖ్యగల క్రోమోజోము లుంటవి. మానవజాతికి యీ క్రోమోజోముల సంఖ్య 48 గా నిర్ణయించబడి, 24 జతలుగా ఉంటవి. ఇవే జాతినీ, సెక్సునూ ఖాయపరుస్తవి; అంతేకాదు తరతరాల తాలూకు గుణగణాల్ని నిర్ణయిస్తవి.

ఇంకా విశాలంగా ఆలోచిస్తే యీ క్రోమోజోములు అచ్చుగా ఒకదాన్ని పోలి రెండోది వుంటుందనేందుకు వీల్లేదు. చాలావరకు పోలికలుంటవి. ఒకో క్రోమోజోములో అనేక వేల జీన్స్ (genes) ఉంటవి; ఇవీ గుణగణాల్ని నిర్ణయించేవి. యీ జీన్స్ ప్రాముఖ్యత ఎంతవరకూ వెళ్లిందంటే, దీని కొరకై ఒక శాస్త్రీయశాఖ—జెనిటిక్స్ (genitics) ఏర్పడింది.

దీన్నిబట్టి వీర్యకణాల్లో ఒకదానినుంచి మరోటి భేదిస్తుందనీ, పోలికలు ఉన్నప్పటికీ యీ భేదాలు తగినంతగా వుంటవనీ అర్థమవుతుంది. అంటే శిశువు ఆ వీర్యకణంవల్ల గాక, అదే స్ఖలనంలోని వేరొక వీర్యకణంవల్ల కలిగివుంటే, వేరొక విధంగా ఉండేవాడు. వీర్యకణం గుడ్డును ప్రవేశించగానే—ఆ పిండం నుంచి వెలువడే శిశువు తాలూకు శరీరచ్ఛాయ, శరీరాకృతి, రక్తసముదాయం (Blood Group) సెక్సు, చాలా వరకు మానసిక బలాబలాలు, ఉద్రేకాల్ని భరించగలగటం, కొన్ని వ్యాధుల్ని నిరోధించ గలిగిన శక్తీ, మరికొన్ని వ్యాధులకు తేలిగ్గా లొంగిపొయ్యే బలహీనత, మొదలైనవి అనేకం—ఇక జీవితంలో సరిచేసుకోలేనివి—నిర్ణయించబడుతవి! అందుకనే ఒకే తల్లిదండ్రులకు గలిగే సంతానంలో చాలా భేదం కనిపిస్తూంటుంది!

ఒకే వీర్యకణంనుంచి జన్మించే కవలల్లో ఎక్కువ పోలిక వుండేందుకూ, రెండు వేరు వేరు గుడ్లనుంచి జన్మించే కవలల్లో పోలికలు తక్కువగా ఉండేందుకూ కారణం యీ సరికి పఠితలకు తెలిసివుండాలి.

## 2. 'మానసిక గర్భధారణ'(Pyschological Pregnancy) అంటే ఏమిటి? ఇది జరిగేందుకు కారణాలేమిటి?

తనకు గర్భం వొచ్చిందనే సంగతి మొట్టమొదటగా గర్భంధరించిన స్త్రీయే గ్రహించగలగటం సర్వసామాన్యం. ఐతే ఇందుకు కొన్ని గుర్తులూ, సూచనలూ ఉన్నవి. వాటినిబట్టే ఆమె ముందుగా అనుమానించటం, ఆ తరువాత గర్భాన్ని నిర్ణయించుకునేందుకు తన పెద్ద వాళ్లతో చెప్పటం, వారుకూడా తమ విజ్ఞాన కాంతిలో నిర్ధారణ చేసుకొని, డాక్టర్ పరీక్షకు తీసుకొని వెళ్ళి ఖాయపరుచుకోవటం జరుగుతూవుంటుంది.

పైన చెప్పుకున్న గుర్తులూ, సూచనలూ గర్భాన్ని అనుమానించేవి ఐనప్పటికీ, చాలా సందర్భాల్లో అవి మోసపుచ్చగలిగేవిగాకూడా ఉంటవి. ఉదాహరణకు బహిష్టు ఆగటం గర్భధారణకు మొట్టమొదటి గుర్తుగాతీసుకున్నట్లయితే, అంత మాత్రానే గర్భం వొచ్చిందనుకోవటం పొరపాటుగా పరిణమించవొచ్చు; ఎందుకంటే అనేక ఇతర కారణాలవల్లకూడా బహిష్టు ఆగటం, లేదా ఆలస్యంగా కావటం జరుగుతూంటుంది. పోతే మానసికంగా ఒక గాఢమైన నమ్మకమున్న స్త్రీకి, బహిష్టు ఒక్కరోజు, లేదా కొద్దిగంటలు ఆలస్యమైనప్పటికీ తాను గర్భవతినయ్యాననే గాఢనమ్మకం కుదురుతుంది. ఇది ఎందుకు, ఎలా జరుగుతుందో చూద్దాం:

గర్భధారణ సృష్టిరీత్యా స్త్రీ కోరదగిందిగానూ, జీవశాస్త్ర అవసరంగానూ వుంది. మాతృత్వాన్ని పొందటం స్త్రీజాతి జన్మహక్కుగానూ, ఆనందంగానూ వుంది. ఐతే పరిసరాలు, వాతావరణం, ఆర్థికసమస్యలూ, ఆరోగ్యం, దంపతుల అనురాగం, వ్యక్తిగత ఇష్టాయిష్టాలూ, తత్వాలూ మొదలైన అనేక కారణాల వల్ల గర్భం రాకుండా వుండాలని కోరే స్త్రీలు వున్నారు; వీరు ఎక్కడో నూటికీ, కోటికీ వుంటారనుకోవటం పొరపాటు. ఆధునిక ప్రపంచంలో, విశేషించి ఇండియాలాటి ఆర్థిక అభ్యుదయంలేని దేశంలో, బీదలఇంట గర్భం వొక పీడకలవలెనే భావించబడుతోంది. ఉన్న కుటుంబీకులకే రోజులు గడవటం కటకట్లుగావుంటే, కుటుంబ విస్తరణలో అర్థంలేదు. ఉన్నవారి పొట్టలు ఇంకా మాడటమూ, ఆహ్వానితులు కానివారి ఆగమనం ఆందోళనాకరంగానూ, బాధాయుతంగానూ వుంటుంది.

అలాటి కుటుంబంలోని స్త్రీలు అటు కామజీవితాన్ని వొదులుకోలేనివారు

గానూ, ఇటు గర్భధారణకు విపరీతంగా భయపడేవారుగానూ ఉంటారు. అలాటి స్త్రీకి కలిగేభయం, ఏ కాస్త సూచనన్నా కనిపించగానే తనకు గర్భప్రాప్తించిందనే వెర్రిలోకి వొస్తుంది, బహిష్టు కొంచెం ఆలస్యమైతేచాలు - మానసికంగా బాధపడుతుంది.

కేవలం ఆర్థికబాధలే కారణంకాదు. ఉదాహరణకు పురుడు పోసుకొని బతకటమంటే పునర్జన్మ ఎత్తటమేననే మాటను మనం అనేకసార్లు వినేవుంటాం. ఇలాటిమాటలు పసిహృదయాలమీద శాశ్వతంగా హత్తుకొనిపోయి ఉండటంవల్ల, ఒకపక్క కామధూమాల తాకిడి, రెండోపక్క ప్రాణగండంలోకి దిగజారటం- యీ రెంటిలో తప్పనిసరిగా కామానికి లొంగిపోవటం, ఆతరువాత వెంటాడే భయం తాలూకు ప్రాణగండం వొచ్చిపడిందనే నమ్మకంలో కొట్టుకోవటం జరగొచ్చు...ఒకానొక స్త్రీ చనిపొయ్యాక, శవపరీక్ష జరిగినప్పుడు, ఆమె తనకు గర్భం వొచ్చిందనేభయంతో పనిముట్ల సహాయంతో గర్భస్రావానికి ప్రయత్నించి ప్రాణాలు పోగొట్టుకున్నట్లు తేలింది. తమాషా—అసలు గర్భంకాదుకదా - గర్భ చిహ్నాలన్నా లేవని తేలింది. దీన్నిబట్టి యీ మానసిక గర్భధారణ తాలూకు నమ్మకం ఎంత బలీయంగా వుంటుందో తెలుసుకోవచ్చు.

దొంగలభయం వున్న ప్రాంతంలో నివశించేవారికి నిద్రపట్టదు సరికదా, ఎక్కడన్నా ఏ కాస్తచప్పుడైనా దొంగేనేమోనని తత్తరపడటం లాటిదే యీ మనస్తత్వమూను.

విధవలూ, కన్యలూ కామజీవితంలోవున్నప్పుడుకూడా ఇలాటి భయాలకు గురికావటం సర్వసామాన్యం.

మరో రకం మనస్తత్వంకూడా మానసిక గర్భధారణకు గురిచేస్తుంది. ఎన్నాళ్లు కాపరం చేసినా, గర్భంరాని స్త్రీకి గర్భవతి కావాలనే బలీయమైన కోర్కె వుంటుంది. తనతోటివాళ్లు సంతానవతు లౌతూంటే, వారు తనను హేళన చేస్తున్నట్లూ భావిస్తూ, తన బంధువర్గాల్లోనూ, భర్త, అతని బంధువర్గాల్లోనూ ఒక స్థానాన్ని పొందేందుకుగాను సంతానవతి కావాలనే తీవ్రవాంఛ ఆమెను వేధిస్తూ వుంటుంది. ఇలాటి స్త్రీకూడా, తన కోర్కె ఫలించటాన్ని ఎదురు తెన్నులు చూస్తూవుంటుంది. ఏ కాస్త సూచన తగిలినా నిజంగానే తాను గర్భవతిననుకుంటుంది. కాదన్న వారిమీద పోట్లాడుతుంది. ఎవరికోసమన్నా ఎదురు చూస్తున్నప్పుడు, ఎవరు కనిపించినా, మనం ఎదురుచూసే వ్యక్తిలాగే ఉన్నట్లు తోచటం లాటి మనస్తత్వ మిది!

యీ మానసిక గర్భధారణలోకూడా కొన్ని చిహ్నాలు, నిజమైన గర్భధారణవలెనే ఉండటం ఒక విశేషం. ఇది గాఢనమ్మకంవల్లా, ఆతృతవల్లా, లేదా

శారీరకంగా ఏమైనా లోపాలుండటంవల్లకూడా జరగొచ్చు. అతి సున్నితమైన సెక్స్ యంత్రాగం ఏ శాస్త్ర ఆకృతకు గుర్తైనా, ఆకృత తాలూకు చిహ్నాలు స్పష్టమౌతవి. యీ ఆకృతులు నమ్మకాల్నిబట్టి ఉంటవి. అదే మానసిక గర్భధారణలో జరిగేదికూడాను.

3. 'గృహిణి ఒకో కాన్పుకు ఒకో దంతాన్ని కోల్పోతుంది' అనే దాంట్లో ఎంత నిజం వుంది? నిజమైతే దాన్నుంచి తప్పించుకోవటం ఎలా?

గర్భవతికి సామాన్యంగా పంటి బాధలు రావటంకద్దు. యీ బాధల్లో ఆమె ఒక దంతాన్నో, లేదా కొన్ని దంతాల్నో కోల్పోయినా కోల్పోవొచ్చును.

కలకాలంగా గర్భధారణవల్ల దంతాలు పోతవనే నమ్మకం దేశదేశాల్లోనూ వుంది. దీనికి శాస్త్రీయమైన కారణమల్లా, గర్భస్థపిండం విశేషంగా కాల్షియమ్‌ను కోరుతుందనీ, ఆ కాల్షియమ్ తల్లి దంతాలనుంచి పొందుతుందనీను.

ఇది కొంతవరకే నిజం. పిండానికి కాల్షియమ్ విపరీతంగా అవసరం కావటం నిజమే. పోతే ఇదే సమయంలో దంతబాధ ఏదన్నా తల్లికి వున్నట్లయితే, ఆ దంతం పూర్తిగా దెబ్బతినటం, పక్కనవున్న మరికొన్ని దంతాల్నికూడా చెడగొట్టటం సంభవం. అందుకని గర్భవతికి దంతబాధలు ఉన్నట్లయితే, వెంటనే దంతవైద్యునిచూసి, చికిత్స పొందటం అవసరం.

దంతబాధలు కాల్షియమ్ తక్కువవటంవల్లా, విటమిన్ 'సి' లోపించటంవల్లా వొస్తవి; ప్రతి ఫలంలోనూ విటమిన్ 'సి' వుంది. నిత్యజీవితంలో శరీరానికి కావలసిన విటమిన్ 'సి' ని స్వభావసిద్ధమైన ఫలాల్ని ఆరగించటంవల్ల పొందాలి; నేటి ప్రపంచంలో పళ్ళుతినేది రోగులనీ, పసివాళ్లూ, ముసలివాళ్లేననే నమ్మకం వొకటివుంది. ఏ కాఫీహోటల్లోనో మెక్కేందుకు అలవడ్డామే కాని పళ్లను ఆరగించటంద్వారా, ఆరోగ్యాన్ని కాపాడుకోవొచ్చనే సంగతే ఎవ్వరమూ పట్టించుకోవటం లేదు.

అలా పళ్లుతినే అలవాటులేని వాళ్లు, సివిటమిన్‌వున్న మాత్రలు, లేదా ఇంజక్షన్లు తీసుకోవాలి. పోతే కాల్షియమ్—ఇది శరీరంలోని ఎముక భాగాలకు అత్యవసరం. కాల్షియమ్ తక్కువవటంవల్ల పిల్లలకు దొడ్డికాళ్లు రావటం, ఎముకల్లో బలంలేకుండటం జరుగుతుంది. గర్భంనుంచి బైటపడేముందే, తాను స్వతంత్రంగా జీవించగలిగేందుకు తగినంత బలాన్ని పొందేందుకు శిశువు తల్లి శరీరంలోని ఎముక భాగాలనుంచి కాల్షియమ్‌ను విపరీతంగా లాక్కుంటాడు. అందుకని గర్భిణీ స్త్రీ తనకూ, శిశువుకూ సరిపడే కాల్షియమ్‌ను తీసుకోవటం అత్యవసరం.

లేనట్లయితే, తల్లి తన శరీరంలోని కాల్షియమ్‌ను ఇచ్చి, తాను అనారోగ్యంగా వుండి పోవటం జరుగుతుంది.

పాలలోనూ, మజ్జిగలోనూ యీ కాల్షియమ్ ఎక్కువగావుంది. గర్భిణి వీటిని విశేషంగా సేవించటం అవసరం. వీటిమీద ఆమెకు ఇష్టం లేనట్లయితే, ఇంజక్షన్ల రూపంలోనూ, మాత్రల రూపంలోనూ కాల్షియమ్‌వున్న మందుల్ని సేవించవలసి వుంటుంది.

**4. ఒకే కాన్పులో జనించిన మానవ శిశువుల గరిష్ఠ సంఖ్య ఎంత?**

స్వభావ సిద్ధమైన జీవితాల్లో అప్పుడప్పుడు విచిత్రాలు జరుగుతూండటం వాటినిగూర్చి మనం ఆశ్చర్యపడుతూండటం అనాదిగా జరుగుతూనేవుంది. ఐతే శాస్త్రకారుడు కేవలం ఆశ్చర్యపడటంతో వూరుకోడు. ఎందుకు, ఎలా యీ విచిత్రం జరిగిందో పరిశోధిస్తాడు.

ఒకే కాన్పులో కలిగిన మానవశిశువులసంఖ్య ఐదుగా శాస్త్రకారులు నిర్ణయించారు. నోటిమాటల్తో చెప్పటంవల్ల రుజువైనట్లేనని భావించనక్కర్లేదు. నిజానికి ప్రచారం పొందేవార్తల్లో అతిశయోక్తులు ఎక్కువగా ఉంటవి. అందుకని నమ్మిచేందుకువారి ఛాయా చిత్రాలు తీయబడినవి. యీకింద అలాటి వేస్తున్నాము:



పై బొమ్మలోని ఐదుగురు ఆడపిల్లలూ ఒకే కాన్పులో 1939 వ సం. మే 10-వ తారీఖున జన్మించారు. ఇలాటిది 57, 289, 761 కాన్పుల్లో ఒక్కసారి సంభవమౌతుందని అంచనా వేయబడింది.

ఐతే ఐదుగురుకన్న ఎక్కువ శిశువులు ఒకేకాన్పులో కలగరా అనే ప్రశ్న వుంది. వార్తల్లో అంతకన్న ఎక్కువమంది కలగటం మనం చూసేవుండొచ్చు. వారు సజీవులుగావున్న తార్కాణాలు ఎక్కడాలేవు.

1872 సెప్టెంబర్‌లో లాన్‌సెట్ పత్రికలో ఒకవార్త ప్రకటించబడింది: ఆగస్టు 21-వ తారీఖున ఒహియోలోని తిమోతీ బ్రెడ్లీ సతి ఒకేకాన్పులో ముగ్గురు మొగపిల్లలూ, ఐదుగురు ఆడపిల్లల్ని కన్నదట! వారు సజీవులుగా, ఆరోగ్యవంతులుగా ఉన్నారు; కాని సాధారణ పరిమాణాలకు చాలా తక్కువగా ఉన్నారట. అప్పటికి 6. సం॥ల క్రితం ఆమె 273 పౌనుల బరువున్న బెడిల్లీని వివాహమాడింది. యీ కాన్పుకు ముందు ఆమె రెండు సార్లు కవలల్ని కన్నది; మొత్తం మీద 6 సం॥ల దాంపత్యంలోనూ డజను పిల్లలకు మాతృత్వాన్ని వహించింది. యీమె తల్లి కవలల్లో ఒకతె; తండ్రికూడా కవలల్లో ఒకడు. ఇక యీమె ఒకే కాన్పులో కలిగిన ముగ్గురు బిడ్డల్లో ఒకతె! యీమె తండ్రి తల్లి ఐదుగురు కవలలకు తల్లి! ఎక్కువ మంది శిశువులు ఒకేకాన్పులో కలిగేందుకు వంశపారం పర్యత ఎంత పెద్ద కారణమై ఉంటుందో యీ కేసునుంచి, మనం గ్రహించవొచ్చు.

పై వార్తే కనుక నిజమైతే, ఒకే కాన్పులోకలిగిన ఐదుగురు శిశువుల తాలూకు వార్త విచిత్రమే కాదు!

1938-వ సం॥ అక్టోబర్ 25 వ తారీఖు 'లుక్' అనేపత్రిక ఒకేకాన్పులో కలిగిన ఆరుగురు బిడ్డల తాలూకు ముగ్గురు బిడ్డల ఛాయాచిత్రాన్ని వేస్తూ, కాన్పు చేయించిన వైద్యుని సర్టిఫికెట్‌తో సహాప్రకటించింది. ఇందులో ముగ్గురు మొగ పిల్లలూ, ముగ్గురు ఆడపిల్లలూను.

దీనిమీద లుక్ పత్రిక ఇలా రాసింది: "యీ వార్తను నమ్మేందుకు డాక్టర్ సర్టిఫికెట్ ఆధారం. 1871 కి ముందున్న జననాల రిజిష్టర్లు, ఆ సంవత్సరంలోని పెద్ద అగ్నిప్రమాదంలో దహనమైపోయినవి. పాతరికార్డుల్ని చూసి నిర్ణయించటం కుదరకపోయినా, చాలా కాలంగా ఆ కుటుంబాన్ని ఎరిగిన వారందరూ, ఆరుగురుబిడ్డలూ ఒకే కాన్పులో కలగటం నిజమేనని చెపుతున్నారు.

పైసెట్టులో బతికివున్న ఇద్దరి ఫొటోలువేస్తూ ఇలా రాశారు. "ఒకేకాన్పులో కలిగిన ఆరుగురు శిశువుల్లో యీ ఫొటోలో ఇద్దర్ని చూడొచ్చు. వీరి జననం 72 సం॥ ల పాటు రహస్యంగా వుంచబడింది. ఇంతమంది పిల్లల్ని ఒకేకాన్పులో కన్నందుకు తల్లి దండ్రు లిద్దరూ సిగ్గుపడ్డారేమో కూడాను!"

పై వార్తల్లో నిజంలేదని ఒక్కసారి తోసిపారేసేందుకు వీల్లేదు. ఐతే ఇవి నిజమనేందుకు తగినన్ని రుజువులు అవసరం. అంతవరకూ నిర్ధారణచేసి ఒకే కాన్పులో కలిగే శిశువుల గరిష్ఠ సంఖ్యను చెప్పటం కుదరదుకదా!

## 5. ముసలివాళ్ళ ప్రణయ జీవితం ఎలావుంటుంది?

'తాతయ్యా పెళ్ళిచేసుకుంటావా?' అని అడుగుతే 'నాకు పిల్లనిచ్చే వాళ్లెవ్వరా?' అంటాడు. అంటే పిల్లనిచ్చే వాళ్లుంటూ ఉండాలేకాని, తన వయస్సుతో నిమిత్తం లేకుండానే వివాహమాడేందుకు తాతయ్యకు ఎలాటి అభ్యంతరమూ లేదన్నమాట!

ఇది స్వభావసిద్ధంగావున్న వాంఛలను విప్పిచెపుతోంది. ఐతే అలాటి ప్రణయ జీవితంలో, అంటే కనీసం 40 సం॥ల వయస్సు తేడాతో కొత్త దాంపత్యం ఆరంభమైతే, అది ఎవర్నీ సుఖపెట్టలేదు.

కాని దంపతులిద్దరూ ముసలివాళ్లయాకకూడా వారి ప్రణయ జీవితం అంతమైనదనుకోవటం, అంతమవటం సహజమేననుకోవటం పొరపాటనిపిస్తుంది. విశేషించి వారిలో మూర్తీభవించే అనుభవం, జాగర్తగా, లోతుగా పరిశీలించగల శక్తి అనవసరపు ఉద్రేకాలకు గురి కాని స్తోమతా వారిలో కనిపిస్తవి. వారికి కూడా ఉద్రేకాలు, కలగకపోవు. కాకుంటే అవి ఎక్కువగానూ, బలవత్తరంగానూ వుండక పోవచ్చు.

పోతే ముసలితనంలో కలిగే వారి ఉద్రేకాలు విడుదలయేందుక్కూడా కొన్నిమార్గాలు అవసరం. అదివారి ఆరోగ్యానికి మంచిదికూడాను; ఆ ఉద్రేకాలు విడుదలకానట్లయితే, వాటితాలూకు దుష్ఫలితాలు ముసలితనంలో విపరీతఘోరణుల్లో కనిపిస్తవి. చాలావరకు ముసలివారి మానసిక ఆరోగ్యం, వారి తాలూకు ప్రణయజీవితానికి రూపాన్ని ఇవ్వటంమీదనే ఆధారపడివుంటుంది.

ఉదాహరణలు అనేకం చూపొచ్చు. ముసలివాళ్ళు ప్రమాదాలకు ఎక్కువగా గురవుతూంటారు. ఉన్నట్లుండి పడిపోవటం, తగినన్నిశక్తి సామర్థ్యాలు ఉండికూడా రోడ్డుమీదనడుస్తూ నడుస్తూ ఏ కారుకిందనో పడటం మొదలైనవి. శారీరకంగా వారికి జాగర్తగా నడిచేశక్తి వున్నప్పటికీ, మానసికంగా ఉద్రేకాలతాలూకు దుష్ఫలితాలు వారిని పడతోస్తవి.

ముసలితనంలోకూడా సుఖమయ సంసార జీవితాల్ని గడుపుతూన్నవారు ఉన్నారు. అలాటివారిని మన పరిసరాల్లోనే చూడగలం. ఇక శాస్త్రీయంగా చూసినట్లయితే, 80 సం. ల వయస్సులోకూడా లైంగిక జీవనం సాధ్యమనే తోస్తుంది. 96 సం. ల వయస్సులోకూడా బిడ్డ తండ్రి ఐన కేసులు వైద్యచరిత్రలో ఉన్నవి. సెక్సు శరీరపరిణామాలకన్న మానసికపరిణామాలమీదనే ఎక్కువగా ఆధారపడిఉండటం దీనికి పెద్దకారణం.

★

# వింత ఆచారాలు

వంశ పారంపర్యత విషయంలో భేదాభిప్రాయాలు మానవ జాతిలో కలకాలంగా ఉంటూన్నవి. ఆ అభిప్రాయాలను అనుసరించే వైవాహిక ధర్మాలూ, నైతికశాస్త్రం ఏర్పడినవి.

కొంతమంది అభిప్రాయం పెళ్లిళ్లు వేరొక తెగతో, లేదా శాఖతో చేయాలని. ఉదాహరణకు సగోత్రీకుల్లో వివాహాలు నిషిద్ధం. కుటుంబాలలోని వారిమధ్య వివాహాలుకూడదు; ఇతర కుటుంబాలతో వివాహాలు జరుగుతే, జాతిలో బంధుత్వాలు ఏర్పడి, స్నేహభావాలు వృద్ధవుతవనే ఆశయం సామాజిక శాంతికొరకై ఏర్పడింది మాత్రమే కాదు; ఇందువల్ల కుటుంబంలోని వారితాలూకు వంశపారం పర్యా వొచ్చే బలహీనతలు ద్విగుణీకృతమవవు.

ఐతే కుటుంబీకుల మధ్య బంధుత్వాలు సడలకుండా వుండటం కూడా అవసరమే కనుక, కొన్ని వైవాహిక సంబంధాలు అంగీకరించబడినవి. ఉదాహరణకు హిందువుల్లో అక్క-కూతురు (మేనకోడల్ని) వివాహమాడటం వుంది. యీ ఆచారం మహమ్మదీయులకు హాస్యాస్పదంగా తోస్తుంది. ఐతే వారిలో పినతండ్రి కుమార్తెను (హిందువుల్లో చెల్లెలి వరస!) వివాహమాడటం కద్దు.

వంశపారంపర్యా వొచ్చే దుర్గుణాలు ద్విగుణీకృతం కాకుండా వుండేందుకుగాను, పరాయి కుటుంబాలతోడి వివాహాలు ఏర్పడినవని పైన తెలుసుకున్నాం కదా! అదేవిధంగా వంశపారంపర్యా వొచ్చే సద్గుణాలు దిగ్వుణీకృత మయేందుకు కుటుంబీకులమధ్య వివాహాలు అవసరమూ ?

కుటుంబీకులమధ్య జరిగే వివాహాలు అనుమతించబడటం దీనికి జవాబు. వివిధ తెగల్లోనూ, వివిధజాతుల్లోనూ, ఇదిరకరకాలుగానూవుంది,

దీని విషయమై చరిత్రకు అందని కాలంలోనే మానవులు విశేషంగా ఆలోచించినట్లు కనిపిస్తుంది. ఉదాహరణకు: పురాతన యీజిప్ట్ రాజవంశాలను చూపవొచ్చు. రాజకుటుంబ రక్తం, ఇతరులతో కలవకుండా వుండేందుకు, వారు కొన్ని కట్టుబాట్లుచేశారు. తండ్రి చనిపోతే, కొడుకు తల్లి నే వివాహమాడటం, లేదా చెల్లెల్ని కానీ అక్కను కానీ పెళ్ళాడటం వారి కట్టుబాటు! ఇందులో నీతి, అవినీతిసంగతి, ఆ కాలానికే వొదిలేస్తే, శాస్త్రీయ కారణమల్లా వారి కుటుంబాల్లోని రక్తం కలుషితం కాకుండటమే ననిపిస్తుంది. దీనికి ఉదాహరణగా జగదేకసుందరి క్లియోపాత్రాను, ఆమె తమ్ముడు టాలమీ వివాహమాడాడు! చరిత్రలో ఇలాటి వరుసలుకూడా చాలా జాతుల్లో కనిపిస్తవి.

★

గుంటూరు జిల్లాలోని గురజాల దగ్గర ఒక గ్రామంలో మల్లేశ్వరాలయం వుంది. ఇక్కడి దేవణ్ని 'బొడ్డుమల్లీశ్వరుడు' అంటారు. యీ రాతివిగ్రహంలోని విశేషమేమంటే – యీ విగ్రహానికి లేపన స్థితిలోవున్న పురుషాంగంవుంది; ఇది రాతితోచేయబడి నున్నగా వుంది. యీ దేవుడు సంతానాన్ని ఇస్తాడని పేరుగన్నాడు. సంతానం లేని స్త్రీలు ఆలయంలో తలుపులువేసుకొని విగ్రహం తాలూకు పురుషాంగంతో రతిచేయటం కద్దట. ఇందువల్ల కలిగే సంతానం భగవత్ప్రసాదితమని నమ్మబడుతోంది.

శాస్త్రీయంగా ఆలోచించినట్లయితే, శారీరకంగా యోనిలో ఏమైనా లోపాలువుంటే, యీ రాతిపురుషాంగంవల్ల అవి సరిచేయబడే అవకాశం వుండొచ్చు. సామాన్యంగా యోనినుంచి, గర్భకోశం వరకూ వెళ్లే కాలువలోని లోపంలాటిదే సరిచేయబడగలదు. పూర్వం శాస్త్రీయ కారణాల్ని మనసులో పెట్టుకొని, వాటినిచెప్పి ప్రజల్ని నమ్మించటంకన్న, మతంమీది నమ్మకంతో వారిని నమ్మించటం తేలికకనుక, యీరకం పద్ధతులు ఏర్పడినవేమో ననిపిస్తుంది.

★

సిగ్గురూపం లోకంలోని జాతుల్లో రకరకాలుగానూ వుంది. ఉదాహరణకు అస్సాం అడవుల్లో నివశించే నాగజాతిస్త్రీలు, ఒక్క-రోమ్ముల్ని మాత్రమే మరుగుపరుస్తారు. వారు చెప్పేకారణం ఇది: 'పుట్టిననాటినుంచీ వున్న అంగాల్ని దాయటంలో అర్థంలేదు; మధ్యలో వొచ్చిన యీరొమ్ముల్ని చూపటమే సిగ్గుచేటు.'

మరో ఉదాహరణ చైనీయుల్లో చూపొచ్చు. చాలా చిన్న తనంనుంచే చైనా బాలిక కాళ్ళకు బిగువైన బూట్సు తొడగబడుతవి. కాలు ఎంతచిన్నదైతే, అంత అందగత్తె అవుతుందని వారి నమ్మకం. ఏ పరిస్థితుల్లోనూ వారు కాలినిమాత్రం ప్రదర్శించరు. చివరకు కాలికి దెబ్బతగులుతే, డాక్టర్ దగ్గర దెబ్బతగిలినంతవరకే కాలు చూపేందుకు సిద్ధమౌతారు. వీరిసిగ్గు కాలిలోవుంది!

★

పాపునాస్ జాతివారు బహిష్టునుగూర్చిన యీనమ్మకాన్ని కలిగి వున్నారు; ఆడపిల్లతో, మొదటిరాత్రి చంద్రుడు కలలో సంపర్కించటంవల్ల బహిష్టు జరుగుతుంది! ★

హంపీ వెళ్ళేప్పుడు కొన్ని హెచ్చరికల్ని వింటూంటాం: మరీ బ్రహ్మచారులైనవారికి యీ హెచ్చరికల మోతాదు ఎక్కువ. అక్కడ ఎవరు ఆతిథ్యమిచ్చినా స్వీకరించరాదనే యీ హెచ్చరిక. దాని పుట్టుపూర్వోత్తరాలు ఇవి:

యవ్వనంలో విధవైన స్త్రీ, మరుజన్మలో ముత్తైదువుగా, సకలసౌఖ్యాలూ అనుభవించేందుకుగాను కొంత కర్మకాండను యీ జన్మలో చేయాలి. అంటే తనకు నచ్చిన ఒక యువకుణ్ని విష ప్రయోగంద్వారా హత్యచేసినట్లయితే, మరుజన్మలో అతను తనకు భర్త అవుతాడనేది ఈ మూఢనమ్మకం తాలూకు క్రతువు!

ఐతే ఈ విషప్రయోగం జరిగేందుకుకూడా ఒకపద్ధతి వుంది. ఒకపక్క తన మూఢనమ్మకం తాలూకు కోర్కెతీరాలి; మరోపక్క

సమాజదృష్టిలో ఇది నేరంగానూ, తాను నేరస్థురాలుగానూ కనిపించకూడదు. అంటే అసలు నేరమే బయటపడరాదు.

అందుకని ఆ పద్ధతి ఇది: బల్లినిపట్టుకొని దాన్ని తలక్రిందుగా దూలానికి వేళ్లాడేసి, క్రింద బియ్యంపోసి వుంచుతారు. ఆబల్లి ఆహారం లేకపోవటంవల్లా, రక్తప్రవాహం తలక్రిందులవటంవల్లా కొన్ని చుక్కల విషాన్ని కక్కుతుంది; ఆవిషం బియ్యంలో పడుతుందికదా! ఆ బియ్యాన్ని జాగ్రత్తచేసి, తానుకోరిన యువకునికి అన్నం వొండిపెడితే, ఆయువకుడు క్రమంగా తీసుకొని ఛస్తాడు. ఏదోకనుక్కోలేని జబ్బుతో స్వాభావిక మరణానికి గురైనట్లే భావించబడుతుంది.

ఇది కన్నడపువారిలోవున్న నమ్మకం. ఇలాటికేసులు ఏ ఒకటి రెండో నిజంగా జరిగే ఉండొచ్చు; వాటి తాలూకు ప్రచారంమాత్రం అధికంగా జరిగిఉండాలి.

ఇక దీనివెనుకవున్న ఆశయాలసంగతి చూద్దాం: సామాన్యంగా యవ్వనంలో విధవరికాన్ని భరించటం కష్టమే! స్వభావసిద్ధమైన కామ వాంఛలకు ఎదురీదాలి. చాలామంది యువతులు కాలుజారటం జరుగుతుందనే భయంతో, ఈ మూఢనమ్మకం ప్రవేశపెట్టబడి ఉండాలి. ఇందువల్ల యువకులుకూడా విశేషంగా భయపడిపోతారు. అనుభవించేందుకు అందరూ సిద్ధంకావొచ్చుకాని, చచ్చేందుకు ఎవరు నడుంకట్టగలరు కనుక? విధవలజోలికి పోకుండా వుండేందుకు ఈ వింత ఆచారం ఉపకరిస్తోందని తోస్తుంది; ఇంకోవిధంగా చూస్తే విధవలను సమాజం దూరంగా వుంచిందనిపిస్తుంది కూడాను.

★

టిబెట్టియన్లలో ఒక వింత ఆచారంవుంది: 'టిమోమమోహై' అనబడే పర్వదినంనాడు, దేవాలయానికి వొచ్చే స్త్రీలలో, పురుషుడు ఏ స్త్రీ తాలూకు టోపీని లాక్కుంటాడో, ఆమె ఆరాత్రి అతనితో గడపాలి. లైంగిక ఆచారాలు, మతైకమైన ప్రాధాన్యతకు ఎలా జతచేయబడినవో ఈ ఆచారం తెలియజేస్తోంది. ఇది గత సంచికలో వివరించిన రవికల పండుగను పోలివుందికదూ? ★

# స్వైరతి

హావలాక్ ఎల్లిస్‌ను అనుసరించి రచన... కాంతినాథ్

మతైకంగా గాఢవిశ్వాసాలున్న వాళ్ళే యీ రకంగా కామతృప్తిని పొంద గలిగామని చెప్పిన సందర్భాలున్నవి. అందమైన, బాగా ఉద్రిక్త పూర్వకంగా మాట్లాడగలిగిన మత ప్రచారకుడంటే, ఆడవాళ్ళల్లో ఇట్టే పేరు సంపాయిస్తాడు! స్త్రీలు పైకి పొంగకపోయినా, శారీరకవాంఛల్ని, మనోప్రవృత్తుల చాటున దాచి తమ పవిత్రతను కాపాడుకుంటున్నట్లు భావిస్తారు. ఐతే మొదట్లో యీ భావాలు ఎంత ఆత్మకు సంబంధించినవైనా చివరకు శారీరకంగా రూపొందక తప్పటంలేదు. అవి స్వర్గంవైపు పైకి పెరగవొచ్చుగాక; కాని వాటివేళ్ళు భూమిలోనే ఉన్నవి! ప్లాటానిక్ ప్రణయ మనుకొని ప్రియురాలి కళ్ళల్లో చంద్రుణ్ణి తప్ప చూడలేని ప్రియులుకూడా చివరకు, భూమిమీదదిగి శారీరకానందానికి రావాల్సిందే!" అన్నాడు ఆయన.

## మతము : పశుత్వం

గత శతాబ్దంలో క్లిఫ్టన్ కాలేజి హెడ్‌మాష్టరు మొగపిల్లల్లో సెక్సు వాంఛల్నిగూర్చి చర్చిస్తూ, మతైకంగా నమ్మకాలులేని, రక్షణలేని పిల్లల్లోనే యీ రకంభావాలు ఎక్కువనే అభిప్రాయాన్ని వెలిబుచ్చాడు. మతానికీ పశుప్రవృత్తులకూ ఎప్పుడూ గొప్ప సంబంధం వుంటూనే వుందనేది కాచి వడగట్టిన సత్యం. ఉద్రిక్తపూరితమైన మత ప్రబోధాలతో కామోద్రేకం కట్టుబడుతుందనే ఉద్దేశ్యం చాలామందికి వుంది; కాని అది పవిత్రతను కాపాడకపోగా, మనిషిని కామంవైపు ఎగదోస్తుందనేది జీవితానుభవంగా తయారవుతోంది.

1881 లో విల్సన్ అనే మత ప్రచారకుడు ఏమన్నాడో చూడు: "మతైక బోధనలో ఆత్మనుగూర్చిన ప్రబోధం ఎక్కువైనట్లయితే, వ్యక్తిలో విషయాసక్తి కూడా ఎక్కువవుతుంది!"

"ప్రతి సందర్భంలోనూ మనస్సును కట్టివేయవలసి వుంటుంది; బలవత్తరమైన సూచనలద్వారా ప్రబోధం జరుగుతుంది...మతైకంగా జరిగే విధానం ఇదే! దీంలో విశేషం ఏమంటే రెండు విరుద్ధభావాల సంఘర్షణకు తావుండదు. సానుభూతిని పొందేట్లుగా, మనసుకు పట్టేటుగా ఒకేదారి చూపబడుతుంది. అప్పుడే

నైతిక ప్రబోధం సక్రమంగా జరిగినట్లు భావించబడుతోంది...జాగర్తగా ఆలోచిస్తే యీ విధానం లైంగిక యంత్రాంగాన్ని నైతికదృష్టికి సరిచేయవలసిన అవసరం, లైంగికభావాల్ని వేరొక జక్కకు తిప్పవలసిన అవసరంతోనే కదా యీ మత ప్రబోధం?" అన్నాడు థామస్ అనే ఆయన.

## అన్యుల అభిప్రాయాలు.

మతానికీ సెక్సుకూవున్న సంబంధాన్ని అన్యదేశస్థులుకూడా నగ్నరూపంలో చూడగలిగారు. ఫ్రెడరిచ్ అనే జర్మన్ శాస్త్రవేత్త మతైక ఉద్రేకాలకూ, సెక్సు ఉద్రేకాలకూ వున్న పోలికనూ, సంబంధాన్నీ రూపించేందుకు అనేక కేసుల్ని రికార్డు చేశాడు.

"మతైకమైన తలపులతో, లైంగిక యంత్రాంగానికి సంబంధం వున్నదను కోవటం నిజంగా శుద్ధ పొరపాటేనని చెప్పేందుకు సాహసిస్తున్నాను" అన్నాడు, శేండర్ కాల్క్.

ఫ్రాన్సులో రేగిస్ అనే ఆయన పై అభిప్రాయాన్ని ఖండిస్తూ "గుప్తాభిప్రాయాలకూ, లైంగికమైన ఆలోచనలకూ చాలా దగ్గిర సంబంధంవుంది. పిచ్చివాళ్లల్లో యీ రెండు రకాల ఆలోచనలూ కలిసిపోయి మూర్తీభవించడం గమనించవొచ్చు." అన్నాడు.

బ్రెదియర్ అనే ఆయన లైంగికోద్రేకాలతో సంబంధించిన పిచ్చి (మదపిచ్చి) ఎక్కువగా కాన్వెంట్స్లలో కనిపిస్తుందన్నాడు. బెవిన్లూయిస్ అనే ఆయన, స్త్రీలు యవ్వనంలో ఉన్నప్పుడు మతైకంగా కుంగుదలను సూచిస్తారనీ, ఇది చాలా ఎక్కువ సందర్భాల్లో గమనించదగిందనీ అన్నాడు.

"మతం ప్రణయంతో లంకె వేయబడింది. ఆడదాని ప్రణయమూ, భగవంతుని పట్ల జరిగే పూజలూ పునస్కారాలూ భక్తీ మొదలైనవి యువక హృదయాలలో సంఘర్షిస్తూనే ఉంటవి. యీ రెండురకాల అభిప్రాయాలూ చాలా లోతుగా పాతుకొని పోయి ఉంటవి." అన్నాడు సావేజ్.

కొనల్లీనార్మన్ అనే ఆయన ఇలా అంటున్నాడు: "మనోవ్యాధుల్లో చూసే ఉద్రిక్తత, కామోద్రేకానికి సంబంధించే వుంటుంది—అది కామాన్ని అణుచుకోవటం కాదు; దాన్ని పెంచుకోవటమే నేమో? ఒకో సందర్భంలో యీ ఉద్రేకాలు, మతైకమైన ఆలోచనలతో కలగాపులగమై పోతూంటవి" ఇలాటిది స్త్రీలలో ఎక్కువ."

"తాము మేరీకన్యలమనీ, లేదా భగవంతునికి భార్యలమనీ, భగవదర్పితులమనే పవిత్ర భావాలతో వుండే స్త్రీలు ఎప్పటికైనాసరే, లైంగిక వాంఛల్ని అణగ ద్రొక్కుతున్న చిహ్నాల్ని కనబరుస్తారు." అన్నాడు క్లారాబ్రస్.

బ్లోచ్ అనే ఆయన 'ఒకవిధంగా చూస్తే మతాలచరిత్రే, మానవుని లైంగిక కలవులు పొందిన పరిణామాల చరిత్ర' అన్నాడు.

క్రాఫ్ట్ ఎబ్బింగ్ పవిత్రతకూ, సెక్సుకూవున్న సంబంధాన్ని చర్చిస్తూ, మునులనేవాళ్లే ఎక్కువగా లైంగికపతనానికి సిద్ధంగావుంటారనే అభిప్రాయాన్ని వెల్లడిచేశాడు. 'మతైకమైన ఉద్రేకాలూ, లైంగికమైన ఉద్రేకాలూ పరిమాణంలోనూ, వస్తుగుణంలోనూ పెరిగిపెరిగి వైరితలలు వేస్తవి. యీరెండుకూడా క్రూరతకు దారితీయటమనేది, ఆఉద్రేకం ఒక వ్యాధిగా తయారైనప్పుడు జరుగుతుంది.' అన్నాడాయన.

## అభిప్రాయాల సారాంశం

పైన చెప్పుకున్న అభిప్రాయాలన్నిటినీ క్రోడీకరించినట్లయితే, లైంగిక వాంఛతాలూకు బలవత్తరమైన శక్తుల్నే, మతైకంగా ఉపయోగించటం జరుగుతోందని అర్థమవకపోదు. ఐతే కేవలం లైంగిక వాంఛల్లోనే మతంతాలూకు వేళ్లు పాతుకున్నవనికానీ, మతమంతా దీనిమీదనే ఆధారపడివుందనికానీ అనలేము. మ్యూరిజర్ అనే ఆయన యీవాదన సంస్కారరహితంగా వుందంటూ 'మతంమీద వుండే మమత, లైంగికమైన మమతను పరిపూర్ణం చేసేందుకు తోడ్పడుతుంది. ప్రణయంలోని 'ద్వేషం' కూడా ఇందుకు మినహాయింపుకాదు.' అన్నాడు.

1898 లో స్టార్‌బక్ మతము - కామముమీద చర్చిస్తూ 'పరిపూర్ణంగా పెరిగిన మతంమీద లైంగికజీవనం తన ఛాయల్ని పరుచుకుంటుంది. కాని మనస్తత్వానికి సంబంధించిన సహజవాంఛలే మతం పెరిగేందుకు పెద్దకారణం; అంతేకాని, యీవాంఛలు మతం నిలబడేందుకు తగిన ముడిసరకును సరఫరాచేసి వుండవు' అన్నాడు.

## ఆదర్శపురుషులు : స్వరతి.

యుగపురుషుల్ని ఆదర్శవ్యక్తులుగా పూజించుట మనేది కలకాలంనుంచీ వొస్తూనేవుంది. అలాటి వ్యక్తుల్ని తలుచుకున్నంత మాత్రానే ఉద్రిక్తతను పొందటం సహజం. యీ ఆదర్శమే వేరువేరు ఉద్రేకాలతో కలిసి కామసంబంధమైనదిగా మారటం అనేక సందర్భాలలో, అనేక జాతుల్లో, అనేకమంది వ్యక్తులపట్ల నిజమైంది.

ఉదాహరణకు సెరుక్స్ అనే ఆయన రికార్డుచేసిన ఒకానొక విచిత్రానుభవంలో, ఒకామె చాలా చిన్నతనంనుంచే క్రైస్తవమతంమీదా, క్రీస్తుమీదా ఎంతో మమతతో ఉండి, క్రైస్తే తనకు భర్త అని గాఢంగా నమ్మి, చివరకు అనేక భావాల సంఘర్షణలో ఒకరకం హిస్టీరియాకు గురైంది. మొదట్లో ఆమె భక్తిభావాలు వేరు. క్రమంగా అవి సెక్సువైపు కేంద్రీకరించబడటం, ఇదంతా

తనకు తెలియకుండానే, లేదా తను మోసపోయేటంతగా నమ్మటంవల్ల ఆమె పిచ్చి ధోరణికి దారి తీసింది.

మేరియానీ అనే ఆయన రికార్డుచేసిన వేరొక ఇల్లాలి జీవితగాధలో, ఆమె తనకు కలిగిన అపవిత్రభావాలతో కుంగిపోయి, తనకు తానుగా అనేక శిక్షల్ని వేసుకొని, తపస్సు ప్రారంభించి, దాంతో తన పాపాలన్నీ కడిగివేయబడినవని నమ్మింది. ఆ ఆనందంలో ఆమెఊహలో క్రీస్తును చాలా దగ్గిరదాన్నయాననికూడా తలిచింది. అతనే తన హృదయాధి దేవతనే నమ్మకంలో ఆమె ఉద్రిక్తతను పొందేది...మహామునుల జీవితాలుకూడా ఈ వ్యక్తి జీవితానికి పోలికల్ని కలిగి వుంటవనే అభిప్రాయాల్ని మనస్తత్వవేత్తలు వెలిబుచ్చారు.

అతి పవిత్రజీవితాల్ని గడిపే అనేకమంది వ్యక్తుల తాలూకు అనుభవాలు' స్వీయచరిత్రలద్వారా తెలియ వొచ్చినవి పరిశీలించినట్లయితే, మతైకమైన నమ్మకాలతో కామసంబంధమైన తలపులు కలగాపులగమై, వారి జీవితాలను ఎలా తలక్రిందులు చేసిందీ అర్థమాతుంది. ఆ వూహాల శక్తి ఎంతవరకూ పోతుందంటే- నిజంగానే ఎవరో వ్యక్తి-దేవతో, దెయ్యమో తమకు కామతృప్తి కలిగించారనీ, అందువల్ల అపవిత్రమయ్యాననే బాధకు గురిచేయ గలుగుతుంది.

ఈ విధంగా సైతాన్ చేత పీడించబడి కామ సంబంధమైన అపచారాలు జరిగినట్లుగా భావించ బడటం చాలా అనాదినుంచీ, అనేక దేశాల్లో గాఢనమ్మకాలుగానే ఉండిపోయినట్లు తోస్తుంది. దెయ్యం పట్టటం, దానిచేత పీడించబడటం మొదలైన అనేక కధలు నేటికీ మనం వింటూనే వున్నాం కదా! ఇదేవిధంగా దేవత్వమున్న పురుషులమీాది భక్తి, కామసంబంధమైన వూహాలతో కలిసిపోయి, ఆ వ్యక్తికి తాను దగ్గరైనట్లు, తమ మధ్యవున్న సంబంధాన్ని చిరస్థాయిగా చేసుకునేందుకు కామ ప్రవృత్తుల్ని తృప్తిపరుచుకున్నట్లుగా భావించటం, నిజంగానే ఆపురుషులతో మాట్లాడినట్లు, శారీరక అనుభవాల్ని పొందినట్లే నమ్మటంకూడా చరిత్రకు కొత్త విషయాలు కావు.

మతంతాలూకు రహస్యశక్తులే, వ్యక్తిని తలక్రిందులుచేసి, తమాషావూహలకు గురిచేయటం జరుగుతుందనేది అబద్ధంకాదు. భగవంతుని ప్రేమించమనటంలోనూ, భగవంతుని ప్రేమించటంలోనూ వివిధరీతుల్లో స్వరతిచిహ్నాలు ప్రబలుతవి. మతంకోసమై ప్రాణత్యాగాల్ని చేసిన మహావీరులుకూడా, మతస్థాపకునిపట్లవుండే అనురాగంవల్లనేకదా! ఒకానొక మతప్రచారకురాలు క్రైస్తవమతాన్ని విసర్జించమని అనేకబాధలకు గురిచేయబడినప్పుడు ఆమె 'నేను నా ప్రియతముణ్ని నిరాకరించలేను. ఆయన నాకోసం, నాబోటి అనేకమంది అనాధలకోసం పడరానిపాట్లు పడ్డాడు' అంది. ఆమెభక్తి, రూపాంతరంలో కామప్రవృత్తులతో కలిసిపోవటం స్పష్టంగా కనిపిస్తుంది.

## ఇతరమతాలు : స్వరతి

క్రైస్తవ మతంలోని యీ నిగూఢత, చాలా త్వరలోనే ఇస్లాం మతంలోకి బలవత్తరంగా పాకింది. 13-వ శతాబ్దంలో తిరిగి ఇస్లాంనుంచి, ఆ నిగూఢత రేమాండ్‌లల్ అనే ఆయన ద్వారా క్రైస్తవమతంలోకి తిరిగి పాకింది. ఆయన రాసిన "ప్రియుడు, స్నేహితుడు గ్రంథం" అనే పుస్తకం స్పెయిన్‌లోని గుప్తత్వంలో (mysticisam) పెద్ద మార్పుల్ని తీసుకొచ్చింది. "తీయనిబాధ" "మతంకోసమై బలి అవటంలో అంతరార్థాలు, శారీరకమైన "ప్రణయము-బాధ" లతో కలిసిపోయినవి.

గుప్తత్వాన్ని ఆరాధించేవారుకూడా, ఒకో సమయంలో శారీరకమైన కామాలకు గురయ్యారనేది వారే ఒప్పుకున్నారు.

'ది ఇమిటేషన్ ఆఫ్ క్రైస్ట్' అనే పుస్తకంలో విరుద్ధజాతి వ్యక్తి కలిగించే కామోద్రేక స్వరూపం స్పష్టంగా తెలుస్తుంది. ఒకానొక మేధావిని యీ పుస్తకాన్ని 'మతైకమైన కామోద్రేకాన్ని రెచ్చగొట్టేది'గా పేర్కొన్నది. ఇలాటి సందర్భాలలోని ప్రణయం, మానవులకు సంబంధించినట్లుగానేవుండి, అత్యున్నత శిఖరాలకు పాకినట్లు తోస్తుంది. "ప్రణయాన్ని మించిన మధురమైన వస్తువు, అంతకన్న ఆనందాన్నిచ్చేది, అంతకన్న విశాలమైంది ఇటు భూమిమీదకానీ, అటు స్వర్గంలోకానీ లేదు. ఎవరైతే మనసారా ప్రేమించగలుగుతారో వారు పరుగెత్తుతారు; గాలిలో ఎగురుతారు; ఆనందంతో నాట్యంచేస్తారు. బహుమానాలకోసం వారు చూడరు; అన్ని సత్కార్యాలకూ కారకుడైన భగవానునివైపు చూస్తారు. ప్రణయానికి హద్దులనేవి లేవు. అలాటి ప్రణయోపాసికి బరువుభారాలు, అలసట ఉండవు; చేయలేనిదంటూ ఉండదు; అందుకనే ఎవరైతే ప్రణయోపాసకులు కారో, వారు పరాజయాన్నిపొంది, అధోగతికి దిగజారుతారు...ప్రణయధిదేవతా! నీవు నాదానివి, నేను నీవాణ్ణి!" ఇదీ ఆ పుస్తకంలోని 3-వ ప్రకరణంలోని ఒక భాగం.

## హిందూమతం : స్వరతి.

హిందూమతంలోకూడా పైన చెప్పుకున్న విధమైన కామ ప్రవృత్తుల సంచలనం కనిపిస్తుంది. దేవత్వమున్న పురుషుల నామాలనే మానవులు తమ పేరులుగా ఉపయోగించటం దగ్గర్నుంచీ, భగవానునిమీది భక్తి వివిధరూపాంతరాల్లో కామ సంబంధమైన తలపులతో కలిసిపోవటం గమనించదగ్గ విశేషం.

ఉదాహరణకు కృష్ణుణ్ని తీసుకోండి: కృష్ణుని ఆరాధించటంలో మతైకంగా

వొచ్చిపడిన మార్గాల్ని పరిశీలిస్తే, పడకగదిలోకూడా కృష్ణుడిబొమ్మను వేళ్లాడేయటం, ప్రతి స్త్రీ కృష్ణుడే తనకు భర్త కావాలని మనసులో కోరుకోవటం మొదలైనవి భక్తి పారవశ్యంకిందనే జమకాని, పరపురుషునిపట్ల కామంగా చలామణీ కాకుండటం మనకు తెలియనివికావు. అటు రుక్మిణికూడా కృష్ణుని చూడకుండానే ఆయనే తన నాథుడని నమ్మింది. ఇదేవిధంగా పురాణయుగంలోని అనేకమంది స్త్రీలు కృష్ణుడు, లేదా విష్ణువే తమ భర్తని నమ్మి ఆయనకోసం తపస్సుచేసిన అనేక కథలు ఉన్నవి... రామాయణంలో మహామునులందరూ రాముని మీది తమ భక్తి పారవశ్యాల్ని స్థిరంచేసుకునేందుకు తమకు స్త్రీజన్మ ప్రసాదించమని కోరటం, అది తరువాతి అవతారంలో సిద్ధిస్తుందని రాముడు అనటం ఆ తరువాత కృష్ణావతారంలో, రాముడే కృష్ణుడుగానూ మహామునులందరూ గోపికలుగానూ జన్మించటం జరిగిందనే కథవుంది. ఒక అవతారంలో ఏకపత్నీత్వం, మరో అవతారంలో బహుభార్యాత్వం వహించటాన్ని, భగవంతునికిని అంటకట్టబడి, సమర్థించబడటంతో మతం తాలూకు స్వరతి శక్తుల నిగూఢత అర్థమవకపోదు. కృష్ణుని కామవాంఛల్ని సమర్థించేందుకు యీ కథ అన్వేషించబడి ఉండొచ్చు.

తమాషా-యీ ఆధునిక ప్రపంచంలోకూడా స్త్రీలు కృష్ణుణ్ని తమ హృదయనాయకునిగా తలచటం, అది పవిత్రభావంగానే చలామణి కావటం జరుగుతోంది. ఐతే వేరొక పురుషుడు - జీవమున్న వాణ్ని ప్రేమించటంవల్ల కాలుజారొచ్చు; కాని వూహలోమాత్రమే జీవించగల కృష్ణుణ్ని ప్రేమించటంతో, తలపుల కేంద్రీకరణ వేరొక వ్యక్తులమీదికి పోకుండా ఉండే అవకాశం వుంటుందని నమ్మబడివుండొచ్చు. నేటికీ కృష్ణుని వేషాన్ని చూసి మూర్ఛబొయ్యే స్త్రీలూ, కృష్ణుడు వేషంవేసిన వ్యక్తి అభిమానాన్నీ, అనురాగాన్నీ పొందుదామనే అభిలాష ఉన్నవాళ్ళూ ఉన్నారంటే ఆశ్చర్యంలేదు. మతైకమైన నమ్మకాలను బలవత్తరం చేసేందుకు కామప్రవృత్తులు ఉపకరించి, ఉపయోగపడినవని తోస్తుంది.

ఇంకో విశేషమేమంటే యీ కృష్ణుడు ఇటు పతివ్రతలకే కాకుండా, అటు వ్యభిచారిణులకూడా దైవంగానే ఉంటున్నాడు. ఐతే తాము ఇతరులతో వ్యభిచరించినప్పటికీ, తమ మనోనాథుడు ఆ కృష్ణుడే ననుకోవటంలో ఒకతృప్తి, భక్తి ప్రధానమైన ఆశయసిద్ధీ ఇమిడి ఉండొచ్చు.

ఇక పురాణాలు తిరిగేస్తే దైవాలవల్ల కలిగిన సంతానం, ఆ సంతానానికి ప్రాప్తించిన దైవత్వం మొదలైనవి అనేక సంఘటనలు కనిపిస్తవి. పిల్లలులేనివాళ్లు నేటికీ భక్తితో ఆ పరమాత్ముని పూజించటం, ఆయన కరుణించి పిల్లల్నివ్వటం మొదలైన ఘట్టాల్లో వరప్రసాదిత సంతానమనే పవిత్రభావన గోచరిస్తుంది. ఇక దేవాలయాలమీది బూతు బొమ్మలూ, దేవదాసీలుండటం మొదలైనవి భక్తికీ కామానికీ గల సంబంధాన్ని వివిధరూపాల్లో రుజూచేస్తూనే ఉన్నవి కదా!

మహాత్యాగులవలె, సన్యాసులవలె నటించేవారు క్రమంగా, తమ భక్తి

భావాలవల్ల. తమలోనే ఆ కృష్ణత్వం ప్రవేశించినట్లు నటిస్తూ, చుట్టూ జేరిన భక్తురాండ్రను గోపికలని భ్రమింపజేసి, వారిచేత పాటలుపాడించి, నాట్యాలుచేయించి, అన్ని సపర్యల్నీ పొందటం, చివరకు ఇదంతా వొట్టి బూటకంగా బైటపడటం, అలాటి వారిని ప్రజలో, ప్రభుత్వమో శిక్షించటం మొదలైన అనేక ఘట్టాల్ని, దేశంలో అనేక ప్రాంతాలనుంచి మనం యీ శతాబ్దంలోకూడా వింటూనే వున్నాం. ఇక్కడ భక్తిభావాలు మనిషిని ఎంతవరకూ తలక్రిందులు చేస్తవో, వాటికీ సహజకామోద్రేకాలకూగల సంబంధం ఏమిటో స్పష్టంగా తెలియటం లేదా?

## విరుద్ధ భావాలు

కొంతిమంది మతానికీ కామానికీగల సంబంధాన్నిగూర్చి వింటేనే ఆశ్చర్యపోవటం, అలా సంబంధం ఉండేందుకు వీల్లేదని వాదించటం లేక పోలేదు. కాని యీ విధంగా అభిప్రాయాల్ని తోసి పారెయ్యటంలో హేతువాదం కనిపించదు. మతైకంగా ఉద్రూతలూగే మనిషిలో కామం పనిచేయటం, అతని బాధ్యత కాదు; కాని ఆ కలిగిన ఉద్రేకాలను తొక్కిపట్టుకో గలగటంలో అతని బాధ్యతవుంటుంది. అలా తొక్కిపట్టుకోవటంవల్ల, ఆ అవసరాన్ని గుర్తించటంవల్ల, లాభం లేక పోవొచ్చు; పైన నష్టంకూడా ఉండొచ్చు. ఏమైనా సెక్సుకూ, మతానికీ క్రియ, ప్రతిక్రియలకున్న సంబంధంలాటిది వుంది. యవ్వనారంభంలో శారీరకంగా కలిగే మార్పులు, మానసికంగా మతైక పరిణామాలుగా రూపొందుతవి. మతైకమైన పనులకూ, కామసంబంధమైన పనులకూ దగ్గిర పోలికవుంది. మతంచాటున దాగిన కామవాంఛలు ఒక్కొక్కసారి విపరీత ధోరణిలో బైటపడుతూంటవి.

## పగటి కలలు : స్వరతి

పగటికలలు కని స్వరతిద్వారా తృప్తినొందటాన్ని కూడా ఇక్కడ చర్చిద్దాం. చాలాకేసుల్లో హస్తప్రయోగానికి యీ పగటికలలే నాంది ప్రస్తావనగా ఉండి, ప్రాముఖ్యతను వహించినప్పటికీ, శాస్త్రజ్ఞులు యీ విషయమై ఎక్కువ పరిశోధనలు జరిపి ఉండకపోవటం శోచనీయం. దీనికి కారణమల్లా ఇది ఒకే వ్యక్తికి తాలూకు ఊహానందంగా వుండటంవల్ల, అలాటివ్యక్తులు తెలియపరుస్తేనే కాని, తెలుసుకోలేనిదిగా వుండిపోయింది. పైపెచ్చు ఇది ఒక వ్యాధి కానందువల్ల డాక్టర్ వరకూ రావలసిన అవసరం సామాన్యంగా ఉండదు. పోతే మితిమీరిన కేసుల్లోకూడా మూఢనమ్మకాల ఆధారంగా దీన్ని ఏదెయ్యం పట్టటంగానో పరిగణించి, భూతవైద్యులమంత్రగాళ్ళను పిలవటంతో శాస్త్రజ్ఞులు పరిశోధించేందుకు తగినంత అవకాశం చిక్కటంలేదు.

ఐనప్పటికీ కొంతమంది హేమాహేమీలు దీన్నిగూర్చి తీవ్రంగా ఆలో

చించకపోలేదు. లియోరాయిడ్ అనే వెలస్లీ కాలేజి ప్రొఫెసర్ దీన్ని ఒక 'ధారావాహిక కథ' అన్నాడు; అంతులేని కథగా ఊహించుకుంటూ, అందులో కథానాయకుడు లేదా కథానాయకి పాత్రను తానే ధరిస్తూ తనలోతాను తృప్తిపొందటం, అది తనకొరకై ప్రత్యేకించబడిన పవిత్ర కథవలె భావించటం, తనకు సానుభూతిగల వారి దగ్గరమాత్రమే ప్రస్తావించటం జరుగుతోంది. యీ పగటికలలు కనటం ఆడపిల్లలపట్లా, యువతులపట్లా అధికం; ఇదే మొగపిల్లలపట్లా, యువకుల పట్లా తక్కువ.

352 కేసుల్ని పరిశోధిస్తే స్త్రీలలో 47% మందీ, పురుషుల్లో 14% మందీ, పగటి కలల్లో ధారావాహికమైన కథను వూహించుకోగలుగుతున్నారని తేలింది. సర్వసామాన్యంగా యీ కథకు మొదలు వ్యక్తిగతమైన ఒక చిన్న అనుభవం; లేదా ఏదైనా పుస్తకంలో మనసుకునచ్చిన ఒక చిన్న సంఘటన. కథలో తనదే ప్రముఖపాత్ర. సామాన్యంగా నిద్రకుముందే దీన్ని వూహించుకోవటం జరుగుతోంది.

1901 లో 1500 మంది యువతీ యువకుల తాలూకు అనుభవాలు సేకరించబడినప్పుడు, (వీరిలో వెయ్యిమంది స్త్రీలున్నారు) నూటికి ఒక్కరు మాత్రమే ధారావాహికమైన కథను వూహించుకోగలిగినట్లు తేలింది. 15 సం.ల వయసున్న కుర్రవాళ్లు సామాన్యంగా ఆటలపాటల పోటీల తాలూకు వూహల్తో పగటికలల్ని కనటం గమనించబడింది. అదే యీడుగల ఆడపిల్లలు పుస్తకాల్లో చదివే కథానాయికల్ని వూహించుకొని, తామే ఆ నాయికలు ఐనట్లు భావించి పగటికలలు కనటం జరిగింది. 17 సం. ల వయసుల్లో ఆడపిల్లలు పెళ్లి, ప్రణయం మొదలైన విషయాల తాలూకు పగటి కలలుకు గురయ్యారు. ఒకానొక 19 సం॥ల వయసున్న ఆడపిల్ల తనకు పగటి కలలు కనేటంత తీరిక వుండదనీ, ఆ తీరికవున్నప్పుడు ఇతర ఆడపిల్లల వలెనే ఒక ఆరడగుల మూడంగుళాల ఎత్తున్న నాయకుణ్ణి వూహించుకొని కలలుకంటాననీ ఒప్పుకుంది.

## పగటికలల ధోరణి

యీ పగటి కలలన్నీ సెక్సుకు సంబంధించినవిగానే వుంటూన్నట్లుగా వాటిని అనుభవించినవారు చెప్పగలుగుతూనే వున్నారు. ఐతే వ్యక్తిగత అభిరుచులూ, సంస్కారాల్నిబట్టి యీ కలలు అన్నీ ఒకే మూసలోనివని చెప్పలేము కాని, వాటి ధోరణి, అవి పెంపొందే మార్గమూ దాదాపు ఒకటిగానే వుంటూన్నవి. ఐతే బాగా ఆలోచించగలవారి కలల్లో పెద్ద భేదం కనిపిస్తుంది.

ఒకొకప్పుడు సహజధోరణి మారుతూండటం యీ కలల్లోని ఒక విశేషమనే చెప్పాలి. యీ అసహజధోరణి నిత్యజీవితంలో కనిపించేదికాదు; ఐన్నటికీ ఆ వూహ ఇచ్చే ఆనందానికి ముగ్ధులై, దాన్ని కేవలం వూహాలోనన్నా అనుభవించి

తృప్తినొందటం జరుగుతోంది. మరి సహజధోరణిలో లైంగిక తృప్తి లభ్యం కావటం లేకపోవటంవల్ల, యీ అసహజధోరణి పెంపొందే అవకాశాలు ఏర్పడుతవి; అందుకనే యువతీ యువకుల్లో యీ పగటికలలు ఎక్కువగా కనిపిస్తవి.

కలను తెగగొట్టే ప్రయత్నం సామాన్యంగా జరగదు; కలలోని అపూర్వ, అసంభవ సంఘటనల్ని గూర్చిన తలపే ఉండదు. యీ కలఫలితంగా హస్తప్రయోగం జరిగే తీరుతుందని చెప్పలేము; కాని లైంగిక యంత్రాంగం మీద యీ కల తాలూకు పలుకుబడులు స్పష్టంగా కనిపిస్తవి; ఒక్కొక్కప్పుడు సూచించటంకూడా జరుగుతుంది.

పగటికల ఒక వ్యక్తిగత అనుభవం. సర్వ సామాన్యంగా ఒకానొక కాల్పనిక వ్యక్తిని సృష్టించుకోవటం జరుగుతుంది. తనకు ఎలావుంటే ఇష్టమో తెలుసుకొని, ఒక వ్యక్తి తాలూకు కొన్ని శారీరక గుణాల్నీ, మరోవ్యక్తి తాలూకు మరికొన్ని గుణాల్నీ కలుపుకొని ఒక వూహాసుందరినో, సుందరుణ్నో సృష్టించుకోవటం పరిపాటి. అలాటివ్యక్తి నిత్యజీవితంలో లభ్యమౌతుందని కాదు; అలావుంటే తనకు బాగుంటుందని; నిజంగా లభ్యమైతే కలలుకనే అవసరమే ఉండదు కదా!

సర్వసామాన్యంగా వ్యక్తి తనవూహలకు సరైనభాషా స్వరూపాన్ని ఇవ్వలేని స్థితిలో, యీ రకమైన కలనుంచి తృప్తి పొందుతాడు. ఒకవేళ భాషాస్వరూపాన్ని ఇవ్వాలనే వాంఛ వున్నప్పటికీ, ఆ తెలిసీ తెలియని స్థితి కలిగించే ఆనందంకోసమే కలను ఎన్నుకుంటాడు. మరికొన్ని కేసుల్లో కథా సంవిధానంలో అనేకచిక్కులు, ప్రణయ ఘట్టాలు ఏర్పరచబడి, వాటన్నిటినీ ఎదుర్కొని జయిస్తూ చివరకు క్లైమాక్సు రావటం ఒక విశేషం. యీ క్లైమాక్సు ఉద్రిక్త పూరితంగానూ, హృదయంలోని వాంఛలన్నీ ఒక్కసారిగా తీరినంత తీవ్రంగానూ వుంటుంది.

## పగటి కలలు : వ్యక్తిగత జీవితానుభవం.

యీ పగటికలలు వ్యక్తి తాలూకు జీవితానుభవాలమీద ఆధారపడి ఉంటవని చెప్పవొచ్చు. ఒకే రకమైనకల సంవత్సరాల తరబడిగా ఆనందాన్ని ఇవ్వలేదు. క్రమంగా కథలోమార్పులు వొస్తూండటమో; లేదా మరొకొత్తరకం అనుభవాన్ని పొందాక, దాని మీద కొత్త కథను సృష్టించుకోవడమో జరుగుతుంది.

ఉదాహరణకు: చిన్నపిల్లలుకనే కలలు విచిత్రంగా ఉంటవి. వారి కలల్లో దేవకన్యలు, ఎగిరేమనుషులు, కామరూపులు, ఘోరమైన పోరాటాలు, జంతువులు మానవభాష మాట్లాడటం మొదలైన వెన్నో ఉంటవి. కారణమల్లా వారు నిత్య జీవితంలో వినే కథలూ, చదివేకథలూ అలాటివి/ అవి వారి మనఃఫలకంమీద హత్తుకొనిపోయి, అదంతా నిజమేననే ఒక నమ్మకంతో తన జీవితంలో కూడా అలా జరిగి, ఆ రాజకుమారుని వలెనే సప్త సముద్రాలూ దాటి, రాక్షసుని బారి

నుంచి రాకుమార్తెను తప్పించి, వివాహమాడాలనే వాని వాంఛ యీ స్వరూపాన్ని ధరిస్తుంది. కొంచెం యీడొచ్చిన పిల్లల్లో ఆటపాటల పోటీలలో విజయాన్ని సంపాయించటంమీద కలలు వొస్తవి. యీ వయస్సు మరికొస్త ముదిరాక, చిన్నతనాన విన్న కథల్లోని అసంభవ సంఘటనల్ని విసర్జించటం, దాని స్థానే ప్రణయమూ, కామ సంబంధమైన వూహాలూ కలిసినకథలు వూహించుకోవటం జరుగుతుంది. ఇక్కణ్నుంచీ వయస్సు పెరిగేకొద్దీ, యీ చొకరకం ప్రణయాలు విశిష్టరూపాన్ని పొంది, క్రమంగా ఉన్నతస్థాయిని అందుకునేందుకు దారితీస్తవి.

## పగటికలలు : ఆధారాలు

పగటికలలు సాధారణ వ్యక్తుల్లోనూ, అసాధారణ వ్యక్తుల్లోనూ రావటం కద్దు. రాసియ్యా అనే ఆయన యీ పగటికలలు-బాధించబడటం ద్వారా స్వరతి తృప్తిని పొందటానికి తనకు ఉపకరిస్తూన్నవని చెపుతున్నాడు. ఒకానొక వివాహిత కుటుంబ వైద్యుని ప్రేమించి, ఆ ప్రేమను వ్యక్తపరిచేందుకు ధైర్యం చాలక పగటికలలద్వారా తృప్తినొందుతూ, కలల్ని రికార్డు చేయ నారంభించి, భర్తచేత కనుక్కోబడి, విడాకుల్ని పొందిన ఒక కేసు రికార్డు చేయబడింది; యీమె ప్రణయాన్నిగూర్చి పాపం ఆ వైద్యునికి ఏమీ తెలియనే తెలియదు. దీన్నిబట్టి యీ కలలు కేవలం కాల్పనిక వ్యక్తుల్ని గూర్చినవే కానక్కర్లేదు; నిత్యజీవితంలో నచ్చిన వ్యక్తులూ, వేరొక విధంగా వారినిజేరే అవకాశంలేని వారిని గూర్చినవైనా కావొచ్చని చెప్పవొచ్చు.

ఎక్కడో ఫొటోలోనో, లేదా ఏ తెరమీదనో చూసిన వ్యక్తుల్ని గాఢతమంగా ప్రేమించి, వారినిగూర్చిన పగటికలల్ని కనటం సర్వసామాన్య విషయంగానే తోస్తుంది. మరీ కొస్త యీడొచ్చిన విద్యార్థుల్లో ఇది ఎక్కువ; వారి గదుల్లో వేళ్లాడే సినిమాతారల ఫొటోలూ, సినిమా పత్రికల్లోని తారల జీవితాలూ, వారి వివిధ భంగిమలూ మొదలైనవి, వారి పకటికలలకు విశేషంగా ఉపకరించే వస్తుసామగ్రి.

## పగటికలలు : ఊహ

పగటికలల్ని ఎన్నుకునేందుకు మరో కారణంకూడా చెప్పవొచ్చు. హస్త ప్రయోగం పాపమనీ, భీకరమైందనే ఉద్దేశంతో దానికి స్వస్తిచెప్పి, పవిత్ర జీవితాల్ని గడిపేవారికి యీ పకటికలలే శరణ్యం. ఇందువల్ల శారీరకమైన అపవిత్రత జరగదు; మానసికమైన వ్యభిచారం సంగతి ఆలోచించే అవకాశమే ఉండదు కనుక బాధలేదు. పోతే యీ పవిత్రతను మనసులో పెట్టుకుని, కనే యీ కలలు అసాధారణత కిందికిరావు. ఐతే ఇదే కొస్త మితిమీరినట్లయితే అది అనారోగ్య లక్షణమనే చెప్పవలసివుంటుంది.

యీ పగటికలలు మరీ చిత్రకారులకూ, కథకులకూ, బాగా ఆలోచించగల శక్తి సామర్థ్యాలున్న వారికి ఎక్కువ. ఒక చిత్రకారుడు 'వూహాసుందరిని ఎంత బాగా ఆలోచించగలుగుతే, బొమ్మ అంతబాగా దిగుతుంది. ఇదే విధంగా కళాకారులందరూ తమ వూహను పెంపొందించుకోవటం జరుగుతుంది; అందుకనే వీరికి యీ పగటికలల తాకిడి ఎక్కువ.

## పగటికలలు : కథలు

కొత్తగా కథలు రాసేవాళ్లను చూస్తే యీ సత్యం బైటపడుతుంది. వారి వూహలూ, కలలూ ఏ ధోరణిలో ఉంటవో అర్థమౌతుంది. ఉదాహరణకు: 'లీలా-మోహన్ కథలు': యీ కథల్లో లీల ఎప్పుడూ నాయకి; మోహన్ నాయకుడూను. ఆ పేర్లల్లోవున్న ఆకర్షణకొంతా; ఒకరు అలా రాశారు కనుక, తానూ అలాగే రాయాలనే వాంఛకొంతాను. యీ కథల్లో మోహన్ లీలను మొదటి చూపులోనే ప్రేమిస్తాడు; లీలకూడా మంచిపిల్ల కనుక, ఇటు కథకుణ్నీ, అటు పాఠకుణ్నీ, విశేషించి నాయకుణ్నీ ఎక్కువ అవస్థపెట్టకుండానే ఇట్టే ప్రేమిస్తుంది. ఇక ఆ కలయికలూ, ప్రణయ సన్నివేశాలూ ఎంతైనా అసహజంగా ఉంటవి. ఆమె రిక్షాలో పోతూంటే, నాయకుడు సైకిల్ మీద వెంటాడటం, కళ్లతో మాట్లాడుకోవటం, హృదయాలతో పరస్పరం ఆకర్షించబడటం—ప్రణయాన్ని గూర్చీ, పవిత్రతనుగూర్చీ స్మరిస్తూ ఒకర్నొకరు అనుభవించటం!

ఇది కేవలం కథకుని బుర్రలోనే బయలుదేరింది. ఇలా తనకు జరిగిందని కాదు; నిజంగా జరుగుతే ఉన్నకాలమంతా ఆ అనుభవానికే సరిపొయ్యేది. యీ కథ రాసుకోవాల్సిన అవస్థపట్టదు. ఇలా జరుగుతే బాగుండుననే భావనతో, తానే నాయకుడనుకొని, తన స్వప్నసుందరే నాయకి అనుకొని యీ కథ దిగుతుంది. దీన్ని అచ్చులోకి లాక్కొచ్చేవాళ్ళ అవసరమల్లా ఏదోవిధంగా పత్రిక నిండటం. ఇక చదివేవారిలో, కుర్రకారు అది తమ అనుభవమే నన్నట్లుగా భావించుకొని తృప్తిపడటం, అలాగే పడుకొని పగటికలల్ని కనటం జరుగుతుంది. దీన్నే 'wishful thinking'. అంటారు.

యీ రకం కథలకు మరో కారణం ఇది: జీవితం దుర్భరం కనుక, ఆ దుర్భర సంఘటనల్నే జీవితంలో అనుభవిస్తూ, మళ్లీ సాహిత్యంలోకూడా అనుభవించటం కష్టం. కనుక మనసుకు హాయినిచ్చే సంఘటనల్తో వుండే కథలే ప్రజాదరణ పొందుతవి. యీ కారణం నిలిచేదికాదు. సాహిత్యంకానీ, వేరే కళకానీ నిత్య జీవితపు హద్దులు దాటిపోసాగాక, అది మానవహృదయాలకు తృప్తినివ్వలేదు...యీ రకం సంఘటనలు మన సినిమా ప్రపంచంలో అనేకం కనిపిస్తవి.

యీ కలలు ఎంత పవిత్రోద్దేశంతో మొదలైనప్పటికీ, ఏవిధంగా మూసినా

వాటికి సెక్సుతో సంబంధం లేనట్లే కనిపించినప్పటికీ—వీటికి వెనుక సెక్సు ఏదో వొక రూపంలో వుండనే వుంటుంది. దీన్ని రుజూచేయటం చాలా తేలిక; పగటికలలు కనేవారు, దాంపత్యంలో ప్రవేశించగానే ఆ కలలు మరిరావు. ఎందుకంటే ఏదైతే నిత్యజీవితంలో లభ్యమౌతోందో, దాన్నిగూర్చి వూహించుకొని తృప్తిపడే అవసరం ఉండదు కదా!

## స్వప్న స్ఖలనాలు.

మరోరకం కలలు: ఇవి రాత్రిపూటనే వొచ్చి, కలలో దాదాపు రతి జరగటంద్వారా స్ఖలనానికి దారితీస్తవి. 'జాగ్రత్తగా పరిశీలించినట్లయితే, నిత్య జీవితంలోని స్వరతిభావాలు, ఒక విశిష్టరూపాన్ని దాల్చక, అవి ఏ నిద్రలోనో, వ్యక్తావస్థ ఏమరపాటున ఉండగా. అవ్యక్తావస్థలో సిద్ధించబడుతున్నవని తెలుస్తుంది. ఐతే ఇది ఒక వ్యాధి అని కానీ, అస్వాభావికమైనదని కానీ చెప్పే సాహసం ఎవరికీ వుండదు.

శారీరకంగా చూసినట్లయితే, బీజాలు తయారుచేసే వీర్యం, వీర్యస్థానాల్లో నిలవ వుంటుంది. అది ఎక్కువైనప్పుడు, శారీరక యంత్రాంగం, దాన్ని బైటికి పంపేసేందుకు ప్రయత్నిస్తుంది. ఇది సహజధోరణిలో జరుగుతే సరే సరి! అది లభ్యమవనప్పుడు, ఏ నిద్రలోనో బైటపడుతూంటుంది.

ఇక్కడ ఇంకో ముఖ్య విషయాన్ని చెప్పాలి! వీర్యంకూడా. నీరులాంటిదేననీ, బ్లాడర్‌నుంచి నీరు విడుదలకాకుంటే కలిగే బాధలాటిదీ, దాన్ని విడుదల చేసి తీరవలసిన అవసరంలాటిది వున్నదనే సామాన్య అభిప్రాయం తప్పు. యీ రకమైన సామాన్యాభిప్రాయంతోనే చాలామంది హస్త ప్రయోగంద్వారా, వీర్యాన్ని బహిర్గతంచేసి, తమ ఆరోగ్యాన్ని కాపాడుకోగలుగుతున్నామనే దురూహాలో వున్నారు. వీర్యం విషయంలో, నీరుకు సంబంధించిన విధులు సరిపడవు. ఒకవేళ నిజంగానే వీర్యం అధికమై శారీరక యంత్రాంగానికి బరువుగా, భారంగా తోచినట్లయితే, దానికి వ్యక్తిగత ప్రయత్నం లేకుండానే ఏ స్వప్నస్ఖలనం ద్వారానో బైటపడుతుంది. అంటే ఒక రకంగా యీ స్వప్నస్ఖలనాలు సురక్షిత మార్గాలు (Safety Valves) అని చెప్పుకోవచ్చు.

స్వప్నస్ఖలనాలు మరో శాస్త్రీయ పరిశోధనకు ఉపకరించినవి. దాంపత్య జీవితంలో ఆరోగ్యకరమైన రతుల సంఖ్యను ఇవి నిర్ణయించినవి. మానవుడు తనకు తానుగా ఉద్దిష్టుడై, అనవసరకామాన్ని పెంచుకోవటం ద్వారా నిర్వర్తించే దాంపత్యంనుంచి, మనం సహజరతుల సంఖ్యను నిర్ణయించలేము. పోతే హస్త ప్రయోగికాకుండా, సాధారణ బ్రహ్మచర్య జీవితాన్ని గడిపేవారి జీవితంనుంచి, యీ రతుల సంఖ్య నిర్ణయించబడింది. వారి జీవితంలో కలిగే స్వప్నస్ఖలనాల తాలూకు రికార్డులే యీ నిర్ణయాలను ఆధారం.

(ఇంకావుంది)



# బ్రహ్మచర్యం

క్రమకాలంగా బ్రహ్మచర్యాన్నిగూర్చిన అనేక అభిప్రాయాలు చరిత్రలో దొర్లుతుంటూ వస్తూనే ఉన్నవి. కొంతమంది బ్రహ్మచర్యం అత్యుత్తమమైనదని ప్రచారం చేయుటం, అలాటి వ్యక్తులు ఒక సమాజంగానే రూపొంది, గృహస్థాశ్రమాన్ని గర్హిస్తూ జీవించటం నేటికీ చూస్తూనేవున్నాం.

సెప్టెంబర్ సంచికలో కఠిన బ్రహ్మచర్యాన్ని గూర్చిన ప్రశ్నకు ఇచ్చిన జవాబు చదివిన ఒకానొక పాఠకుడు పంపిన ప్రశ్నను యీ కింద వేస్తున్నాము. దీనికి మా జవాబుకూడా ఇస్తున్నాము. ఇదసలు 'సందేహాలకు సమాధానాలు' శీర్షికలో వేయవలసింది. కాని దీన్ని ఒక ప్రత్యేక వ్యాసంగానే ప్రకటించి చాలా విశదంగా చర్చించేందుకు యీ పద్ధతి అనుసరించాము.

బ్రహ్మచర్యాన్ని గూర్చిన అనేక సందేహాలు యీ వ్యాసంతో మా పఠితలకు తీరగలవని ఆశిస్తున్నాము.

—సం॥ అభిసారిక]

## ప్రశ్న

బ్రహ్మచర్యాన్ని గురించి హెన్రీ తియరో, లియోటాల్ స్టాయ్, మహాత్మ గాంధీ, మొదలగు మహాపురుషులు, స్వామి రామతీర్థ, వివేకానంద, దయానంద సరస్వతి మొదలైన మత ప్రవక్తలు, కోడి రామమూర్తి మొదలైన బలాఢ్యులు, డాక్టర్ ఫ్రాంక్లిన్, డాక్టర్ జాన్ కౌలిన్ మొదలైన వైద్య ప్రముఖులు, తాము ఆర్జించిన విజ్ఞానము ద్వారా బ్రహ్మచర్యము వలన శారీరకంగా, మానసికంగా, ఆధ్యాత్మికంగా ఉన్నతిని పొందవొచ్చునీ, లైంగిక అనుభవాలకన్న బ్రహ్మచర్యము ఎన్నో రెట్లు మేలైనదని, దానిని సాధించటం కష్టతరమైనదేమీ కాదనీ ప్రచారము చేసినారు. కాని మీరు సెప్టెంబర్ సంచిక అభిసారికలో పైదానికి విరుద్ధ భావాలను బ్రహ్మచర్యమువల్ల ఎన్నో విధాల నష్టము కలదని దానికన్న లైంగిక వాంఛలను తీర్చుకోవటమే ఎన్నో రెట్లు మేలనీ, బహ్మచర్యాన్ని సాధిం

వటం కష్టకరమనీ ప్రచారము చేశారు. యీ రెండింటిలో ఏది సత్యం? ఏది అసత్యం?

జవాబు:

ప్రశ్న చాలా బాగుంది. విరుద్ధ భావాలు ఉండటం నేరం కాదుకదా! మహాపురుషులుగా పేర్కొని, బ్రహ్మచర్యాన్ని ప్రచారం చేసినవారుగా చెప్పబడే వ్యక్తుల జీవితానుభవాల్ని గణనకు తీసుకోవటంకూడా అవసరమే!

> 1952 డిసెంబర్‌లో బ్రిటన్‌లో 4 రోజులపాటు పట్టిన విపరీతమైన మంచు తెర తాలూకు మరణాల్ని ఆరోగ్య శాఖవారు పరిశీలించారు. ఇందువల్ల 3,500 - 4,000 దాకా చనిపోయ్యారు; లెక్కకు రానివారు ఇంకా ఉండొచ్చు.
>
> అంతకు పూర్వమే గుండెజబ్బు, ఊపిరితిత్తుల జబ్బులతో బాధపడే వారికి యీ పొగమంచు ప్రాణాంతకమైంది. మరణించిన ప్రతి 10 మందిలోనూ 9 మంది వయస్సు 45 సం. లకు పైగా వుంది; నూటికి 60 మంది వయస్సు 65 సం. లకు పైబడివుంది. సంవత్సరం లోపు వయసున్న బిడ్డల మరణాలు రెట్టింపు.
>
> మంచి ఆరోగ్యంలో వున్నవారిని యీ పొగమంచు న్యూసెన్స్‌గా ఉండటం మినహా ఏమీ చేయలేకపోయింది. పొగమంచుకన్నా, బొగ్గును కాల్చటంవల్ల విడుదలైన సల్ఫర్ ఆక్సయిడ్స్ ఎక్కువ హానిని చేసినవి.

పై వారిలో మాకు తెలిసినంతవరకూ, మహాత్మాగాంధీ, లియోటాల్‌స్టాయ్ వైవాహిక జీవితాల్ని గడిపిన వారే! వారు ఒకపక్క గృహస్థ జీవితాల్ని అనుభవిస్తూ మరోపక్క బ్రహ్మచర్యాన్ని ప్రచారం చేశారు! వివేకానందుని సంగతి అటుంచి, ఆయన గురువు రామకృష్ణ పరమహంసకూడా దాంపత్య జీవితాన్ని గడిపినవారే! వీరంతా బ్రహ్మచర్యం అవశ్యం అవలంబించదగిందన్నారంటే—బెర్నార్డ్ షా అన్నట్టు 'బట్టతలవాడు, వెంట్రుకలు బాగా పెరిగేమందును ప్రచారంచేసి అమ్మజూపటం లాటిది.'

ఐతే వారు ఏ సందర్భంలో బ్రహ్మచర్యావలంబనను బోధించి వున్నారో చూడటంకూడా అవసరమే. ఆ యా సందర్భాలు వారివారి భక్తులకూ, పఠితలకూ బాగా తెలిసేవుండాలి. వాటిని అర్థంచేసుకోవటంలోనూ, అనుసరించటంలోనూ ఒక ఇబ్బంది వొచ్చిపడివుంటుంది. వాటి అర్థం 'బ్రహ్మచర్యమే అవలంబనీయం' అని పైపఠిత స్పష్టపరుస్తున్నాడు. కనుక బ్రహ్మచర్యం ఎంతవరకూ మెచ్చుకోదగిందో యీ కింద చర్చిస్తున్నాము:

బెర్నార్డ్‌షా అన్నట్లు 'చేయగలవారు చేస్తారు; చేయలేనివారు బోధిస్తారు!' అనే సత్యం పై వ్యక్తులపట్ల రుజువైంది. తాము అనుభవించారు కనుకనే, ఒక పక్క దాంపత్యాన్నీ, మరోపక్క బ్రహ్మచర్యాన్నీ తూచి ఏది మంచిదో చెప్పగల సామర్థ్యం ఆయా వ్యక్తులకు కలిగిందనే ప్రచారం,

ఆయన శిష్యులూ, వారిపట్ల అత్యధిక గౌరవంవుండి, విస్సన్న చెప్పిందే వేదమనే గుడ్డినమ్మకంవున్న వారూ అంతే అనగలుగుగాక! అది నిజమని అనుకునే ప్రతివారూకూడా స్వానుభవంతో దాంపత్యాన్ని అనుభవించి, ఏది ఎన్నుకోదగ్గదో తేల్చుకోవటం—కేవలం వారి అడుగుజాడల్లో నడవటమే అవగలదు. అప్పుడు ఆ మహాపురుషులు మనకు యీ విధంగానన్నా ఆదర్శప్రాయులు అవుతూనేవున్నారు కదా!

బ్రహ్మచర్యాన్ని అవలంబించటం అంత కష్టమైనది కాదనేది మరో అసత్యం. అంత కష్టమైనది కాకుంటే చాలామంది అనుసరించలేక పోతున్నారు ఎందుకనీ? దానికి తగినంత ప్రచారంలేకనా? ఆ ప్రచారం చేసుకునేందుకు యీ దేశంలోని ప్రభుత్వం ఏమీ ఆటంక పరచదు కదా!

ఐనప్పుడు వారి ప్రచారానికి లొంగిన వారు బహుకొద్ది. దీన్నిబట్టి బ్రహ్మచర్యాన్ని అవలంబించటం తేలికైనదనే వాదానికి ఎలాటి ఆధారమూలేదు. వీరనుకునే బ్రహ్మచర్యావలంబనే ప్రపంచంలో వీరిముందు తరంవారు అనుసరించివుంటే, దాన్నిగూర్చి ప్రచారం చేసేందుకు యీ మహాపురుషులు అసలు జన్మించి వుండేవారేకాదు; ఆ అవసరమూ వుండేదికాదు!

బ్రహ్మచర్యాన్నిగూర్చి ప్రచారం చేసిన మహాపురుషుల జాబితా ఒక పక్కవేసి, దాంపత్య జీవితాన్ని ఒప్పుకున్న మహాపురుషుల జాబితా మరో పక్క వేస్తే ఏది మించుతుందో మీరు తేలిగ్గా వూహించవొచ్చు. మహాపురుషత్వమనేది బ్రహ్మచర్యాన్ని ప్రచారం చేయటంవల్ల వొచ్చిపడలేదు. వారు ఇతర రంగాలలో మహాపురుషులై బ్రహ్మచర్యాన్నిగూర్చి కూడా రెండు ముక్కలు మాట్లాడారు. అప్పుడు యీ బ్రహ్మచర్యానికి వారి తాలూకు మహాపురుషత్వపు 'శ్రీలు' వేయబడింది—అంతే!

ఏమతప్రవక్తా బ్రహ్మచర్యాన్ని ఆదేశించిఉండలేదు. తమమతాన్ని స్వీకరించిన జనం తక్కువకాకుండా వుండేందుకు బహుభార్యత్వాన్ని బోధించిన వారూ ఉన్నారు. వార్నికూడా కొన్ని

---

కలకాలంగా మానవుడు సంపాయించిన విజ్ఞానమంతా మెదడులోని సెల్సులో ఇమిడివుంది. లక్షల సంవత్సరాలనుంచీ వంశపారంపర్యా వొస్తూన్న అనేక భావాల కూడిక మెదడులో అణిగి మణిగివుంది. ఐతే మనం రోజూ ఈ శక్తిలో ఏ కొద్ది భాగాన్నో ఉపయోగిస్తున్నాము; అదీ మరో మార్గం లేనప్పుడుకాని జరగటం లేదు. ఇది కారణంగానే మనం పంచేంద్రియాల జ్ఞానాన్ని వృద్ధిచేసుకోని, వాటి సహాయంతోనే జీవితాల్ని గడుపుతున్నాం.

సెక్స్ సమస్యలు వేధించినవి; వాటికి కొన్ని నీతి నియమాలను ఏర్పరిచారే కాని, అసలు సెక్స్ అక్కర్లేదని అనలేదు. సోక్రటీస్, ఉమ్మర్ ఖయ్యాం భర్తృహరి మొదలైన వేదాంతులు బ్రహ్మచర్యాన్ని పొగిడి, దాన్ని అనుసరించ మనలేదు. ఐతే వీరిమాటల్ని అడ్డం వేసుకోవాల్సిన అవసరమూ కులేదు. వేరొక విధంగాకూడా యీ రుజువులు చేయగలం.

గాంధీజీ బ్రహ్మచర్యాన్ని అవలంబించమనే ఉండొచ్చు. మరి ఆయన శిష్యుల్లో ఎంతమంది వారి అడుగుజాడల్లో నడుస్తున్నారు? ఆయనమీద భక్తిలేకనా? ఆయన చెప్పిందానికి విరుద్ధంగా నడవాలనా? మరి కారణం ఏమిటి?

ప్రకృతి విధించిన కర్మకాండలు

> "మానవుని మనోశక్తికీ, ఆలోచించగల సామర్థ్యానికీ అంతంటూ లేదు; యీ శక్తుల వల్ల అతను మానసికంగానూ, నైతికంగానూ, శారీరకంగానూ, ఆధ్యాత్మికంగానూ పతనం చెందవొచ్చు; అదేశక్తివల్ల యీ పతనావస్థనుంచి తప్పించుకొని, కలలోకూడా చూడని అత్యున్నత స్థాయికి వెళ్ళగలడు కూడాను!"
>
> —కోరెల్.

న్నవి. వాటిని గాంధీకాదు కదా— ప్రపంచంలోని మహాపురుషులందరూ కలిసి ఎదురొడ్డినా ప్రాపంచిక విధానాన్ని మార్చలేదు. యీ విషయాన్ని రుజూచేసేందుకు వీరి జీవితాలే కాకుండా కొన్ని అత్యుత్తమ కథలుకూడా పేర్కొనగలం;

విశ్వామిత్రుని వంటి నిష్ఠాపరుణ్ణి మేనక ఏం చేసిందీ? అమాయకుడైన ఋష్యశృంగుని కథ చూడండి! ఆడకూ మొగకూ భేదమన్నా తెలియని ఋష్యశృంగడు 'నాకు ఒక కొమ్మేవుంటే నీకు రెండు కొమ్ములున్నవి. కనుక నీవు నాకన్న గొప్ప వ్యక్తివి' అని స్త్రీకి లొంగుతాడు!

ఇక శంకరాచార్యునినంటి బ్రహ్మచారికూడా విజ్ఞానాన్ని పొందేందుకుగాను, ఒకానొక రాజు చనిపోతే, ఆయన శవంలోకి పరకాయ ప్రవేశం చేసి, ఆయన రాణితో ఆనందించసాగాడు; యీ స్త్రీ లోలత్వంలో ఉండగా, రాణి ఆలోచించి దేశంలోని శవాల్ని దహనం చెయ్యమని ఆజ్ఞాపిస్తుంది; శంకరాచార్యుని శవం దహనమౌతూండగా, అప్పుడాయన మేల్కొని ప్రాణాన్ని బొందిలోకి ప్రవేశపెట్టి, అప్పటికే కాలిపోయిన కాళ్ళూ చేతుల్ని ప్రసాదించమని భగవానుని కోరుతాడు. ఇదీ ఈయన బ్రహ్మచర్యం! కామశాస్త్రంలో వాదోపవాదాలకోసం ఇది జరిగిందని కథ. మరోవిధంగా చూస్తే చేసిన వ్యభిచారానికి కాళ్ళూ చేతులూ కాల్చుకోవటం శిక్షనుకోవచ్చు. లేదా ఆయన బొంది

పవిత్రంగానే వుండనుకోవొచ్చు. ఎలా అనుకున్నప్పటికీ మాకు పేచీలేదు. కాని బ్రహ్మచర్యావలంబన ఎంతవరకూ జరిగిందో, దాన్ని మారు పేర్లలోకి రంగు మార్చటం ఎలా వుందో బట్టబయలుగానే వుందికదా!

ఇవి కట్టు కథలుకావు. అలాంటి వ్యక్తులు మన చుట్టూ నేటికీ వున్నారు. స్వభావసిద్ధమైన వాంఛల్ని వారు ఎదిరి పోరాడి నిలవలేక పొయ్యారు.

పోతే దాంపత్యాన్నిగూర్చి యీనాడు ప్రచారం చేయవలసిన ఖర్మ మాకులేదు. మేము పుట్టుక పూర్వమే ప్రపంచంలో దాంపత్యం ఉధృతంగా వుండనేవుంది. అందుకనే, మేమూ మా పాఠకులూ ఈనాడు ఉండగలిగాం. దాన్ని ఆపేందుకు ప్రయత్నించే ఖర్మ కొంతమందికి పడితే అది మా తప్పు కాదు.

అది యీనాడు మా ప్రచారంవల్ల పెరిగేదీ, ఇతరుల ప్రచారంవల్ల తరిగేదీ అనుకునే మాఢ్యంలో మేములేము.

బ్రహ్మచర్యావలంబన తేలికైనదనుకుంటే అంత తేలికపని చేయగలిగే వారు అతి సామాన్యులు. వారు మహాపురుషు లయ్యారనే వాదనకు వొస్తే బ్రహ్మచర్యం కష్టతమమైంది కనుకనే, వారి విధానానికి అంత విలువ ఏర్పడింది.

జైలు సుఖంగావుంటే దానికి తలుపులెందుకు? తాళాలెందుకు? బ్రహ్మచర్యంలో సౌఖ్యమే వుంటే దాన్ని ఒకరు ఒకరికి చెప్పక్కర్లేదు. ఎవరికి వారే ఏరికోరి తెచ్చి మెడలో వేళ్లాడేసుకునేవారే కదా!

ఇక సెప్టెంబర్ సంచికలో బ్రహ్మచర్యాన్ని అవలంబించటంవల్ల కలిగే ఫలితాల్ని వివరించాడు. శారీరకంగానూ, మానసికంగానూ కలిగే మార్పుల్ని పేర్కొన్నాము. అవిశాస్త్రీయదృక్పథానికి మించినవికావు. అలా అని రుజూచేయగల వారెవరన్నా వుంటే, వాదానికి మేము సిద్ధంగానే ఉన్నాము.

బలాఢ్యత సంగతికూడా ఒక్క మాట ; మేము ఒకసారి బరువును ఎత్తటానికి తయారు తింటూన్న వస్తాదును చూడటం తటస్థించింది. శ్రీవారు పడుకొని వుంటే బలాఢ్యులు కొంతమంది మాలిష్ చేస్తున్నారు. వారి కండరాలు ఎంతో బిరుసెక్కినవి. శ్రీవారి తిండిని భరించటం మహారాజులకే చెల్లుతుంది. సామాన్యంగా తిని బతకగలిగే మాన

> “భర్తగా వుండటంకన్న ప్రియుడుగా ఉండటమే తేలిక. ఎందుకంటే ప్రియుడుగా వున్నవాడు చాలా తెలివిగానూ, మధురంగానూ మాట్లాడటం అప్పుడప్పుడు జరపాలి; కాని భర్తగా ప్రతిరోజూ తెలివితేటల మీదనే ఆధారపడి ప్రవర్తించటం చాలా కష్టమే!”
>
> —బాల్జాక్.

పుడు విపరీతంగా తినటంవల్ల (రేషనింగ్ రోజుల్లోకూడా) ప్రభుత్వానికీ, సమాజానికీ హానిచేస్తున్నాడనే మా ఉద్దేశ్యం. అందులోనూ అతి విలువైన ఆహారం తప్ప తాకడాయె! అలాటి వ్యక్తి నేరాన్ని చేయటం లేదనా? పోతే వారు లేచినిలిచినప్పుడు చూస్తే మానవాకారంలోని వికృత స్వరూపం కళ్ళఎదుట కనిపించి మూర్ఛపర్యంతమైంది. శారీరం పైభాగంతో పోలుస్తే కాళ్లు పుల్లలల్లేనే ఉన్నవనవొచ్చు. పొట్ట చాకలిబానంత వుంది. శరీరంలోని కొవ్వు పదార్థమంతా చేతి కండరాల్లో మాత్రమే కనిపిస్తుంది. ఎందుకీ యీ అవసంతా? బరువు ఎత్తేందుకు! సాధారణ కూలీలు మూడు వరసల్లో మోయగలిగే బరువును యీ వస్తాదు ఒక్కసారే మోస్తాడు; ఆహార ఆ ముగ్గురి తిండీ (అంతకుపైగాకూడాను) వారిస్తూనే వున్నాడు. ఇక లాభంఏమిటి? ఏ ప్రాజెక్టు కట్టేందుకన్నా ఉపయోగపడిందా వీరి బలాతిశయం? వీరు కఠిన బ్రహ్మచర్యాన్నే అవలంబిస్తున్నారట! శరీరంలోని అంగాలలో ఒక్క చేతులకే పని! అందుకని ఆ శరీరభాగమే గట్టిది. మిగతాభాగాలు సాధారణవ్యక్తి శరీరభాగాలకు తీసికట్టుగానే ఉంటవి. బాగా గడ్డాలూ మీసాలూ పెంచి ఏ జ్యూలోనన్నా వుంచి, పూర్వకాలపు మనిషిఅంటే నమ్మేందుకు వీలుగా శరీరాకృతి తయారైంది. కాకపోతే వీరిని మెచ్చుకునేవారి పొగడ్తలతో వాళ్లు పులకరిస్తే, అదే కలిగేతృప్తి! యూనిట్ అణాకానీకి తయారయ్యే విద్యుచ్ఛక్తి ఏకష్టమూ లేకుండానే ఇంతికన్న పెద్ద బరువుల్ని మోస్తుందికదా! ఐనప్పుడు అర్థంలేని యీ శరీరపు పెంపకం ఎవరికి? ఎందుకు? ఏం ఉపయోగం?

'అభిసారిక' బ్రహ్మచర్యాన్ని అవలింబించే వారికోసం కాదు. బ్రహ్మచర్యంనుంచి గృహస్థాశ్రమానికి వెళ్లే వారికీ, దాంపత్యంలో వున్నవారికీను. బ్రహ్మచర్యాన్ని వేళ్ళాడేవారు యీ పత్రిక జోలికే రానక్కర్లేదు. పైపాఠకుడు బ్రహ్మచర్యంమీద మంచి నమ్మకమున్న వ్యక్తనీ, మా జవాబు రుచించక మహాపురుషుల్నికూడా రంగంలోకి లాక్కొచ్చి తన అనుమానాల్ని బైటపెట్టాడనీ నమ్ముతున్నాం. ఐతే బ్రహ్మచర్యంమీద నమ్మకంవుండి, యీ పత్రిక చదివేవారికి సెక్సువిషయాలపట్ల మోజు వుండనేది, ఎంతో ఇంటరెస్ట్ చూపు

వెండి చంచాతోకానీ, వెండి పూతవున్న చంచాతోకానీ, కోడిగుడ్డును తిన్నట్లయితే, ఆ చంచానల్లబడుతుంది ఎందుకో తెలుసా? కోడిగుడ్డులో సల్ఫేట్ భాగం చాలా అధికం. అది వెండితో కలిసి సిల్వర్ సల్ఫైడ్ అనే రసాయనిక పదార్థంగా రూపొందుతుంది. యీ రసాయనిక పదార్థం నలుపు రంగుది!

నికిల్ చంచాతో తిన్నట్లయితే, యీ నలుపు కనిపించదు. గుడ్డు కుళ్లసాగాక, అందులోని సల్ఫర్, గాలిలోని హైడ్రోజన్‌తో కలిసి సల్ఫరేటెడ్ అనే రసాయనిక వాయు పదార్థంగా తయారై, భరించలేని కంపును విడుదల చేస్తుంది.

కున్నారనేది స్పష్టం. తెలుసుకోవటంలోనే ఇంతగొప్ప ఆకర్షణవుంటే, అనుభవించటంలో ఎంత వుండాలో యీనాడు మేము కొత్తగా చెప్పనక్కర్లేదు.

మానవజీవితాన్ని వివిధ రంగాలుగా విభజించినట్లయితే గృహస్థాశ్రమం తరువాతనే సన్యాసాశ్రమం వొస్తోంది. అంటే యవ్వనంలో కామతృప్తి పొందాక, కలిగిన సంతానం, తన సంతానాన్ని వృద్ధిచేస్తూనే వుంది కనుక, ఆ పని వారికి అప్పగించి సన్యాసం స్వీకరించమని ఆదేశించబడింది. అప్పటికి శరీరంలోని శక్తులన్నీ ఉడిగే ఉంటవి కనుక, ఇది తేలికకూడాను. అప్పుడు వారు బ్రహ్మచర్యాన్నిగూర్చి పొగడటానికీ, అవలంబించటానికీ అర్హతల్ని కలిగివుంటారు.

వేమనయోగి కథలోకూడా, రసికుడై అన్ని అనుభవాలూ అయ్యాకనే యోగిగా తయారయ్యాడు. 'రాగి కాకుండా విరాగి కాలేడు' అన్నాడు. ఆయన బ్రహ్మచర్యంవల్ల గొప్పవాడు కాలేదు. కొన్ని లోకోత్తరసత్యాల్ని అందఃకీ అర్థమయేట్లుగా పద్యరూపాన చెప్పటంవల్ల గొప్పవాడయ్యాడు. ఆయన దాంపత్య జీవితంలోనే వుండి ఆ పద్యాలు చెప్పివున్నట్లయితే ఆయన గొప్పతనం తగ్గుతుందనే సాహసం ఎవరికైనా వుందా?

కఠిన బ్రహ్మచర్యాన్ని అవలంబించే వ్యక్తుల అవసరం సమాజంలో కొంతమందికి వుంది. ఉదాహరణకు జనానా కాపలా కాసేందుకు, కంచే చేను మేయకుండా కట్టుబాటు జరిగేందుకు యీ బ్రహ్మచారుల అవసరం ఏర్పడింది. వీరికి ఇతరత్రా ఎన్ని భోగాల్ని ఇవ్వగలిగినా, కామతృప్తి విషయంలో వీరిని నమ్మటం ఎలా? అందుకని సెక్సు అంగాల్ని తొలగించేసి వీరిని కొజ్జాలుగా తయారుచేశారు. అప్పుడు వారికి కామవాంఛ కలిగినా అది తీరే మార్గం లేదు. ఇంత ఘోరంగా బ్రహ్మచర్యావలంబన జరుగుతూందనే సంగతి నేటి ప్రపంచానికికూడా కొత్తకాదు. ఐతే

---

స్టార్ ఫిష్ సెక్సు జీవితం చాలా విచిత్రంగా వుంటుంది. యీ చేప జాతిలో ఆడా, మొగా ఉన్నవి. కాని సంతనార్థం అవి రతి జరపవు. మొగ చేప తనకు శారీరావసరంగా తోచినప్పుడు వీర్యాన్ని విడుదల చేస్తుంది; అదేవిధంగా ఆడచేప గుడ్లను విడుదలచేస్తుంది. కేవలం మూత్ర విసర్జన వలెనే ఇది జరుగుతుంది. ఏ నీటి ప్రవాహానికో, గాలికో ఆ రెండూ కలుస్తేనేకాని సంతానాభివృద్ధి అవదు. యీ చేప జాతిలోని సంతానానికి ఉత్తర ధ్రువంలో తండ్రీ, దక్షిణ ధ్రువంలో తల్లీ ఉన్నారన్నా ఆశ్చర్యంలేదు. సంతానం తమ తల్లిదండ్రుల్నికానీ, తల్లిదండ్రులు తమ సంతానాన్నికానీ ఎన్నడూ కలుసుకోరు. కలుసుకున్నా గుర్తించలేరు. అసలు తల్లీ తండ్రీ ఎన్నడన్నా కలుసుకున్న పాపాన పోతేకదా?

---

ఏ కాలం వివాహాలకు ఎక్కువ అనుకూలంగా వుంటుంది? యీ విషయమై బ్రిటన్‌లో జరిగిన పెళ్ళిళ్ళ అంచనాలు తీయబడినవి.

1952 లో జరిగిన 349,309 వివాహాల్లోనూ మార్చి నెలలో 69,832 పెళ్ళిళ్ళు జరిగినవి. అన్నిటికన్నా తక్కువ వివాహాలు జనవరిలో జరిగినవి. ఆ నెలలో జరిగిన పెళ్ళిళ్ళ సంఖ్య 13,968.

1884 వ సం. అంచనాల ప్రకారం ప్రతి 1,000 పెళ్ళిళ్ళల్లోనూ 26 మాత్రమే రిజిష్ట్రార్ ఆఫీసులో జరిగినవి. 1934 కల్లా యీ సంఖ్య వెయ్యికి 306 వరకూ పెరిగింది. 1952 లో విడాకులు కోరబడిన కేసుల సంఖ్య 34,567. ఇది 1951 సంఖ్యకు 4,000 తక్కువగానేవుంది.

విడాకుల్ని పరిశీలిస్తే, పిల్లలు ఎక్కువగావున్న దంపతుల మధ్య విడాకులు చాలా తక్కువ. 1952 విడాకుల్లో 10,995 మంది దంపతులకు బిడ్డలు లేరు; ఒక్క బిడ్డవున్న దంపతులు 11,161. కొంచెం పెరుగదల వున్నప్పటికీ ఇద్దరు బిడ్డలున్న దంపతులు 6,457. చాలావరకు తగ్గిపోయింది. పోతే ఏడుగురు, అంతకన్న ఎక్కువ సంతానమున్న దంపతుల్లో విడాకుల్ని కోరినవారు 296 మాత్రం.

ఎక్కువమంది పురుషులు 23 సం. ల వయస్సులోనూ, స్త్రీలు 21 సం. ల వయస్సులోనూ వివాహాలు చేసుకున్నారు.

యీ కఠిన బ్రహ్మచారులకు సామాజికంగా ఏ గౌరవమూ లేదు; ఎందుకని?

సెక్సు అంగాలు మూత్ర విసర్జన కూడా ఉపయోగపడుతూండటం వల్ల వాటిపట్ల హేయభావాన్ని కలిగి వుండటం జరిగింది. కాని ఆయాఅంగాలు జాత్యాభివృద్ధికికూడా ఏర్పడినవేనని జీవశాస్త్రం నిరూపిస్తూనేవుంది. ఆ సంగతి విస్మరించి ఎదురీతకు తలపడతానంటే, అది ప్రకృతికిచేసే అపచారమే అవుతుందేమో?

విపరీతమైన స్త్రీ లోలత్వం ఎలా భావించబడుతోందో, బ్రహ్మచర్యమూ అలానే భావించబడటం న్యాయం. మితిమీరింది ఏదైనాకూడా వ్యక్తిగతంగానూ, సామాజికంగానూకూడా కోరదగింది కాదనే విషయం సర్వజన సమ్మతంకదా! సెక్సును ఆకలితో పోల్చవొచ్చు; పస్తులుండటం ఎంత అనారోగ్యమో అజీర్ణవ్యాధితో బాధపడటంకూడా అంతే అనారోగ్యం అనేది కొత్త సంగతికాదు!

ఏది ఏమైనా యీ ప్రశ్నలకు జవాబులిచ్చే వారి వ్యక్తిగతాభిప్రాయాలుగా మాత్రమే వీటిని చూడనక్కర్లేదు. వాటి తాలూకు సత్యాసత్యాలు చాలామంది హృదయాలకు తెలుసు. నీ లోకజ్ఞానం నిన్ను నడిపిస్తూంటుంది. దాన్ని వృద్ధిచేసుకునేందుకు అనేక వాద ప్రతివాదాలువిన వొస్తూంటవి; ఏది నిజమనేది నీ అనుభవమే చెప్పగలదు. అన్నిటినీమించి బ్రహ్మచర్యమే దీక్షగాబూనే వారితో మాకు పేచీయేమీలేదు. స్త్రీ జనం కొంతమంది మిగిలిపోవటం ఒక్కటే

జరిగేది. అందువల్ల ప్రకృతి స్తభిస్తుందనే బాధ మాకు లేదు. ఎక్కువమంది మా కలహాలేకుండానే ప్రకృతి వాంఛలకు దాసానుదాసులై దాంపత్యంలో తలదూర్చి సాధారణ జీవితాల్ని గడపగలరు. అసాధారణంగా వుండే వారికి వారి అసాధారణతే తృప్తినివ్వగలదు.

ఐతే అలాంటివారు తమ నిష్ఠకు భంగంలేకుండా ఏ హిమాలయాల్లోనో జీవితాన్ని గడపటం మంచిది; ఐతే అప్పుడు వారినిగూర్చి ప్రచారం ఒకటి కొరతవుతుంది. దానికి ఏదైనా మార్గం చూసుకోవాల్సిందే!

ఇందువల్ల మరో ప్రమాదం సంభవించవొచ్చు: ఏ ఇంద్రుడో యీ కఠిన తపస్సును భంగపరిచేందుకు అప్సరసల్ని పంపవొచ్చు. అప్పుడు జాగ్రత్తపడటం అవసరం! లేదా దేవకన్యల్ని పొంది తరించటం జరుగుతుంది.

బ్రహ్మచారులే ఆరోగ్యవంతంగా ఉంటారనుకోవటం పొరపాటు. మితమైన సంసారజీవనంలో వున్నవారు, బ్రహ్మచారులకన్న తక్కువ ఆరోగ్యాన్ని కలిగివుండలేదు. కాకపోతే బ్రహ్మచారులకు సంసారంలోని ఇతర బాధలు ఉండవు కనుక, సంసారికన్న కొంత ఎక్కువ మనశ్శాంతిని కలిగివుండే అవకాశం వుంది.

ఆధ్యాత్మిక విలువల్ని తీసుకున్నప్పటికీ—కొంతమంది మహాఋషులు—ఉదాహరణకు జమదగ్ని, వశిష్ఠుడు, అగస్త్యుడు మొదలైనవారు సంసారం చేస్తూనే తపస్సు చేస్తూ ఆధ్యాత్మికంగా ఉన్నతస్థితుల్ని పొందారని మనకు తెలిసిందేకదా?

అన్నిటినీ మించి బ్రహ్మచర్య జీవితాల్ని గడిపేవారిలో కనిపించే మనో చంచలత కలకాలంగా చరిత్రలో కనిపిస్తూనేవుంది. నన్స్, బైరాగులు, బైరాగినులూ వీరి తాలూకు జీవిత చరిత్రలు చాలా విచిత్రంగానూ, ఒకోసారి భయంకర పరిణామాలకు దారితీసినవిగానూ రూపొందిన సంఘటనలు అనేకం. బ్రహ్మచర్యాన్ని శారీరకంగా అనుభవించటం సాధ్యమేననేవారి పట్ల కూడా, వారి మానసిక పరిణామాలు అధీనంలోకి లొక్కురావటం అంత సులభమైనది కాదు. పంచేంద్రియా

16 సం. ల క్రితం సరాసరి లెక్కల్ని, యీనాటి సరాసరి లెక్కలకు పోల్చిచూస్తే, బడికి వెళ్లే పిల్లల పొడువు ½ అంగులాలు అధికంగానూ, బరువు 2 పౌనులు అధికంగానూ వున్నట్లు బ్రిటన్‌లోని ఆరోగ్యశాఖాధికారులు తేల్చారు. దీన్నే 1907 నాటి లెక్కల్తో పోలుస్తే, ఎత్తులో 3 అంగుళాలూ, బరువులో 9 పౌనులూ పెరుగుదల కనిపిస్తుంది.

లనూ జయించాలనటం వినేందుకు మధురంగానే వుంటుంది; నిత్యజీవితంలో దాన్ని అమలుజరపటం సామాన్యులకు అతీతమే!

యీ బ్రహ్మచర్యాన్ని గూర్చిన పూర్వీకుల అభిప్రాయాల తాలూకు సారాంశమే 'బ్రహ్మచారీ శత మర్కటః' అనేట్లు చేసింది; యీ సామెతలో బ్రహ్మచారి మనస్తత్వం స్పష్టమౌతూనే వుంది.

బ్రహ్మచర్యంలోని థియరీ ఏమిటంటే, దాంపత్య జీవితంలో మానవుడు కొంత శక్తిని కోల్పోతాడు. ఆ శక్తి కోల్పోకుండా, దాన్ని వేరొక మంచిపనులకు ఉపయోగించటం. అంతవరకూ బాగానేవుంది. దాంపత్య జీవనం మంచిది కాదనే వరకుకూడా నమ్మించవచ్చు. ఐతే కామవాంఛ అనేది మనం కొనితెచ్చుకునేదికాదు. ఒక దంపతుల కామవాంఛ తీరిన ఫలితంగానే జన్మప్రాప్తించింది. కామవాంఛ స్వభావసిద్ధంగా పుటకతోనే వొచ్చి పడింది. అది శిక్షణలోనూ, పెరుగుదలలోనూ వొచ్చేదికాదు. సెక్సును గూర్చి ఏమీ తెలియని ఆదిమ మానవులు, ఆదామూ, యీవ్‌లకు ఎవరు చెప్పారు? ఎవరు నేర్పారు? అలాటప్పుడు సెక్సు వాంఛలు మన వశంలోనే ఉన్నవనుకోవటం ప్రమాదం. వాటిని కొంతవరకూ నిగ్రహించుకోగలగటం, సాధ్యమే కాని, వాటిని పూర్తిగా మరిచిపోయి వాటికిదూరంగా వుంటున్నామనుకోవటం ఆత్మవంచనే అవుతుంది. మరిచిపోతే మాయమయేదిగా దీన్ని భావించటం పెద్దపొరపాటు!

> "సమాజం ఎలా తయారు చేస్తే అలాతయారయ్యేది స్త్రీ. కేవలం కొన్ని గుడ్డినమ్మకాల ఆధారంగానే ఆమె ప్రవర్తన వుంటుంది. అందుకనే వారు క్లబ్బుల్లోనూ, విందుల్లోనూ సెక్సునుగూర్చి మాట్లాడవలసి వస్తే, ఎలుక మీదా, పిల్లి మీదా పెట్టి మాట్లాడుతారు."
>
> —ఒకానొక హాలివుడ్ సినిమానటి.

యీ థియరీ ప్రకారమే వంశాభివృద్ధికొరకై కొన్ని ఎద్దులను వుంచేసి, వాటికి గుర్తువేసి ఆబోతులుగా వొదులుతారు; వాటిని ఎవరూ ఏమీ అనకూడదు. వాటిని పోషించాల్సిన బాధ్యత సమాజానికి వుంది. అవునుకట్టించటానికి తప్ప వాటిని మరేపనికీ ఉపయోగించరాదు.

పోతే మిగతా ఎద్దులకు బీజాలు తొలిగించేస్తారు. వాటిని పొలందున్నేందుకూ, బళ్లు లాగేందుకూ ఉపయోగిస్తారు. ఇవి బ్రహ్మచర్యాన్ని విధిగా అనుసరించే తీరాలి. ఇందువల్ల మిగిలిన శక్తిని మానవుడు తన సేవకుగాను ఉపయోగించుకుంటున్నాడు. ఇది బలాత్కార బ్రహ్మచర్యంగా మనంగుర్తించవొచ్చు.

ఇలాటి ఎడ్లలో మానసికంగానూ, శారీరకంగానూ విపరీతాలైతే కనిపించవు; పెద్ద అంగాలే లేనప్పుడు వాటిని గూర్చిన సమస్యే ముంటుంది కనుక?

కాని మానవుడు జంతుజాతిలో ఉత్తమజీవి. అతని మానసిక పరిణామాలూ, మేధస్సూ చాలా అధికంగా పని చేయగలుగుతవి. అందుకని అతనిలో మానసిక పరిణామాలు అత్యధికంగా వుండటం వింతకాదు.

జీవశాస్త్రరీత్యా ఏ అంగమైతే దాని పనుల్ని నిర్వర్తించదో, కాలక్రమేణా ఆ అంగం పనికిరాకుండా పోతుందనీ, దానికి కొన్ని ఉదాహరణల్ని సెప్టెంబర్ సంచికలో ఇచ్చేవున్నాం. మరి కొన్నిటిని ఇక్కడ చెపుతాం: ఒకప్పుడు మానవునికి వొంటినిండా విపరీతంగా వెంట్రుకలుండేవి; ఇవి శీతోష్ణాలనుంచి కాపాడుకునేందుకు. క్రమంగా మానవుడు ఇళ్లుకట్టుకొని వస్త్రధారణచేస్తూ అనేక విధానాల్లో తనను తాను కాపాడుకోసాగాక, వెంట్రుకల అవసరం తగ్గి, చాలా వరకు రాలిపోయినవి; యీ వున్న కొద్ది వెంట్రుకలూ శరీరం నుంచి చెమటను బైటికి పంపేందుకే కాని, శీతోష్ణాల బాధల్నుంచి కాపాడుకునేందుకు ఉపకరించటంలేదు.

ఇదేవిధంగా గుర్రాలకూ, ఆవులకూ వున్న గిటలులాటివి ఒకప్పుడు మానవుడికి ఉండేవి. అవే నేటికీ కాలిగోళ్లుగానూ, చేతిగోళ్లుగానూ పెరుగుతూన్నవి. ఒకప్పుడు మానవుడు చేతిగోళ్లతోనే మాంసాన్ని చీల్చుకొని తినేవాడు; ఆయుధాలు కనిపెట్టాక వాటి అవసరం తగ్గి అవిక్రమంగా బలహీనంగానూ, చిన్నవిగానూ పెరగ సారంభించినవి. గుర్రం మాతృజంతువుకు, కాళ్లకు ఐదు వేళ్లూవుండి, వేళ్లచివరల్లో గిట్టలు లేదా గోళ్లు ఉండేవి. శతాబ్దాలు గడిచాక ఇవి పరిణామంచెంది, ఒకే పెద్ద గోరుగా పెరిగినవి. గుర్రం కాలిని జాగర్తగా పరిశీలించినట్టయితే,

> అమెరికాలోని వ్యభిచారిణి సంపాదన ఇలావుంటుంది: ఆమె తీసుకొనే ప్రతి డాలర్‌లోనూ (సుమారు రూ. 5/-) ఆమెకు దక్కేది 20 సెంట్లు; అంటే సుమారు రూ. 1/- మిగతాది వ్యభిచార గృహాధికారులకూ, మధ్యవర్తులకూ, టాక్సీలకూ, ఆమె పోషకులకూ, చికిత్సలకూ, పోలీసుల లంచాలకూపోతుంది. కాతాదారులు ఆమెను ఎంత బాధించినా, వారు ఎంత పశుప్రాయంగా ప్రవర్తించినా చట్టాలు ఆమెకు సహాయపడవు. పైపెచ్చు ఏ క్షణాన్నయినా ఆమె అరెస్టు కావొచ్చనే భయంతోనే వుంటుంది. త్వరలోనే సుఖరోగాలతో మంచం పట్టటం తథ్యం.

కాలిచివర, పైభాగాన బొటనవేలు తాలూకు చిహ్నం స్పష్టంగా కనిపిస్తుంది. మధ్య వేళ్లు, బొటనవేలు తాలూకు గోళ్లుకలిసే గుర్రానికి గిట్టలుగా తయారైనవి; పోతే వాటిగిట్టలూ, మన గోళ్లూ ఒకే పదార్థంతో తయారైనవి. వాటిని కోస్తున్నప్పుడు, లేదా కత్తిరిస్తున్నప్పుడు బాధ కలగదు.

యీవిధంగా ఎన్నో ఉదాహరణలు చూపొచ్చు. ఏ అంగాన్నయితే జాతి సక్రమంగా ఉపయోగించదో ఆ అంగం కాలక్రమేణా మాయమౌతుంది. ఇది జీవశాస్త్ర పరిణామసిద్ధాంతం.

బ్రహ్మచర్యం బలవంతంగా అవలంబిస్తే అది వేరొక రూపాన బాధిస్తుంది. బాధనేది ఎటూ తప్పనప్పుడు, సుఖపడకుండానే బాధపడటం కన్న, సుఖపడి బాధపడటం ఎన్నుకోదగ్గదనే సంగతి లోకజ్ఞానం చెపుతూనేవుంది.

యీ సందర్భంలో ప్రపంచ ఆరోగ్య సంఘ సభ్యుడు ప్రొఫెసర్ అబ్రహామ్ స్టోన్ మొన్నీమధ్యనే, రోమ్‌లో జరిగిన ప్రపంచ జనాభాపరిశీలన సభల్లో ఇలా అన్నాడు: "చాలామంది మతాధికారులు బ్రహ్మచర్యాన్ని అంగీకరించలేదు; ఎందుకంటే దాంపత్యం ఇద్దరి వ్యక్తుల మధ్య కామతృప్తిని తీర్చగలదే కాకుండా, జాత్యాభివృద్ధిని చేయగలదీ ఇద్దరినీ శారీరకంగానే కాకుండా, ఆధ్యాత్మికంగాకూడా దరిజేర్చగలదీ కనుక! బ్రహ్మచర్యంవల్ల ఆరోగ్యం- శారీరకంగానూ మానసికంగానూకూడా చెడుతుంది. కనుక వేరొక విధానంలో మంచి గర్భనిరోధకాన్ని సాధించటం నేటి ప్రపంచశాస్త్రకారుల విద్యుక్త ధర్మం."

సెక్సంటూవున్నాక, అదొక సమస్య కాదనుకున్నంత మాత్రాన సరిపోదు. ఆ సమస్యను ఎదుర్కోక తప్పదు. దాన్ని ఎంతసులభంగా, సహజంగా తీర్చుకోగలుగుతే అంత తేలిగ్గా దాటవొచ్చు; ఆ సమస్య తీరినప్పుడు ఇతర ప్రాపంచిక విషయాలమీద మిగిలిన శక్తిని ఉపయోగించవొచ్చు.

దాంపత్యం ఒక నేరమే ఐతే, అది నీచకార్యంకింద భావించబడినట్లయితే, ప్రతిబిడ్డా ఒక నీచ కార్యఫలం కిందనే జమ. అంటే ప్రస్తుతం భూమిమీద బతికివున్న వారితాలూకు తల్లి దండ్రులు వీరిని కన్నందుకు చాలా సిగ్గుపడి ఉండాలి; కఠిన బ్రహ్మచర్యాన్ని అవలంబించే వారి తల్లిదండ్రులుకూడా ఇందుకు మినహాయింపు కారుకాదా!

చివరకు గర్భనిరోధానికి బ్రహ్మచర్యాన్ని అవలంబించటంకూడా చేతగాక, దాంపత్య జీవితాన్ని గడుపుతూ సంతానం కలగకుండా వుండేమార్గాల్ని అన్వేషిస్తూన్న ఆధునిక ప్రపంచంలో బ్రహ్మచర్యం తేలికనుకోవటం వొట్టి మాట! గర్భనిరోధానికి బ్రహ్మచర్యం ఒక మార్గమని మన ప్రభుత్వంకూడా ప్రచారం చేయనికారణం ఇదే! ప్రచారంద్వారా కొంతమందిని మోసం చేయవొచ్చునేమో కాని, ఎవర్నివారు మోసం చేసుకోవటం అసంభవం!

★



# చేసిన పాపం!

రచన:
మొపాసా

అనువాదం:
'ఇంద్రజిత్'

మార్గరెట్ మృత్యుశయ్యమీదవుంది. ఆమె వయస్సు 56 సంవత్సరాలే వినా, కనీసం డెబ్భైఐదు సంవత్సరాల దానివలె కనిపిస్తోంది. దగ్గుతెరల్లో మెలికలు తిరుగుతూ, ఎలాగైనా కాస్త వూపిరి పీల్చుకునేందుకు ఆమె విశ్వప్రయత్నం చేస్తోంది. పాలిపోయిన ముఖంలోని ఆమె కళ్ళు ఏదో భయానక దృశ్యాన్ని చూసినట్లుగా కదలిక లేకుండా ఉన్నవి.

ఆమె అక్క - సుజన్ని ఆమెకన్న 6 సంవత్సరాలు పెద్దది. పొంగిపొరలే దుఃఖంతో చెల్లెలి పక్కమీద కూర్చున్నది. పక్కనేవున్న టేబిల్ మీద రెండు మైనపువొత్తులు వెలుగుతూన్నవి; యీ తతంగమంతా చూస్తే మతబోధకునికి స్వాగతమనిపిస్తుంది.

ఆ గదిలోని వాతావరణం హృదయం ద్రవించేట్లుగా వుంది. ఒక వ్యక్తి తన చివరి వీడ్కోలును తీసుకొని, శాశ్వతంగా కన్నుమూయబోతోంది. పాత గుడ్డలు మూలల్లో దాక్కున్నవి. మందు సీసాలు గదిలో చెల్లాచెదురుగా పడి ఉన్నవి. కుర్చీలు చిందరవందరగా ఎవరికో భయపడిపోయినట్లు పడి ఉన్నవి. మృత్యుదేవత తన విశాల పక్షాలను గదినంతటనూ పరిచి, వేచి వున్నట్లే తోస్తుంది.

యీ అక్కచెల్లెళ్ళకథ హృదయ విదారకమైనది. వీరి కథ చాలామందికి తెలుసు; వారికి కన్నీరు తెప్పించింది. పెద్దామె - సుజన్ని ఒక యువకుని తన నాశనాన్ని కూడా లెక్కచెయ్యకుండా ప్రేమించింది. వారి ప్రణయ ఫలంరూపాన్ని పొందేందుకుముందు, ప్రధానం కూడా జరిగింది. కాని ఆ ప్రియుడు అతాత్తుగా మరణించాడు. సుజన్ని దుఃఖసముద్రంలో మునిగి, తను జీవితంలో వివాహమాడనని శపథం చేసింది. ఆమె తన వాగ్దానాన్ని చెల్లిం

చింది; జీవితాంతంవరకూ విధవవలెనే దుస్తులు ధరించి, విధవరికాన్ని భరిస్తూ నన్నట్లే బతికింది.

ఒకనాటి ఉదయం పన్నెండు వసంతాల్ని మాత్రం ఎరిగిన మార్గరెట్ వొచ్చి, అక్కను కావిలించుకొని ఇలా అంది: 'అక్కా! నీవు సుఖపడటం లేదని నాకెంతో విచారంగావుంది. నేనుమాత్రం నిన్ను ఎప్పటికీ విడవలేను. నీకు తోడునీడగా జీవితమంతా వెళ్ళబుచ్చుతాను. నేనుకూడా జీవితంలో వివాహమాడను.'

చెల్లెలి మాటలతో సుజన్నీ హృదయం ద్రవించింది; చెల్లెలి శపథం మీద ఆమెకు నమ్మకం లేకపోయినా, ఆమె కనబరిచిన ఆపేక్షకు చెల్లెల్ని కావిలించుకుంది. ఏమైనా చెల్లెలుకూడా తన శపథాన్ని కాపాడుకుంది. తల్లి దండ్రులూ, అక్కా ఎంతమంది, ఎంత దూరం బతిమాలినా ఆమె తనకు వరులుగా వొచ్చినవారందర్నీ తిరస్కరించింది. అన్నమాటను నిలబెట్టుకునేందుకు ఆమె అక్కను వొదిలివుండేది కాదు.

★

జీవితమంతా ఆ అక్కచెల్లెళ్లు కలిస్తే వున్నారు. చెట్టాపట్టాలు వేసుకొని విడవకుండా జీవితాన్ని ఉభయులూ పోరాడారు. మార్గరెట్ ఎప్పుడూ కుంగిపోయి, విచారంగా ఉంటూండేది; సుజన్నీకొరకై త్యాగం చేయటంవల్లనేమో చెల్లెలికన్న బాధపడుతూ నన్నట్లు కనిపించేది. ఆమెమీద కాలం తన ప్రభావాన్ని చాలా ఘోరంగా చూపిందనే చెప్పాలి; అక్కకన్న త్వరలోనే ముసలితనం ఆమెను ఆవరించింది. 30 సం॥ల వయస్సుకే ఆమె వెంట్రుకలు తెల్లబడినవి; ఏదో నిగూఢవ్యాధి ఆమెను తినేస్తోందనిపిస్తుంది. యీ విధంగా ఆమె తన అంత్యస్థితికి వొచ్చింది. గత 24 గంటల్లో ఆమె మాట్లాడిన మాటలు ఇవి: 'నా అంతం దగ్గరపడుతోంది; మతబోధకునికోసం కబురంపు'.

ఆమె వెల్లకిలా పడుకుంది. దగ్గుతెరలతో ఆమె గిలగిలలాడుతోంది. హృదయంలోని భయాన్ని దేన్నో తప్పించుకొని బైటపడేందుకు మాటలు పెదవులదాకా వొచ్చి ఆగిపోతూన్నవి. ఏదో భయం ఆమెను కమ్మింది; ఆమె స్థితి జాలిని కలిగిస్తోంది.

తెరలుతెరలుగా వొచ్చే దుఃఖాన్ని

తాగినవాణ్ని పట్టేందుకు ఏల్ యూనివర్శిటీ శాస్త్రజ్ఞులు ఒకానొక యంత్రాన్ని కనిపెట్టారు. తాగినవాడు, లేదా తాగే అలవాటున్నవాడు, ఒక గాజుగొట్టంలోకి, నోటిద్వారా గాలి వూదాలి. వెంటనే ఆ యంత్రం అతని రక్తంలోవున్న మత్తు పదార్థ శాతాన్ని రికార్డు చేస్తుంది.

తప్పుకోలేక ఆమె అక్క, తలను పక్క మీద వాల్చి 'మార్గరెట్! తల్లీ...!' అని వెక్కి వెక్కి ఏడుస్తోంది.

ఆమె మార్గరెట్‌ను ఎప్పుడూ 'తల్లీ' అనే పిలిచేది; మార్గరెట్ మాత్రం 'అక్కా!' అని పిలిచేది.

మేడమెట్లమీద అడుగుల చప్పుడు వినిపించింది; ముసలి మతబోధకుడు తలుపు తెరుచుకొని ప్రవేశించాడు. అతన్ని చూడగానే మార్గరెట్ ఎలాగో లేచి కూర్చొని, ఏదో గొణుక్కొని, పక్కబట్టల్ని పిచ్చిగా మెలిపెట్ట సాగింది. మత బోధకుడు ఆమె దగ్గరకు వెళ్లి, ఆమె చేతిని ఆప్యాయంగా పట్టుకొని, ఫాలభాగం మీద ముద్దుపెట్టుకుంటూ "అమ్మాయీ! భగవానుడు నిన్ను తప్పక క్షమిస్తాడు. ధైర్యంతో వుండు. నేను సిద్ధంగావున్నాను... మాట్లాడు!" అన్నాడు.

ఆమె ఆపాదమస్తకమూ వొణికింది; ఇందుకు అయగా మంచమే వూగింది. వూడిపోయిన గొంతును బలవంతాన స్వాధీనంలోకి తెచ్చుకొని "అక్కా! కూర్చొనివిను" అంది.

మతబోధకుడు సుజన్ని చేతిని తనచేతిలోకి తీసుకొని, ఆమెను పక్కనే వున్న కుర్చీలో కూర్చోపెట్టాడు. అక్కచెల్లెళ్ల చేతుల్ని తన చేతుల్లోకి తీసుకొని అతను గొణిగాడు: "భగవాన్! యీ అనాథలకు శక్తిని ఇవ్వు; నీ కరుణను వారిమీద ప్రసరించు!"

మార్గరెట్ తనపాపాలను చెప్ప

### "రో" యువకుల రోమాన్సు

ఎప్సు వ్యక్తులా
  సెప్సు సూక్తులు వింటాం
ఆల్ఫా యువతుల
  వుల్ఫా ప్రణయంకొంటాం
బీటా బాలల
  వాటా ఎదలు కంటాం
గామా పడతుల
  ధీమాలన్నీ ఇస్తాం
తీటాచేడెల
  కోటా బుగ్గలు కరుస్తాం
సిగ్మాయువతుల
  సిగ్గు మూతలు తీస్తాం
డెల్టాకాంతల
  అల్కానసుములు పడ్తాం
మ్యూజవరాళ్ళ
  వ్యూభవనాల్లో ఉంటాం
పై యువకాంతల
  పై కొట్టి రావాలంటాం
రోయువకులం!
కోరికలన్నీ తీరాలంటాం
షో సరుకులం,
రిహార్సలు వేస్తాం.
రో యువకులం.
రోమాన్సులు మేస్తాం.

—పూర్వాభాద్ర.

ప్రారంభించింది; ఆ మాటలు ఒక్కొక్కటిగా మెల్లిగా దొర్లసాగినవి:

'అక్కా! నన్ను క్షమించు ... నీ క్షమను వేడుకునేందుకు తగిన అవకాశం కోసం జీవితమంతా వేచివున్నాను. అది యీ నాటికి లభించింది.'

సుజన్నీ కన్నీళ్ళమధ్య 'నేను క్షమించటమేమిటి తల్లీ? నాకోసం నీవు సర్వస్వాన్నీ త్యాగం చేశావు. నీవు దేవకన్యవు!' అంది.

మెట్రోపాలిటన్ జీవిత భీమా కంపెనీవారి అంచనాల ప్రకారం 1953 లో అమెరికాలో జరిగిన వివాహాలసంఖ్య కొద్దిగా తగ్గింది. కారణాలు ఇవి: 1. రెండో ప్రపంచ యుద్ధానంతరం వివాహయోగ్యతగల యువకుల సంఖ్య తగ్గటం. 2. 1930-వ సంవత్సరంలో సంభవించిన అర్థిక మాంద్యత కారణంగా ఆ సంవత్సరం శిశు జననాలు చాలా తగ్గినవి. అంటే ఆ సంవత్సరాల్లో పుట్టినవారు, ఇప్పటికి వివాహ వయస్కులు కావటం జరగాలి, అప్పటి తక్కువ సంఖ్యలు 1953 లోని వివాహాల తగ్గుదలకు కారణం.

1952 లో వివాహాల అంచనా 1,000 కి 9.8 ఐతే 1952 లో ఇది 1,000 కి, 9.7 కు దిగింది. ఐతే 1952 లో జరిగిన వివాహాలు 1951లో జరిగిన వాటికన్న 20,000 అధికం.

మార్గరెట్ . అక్క మాటలకు అడ్డుపడుతూ 'కాదు...నన్ను మాట్లాడనీ. నాకు అడ్డురాకు. అది భయానకమైనదే! చివరిదాకా...జరిగినదంతా... నిజంచెప్పనీ...హెన్రీ...హెన్రీ నీకు జ్ఞాపకమే కదూ?'

సుజన్నీ ఆశ్చర్యంతో చెల్లెలివంక చూసింది.

'యీ కథంతా వింటేనేకాని నీకు అర్థంకాదు. అప్పుడు నావయస్సు 12 సంవత్సరాలే...నీకు గుర్తుందా, కదూ? నాకు సరైన శిక్షణలేదు. మనసుకు తోచిందల్లా చేసేదాన్ని. నేను ఎందుకు చెడిపోయినానని నీవు అడగొచ్చు... విను. మొదటి సారి హెన్రీ మన ఇంటికి వొచ్చినప్పుడు గుర్రపుస్వారికి ఉపయోగపడే బూట్సు వేసుకొచ్చాడు. మెట్లదగ్గర గుర్రందిగి, తన దుస్తుల విషయం క్షమించమన్నాడు. నాన్నగారికి ఏవో వార్తల్ని అతను తీసుకొచ్చాడు...అదంతా నీకు జ్ఞాపకమే కదూ?...ఉస్...మాట్లాడక విను: హెన్రీని చూడగానే నా హృదయం నా స్వాధీనం తప్పిపోయింది. మొదటి చూపులో నే ప్రణయంలో తలక్రిందులుగా పడ్డాను. నాన్నగారితో అతను మాట్లాడుతూన్నంతసేపూ, నేను గదిమూలలో నిలబడి అతన్ని తదేకంగా చూడసాగాను ... పిల్లలు విచిత్రజీవులు... ఒకోసారి భయంకర రూపులుకూడా అవుతుంటారు...ఆనాటినుంచీ అతన్ని గూర్చి ఎన్నో కలలు కంటూండేదాన్ని.

'అతను మళ్లీ మళ్లీ రాసాగాడు. చూపుల దాహం తీర్చుకునే దాన్ని; ప్రణయం శరీరాన్ని మించి ఆత్మవరకూ వెళ్లింది. వయస్సుకు తక్కువైనా, వూహాలకు పెద్దదాన్నే; అందరూ అనుకున్నంత అమాయకురాల్ని కాదు; చాలా జిత్తుల మారిదాన్ని కూడాను...అతను తరుచు రాసాగాడు. నా ఆలోచనలన్నిటినీ అతనే ఆక్రమించేవాడు. అతని పేరు తలుచుకుంటేనే శరీరం పులకరిస్తూండేది.

"ఆ తరువాత అతను నిన్ను వివాహ మాడుతాడని విన్నాను. అది నా హృదయాన్ని ముక్కలు ముక్కలు చేసేసింది. మూడు రాత్రులవరకూ నిద్రలేకుండా, తెల్లవార్లూ ఏడుస్తూనే వున్నాను ... అతను ప్రతి మధ్యాహ్నమూ భోజనమయ్యాక వొస్తుండే వాడు...నీకు జ్ఞాపకం వుందికదూ... ఉస్ ... మాట్లాడకు. విను: అతని కోసం నీవు వెన్నరాచిన కేకుల్ని చేసే దానివి; పాలుకాచి సిద్ధంగా వుంచే దానివి; అవి ఎలా తయారు చేసే దానివో నాకుఇప్పటికీ బాగా జ్ఞాపకం. యీనాడు మళ్ళీ వాటిని చేయాలంటే నేను చేయగలను. కేకు కాస్త కొరికి కొంచెం వైన్ తాగి "ఎంత మధురంగా వుంది!" అంటూండేవాడు ... ఎలా అనే వాడో నీకు గుర్తుందికదూ?

'నాలో ద్వేషం...ద్వేషాగ్ని ప్రజ్వరిల్ల సాగింది. నీ వివాహం దగ్గరపడు తోంది; అప్పటికింకా రెండువారాలే వుంది. నాకు పిచ్చెక్కినట్లయింది. అతను నిన్ను ఎన్నటికీ పెళ్ళాడకుండా

నగ్నత్వమూ-అందువల్ల కలిగే కామోద్రేకాన్నిగూర్చి గత 30 సం॥ల క్రితం 10,000 మంది అభిప్రాయాలు సేకరించబడినవి. ఫలితాల్నిబట్టి చూస్తే అర్ధ నగ్నత్వం అధికంగా ఆకర్షిస్తుందని తేలింది; ఇది జర్మన్ మనస్తత్వ వేత్తల ఫలితాలు.

కాని అమెరికన్ మనస్తత్వవేత్తల అభిప్రాయం విరుద్ధంగావుంది. అర్ధ నగ్నత్వం కన్న నగ్నత్వమే ఎక్కువ ఆకర్షిస్తుందని వారి అభిప్రాయం.

ఇప్పుడు కొత్త సమస్య తయారైంది.

భూగోళశాస్త్రప్రకారం కామోద్రేకాల తత్వాలు మారుతవా? అవి జాతినిబట్టీ, శీతోష్ణాలనుబట్టికూడా ఉంటవా?

గత 30 సం॥లుగా మానవమనస్తత్వం ఏమైనా మారిందా? అందువల్ల మానవులకు అర్ధ నగ్నత్వం కన్న, నగ్నత్వమే ఆకర్షణీయమైందా?

మనస్తత్వ వేత్తల మనస్తత్వం మీదనే యీ భేదం వొచ్చిపడిందా? దీనికీ, జనాభావృద్ధి కావటానికీ ఏమైనా సంబంధం వుందా?

యీ విషయాలు ఇంకా చర్చించవలసిన అవసరంవుంది.

చేయాలని శపథంచేశాను. నేను పెద్ద దాన్నయాక అతను నన్నే పెళ్ళాడాలి. ప్రపంచంలో వేరెవ్వరినీ నేను పెళ్ళాడలేను; ఈ విధంగా ప్రేమించ గలగటం అసంభవం.

'వివాహం ఇంకా పదిరోజులు వుందనగా, ఒక నాటిరాత్రి ఇంటిముందు అతనితో నీవు వెన్నెల్లో పచార్లు చేస్తున్నావు...దూరంగావున్న పైన్ చెట్టు కింద అతను నిన్ను తన చేతుల్లోకి లాక్కున్నాడు. నీవు అదంతా మరిచి పోలేదనుకుంటాను. ఆ సంఘటన అయాక, నీవు వెలవెలబోతూ గది

బ్రిటన్‌లోని ఆరోగ్య శాఖాధికారులు, భోజనంచేసే పాత్రసామాగ్రుల్లోనూ, ఆహార పదార్థాలు నిలవ చేసే పాత్రల్లోనూ కలిపే సీసం పాలు చాలా భాగం తగ్గించాలనే సూచనను చేశారు; యీ సీసంవల్ల ఆరోగ్యం చెడటం చాలా ఎక్కువగా గమనించబడింది.

సీసంవల్ల కలిగే భౌతికలాభాలు ఏమీలేవు. కాని దీనివల్ల శరీరంలోని రక్తం క్రమంగా విషతుల్యం కాగల అపాయంవుంది. చిన్న మోతాదుల్లో, కొంతకాలంగా ఇది ఆరోగ్యాన్ని భంగపరచగలదు. మరీ ముద్రణాలయాల్లోని కంపోజిటర్లు టైపుల్ని నోట్లోపెట్టుకొనే దురలవాటువుంది. ఇందువల్ల వారిరక్తం 'లెడ్ పాయిజన్'కు గురవవొచ్చు. వారీ దురలవాటును వొదిలించుకోవటం అత్యవసరం.

లోకి వొచ్చావు; నేను చాటుగా అంతా చూస్తూనే వున్నాను. నేను కోపంతో వొణికి పోతున్నాను. ఆ కోపజ్వాలలో మీరిద్దరూ మసికావలసింది. నిన్నుకానీ, వేరెవ్వరిని కానీ అతను వివాహమాడరాదని నేను శపథంచేశాను. అతను నన్ను తప్ప ఇంకెవర్ని వివాహమాడినా, భరించలేను...కాని యీ క్షణంలో అతనంటే నాకు పరమ అసహ్యం కలిగింది.

'నేనేం చేశానో నీకు తెలుసా? విను! తోటమాలి పిచ్చికుక్కల్ని చంపేందుకు మాంసంలో విషం కలపటం చూశాను. ఒక గాజుసీసాను మెత్తగానూరి, ఆ పొడిని మాంసంలో కలుపుతున్నాడు. యీ విధానం నాకు బాగా నచ్చింది. ఒక సీసాను పగలగొట్టి మెత్తగా నూరి వుంచాను. ఆ పొట్లం విప్పితే ఆ గాజుపొడి తళతళా మెరిసేది. మర్నాడు నీవు కేకుల్ని చేశాక, వాటిని జాగర్తగా కత్తితో చీల్చి యీ గాజుపొడివేసి, మళ్ళీ అతికించాను. అతను మూడు కేకుల్ని తిన్నాడు. నేను ఒకటి తిన్నాను. ఇంకా మిగిలిన ఆరింటినీ కొలనులో పారేశాను. మూడురోజులు తర్వాత, కొలనులో యీదే రెండు బాతులూ చచ్చినవి...

'ఇదంతా నీకు జ్ఞాపకమే ననుకుంటాను. నీవు మాట్లాడవొద్దు...నన్ను చెప్పనీ; ఆ కేకుల్ని తిన్నవాళ్ళందరూ చచ్చారు; నేనుమాత్రం చావలేదు, బహుశా మోతాదుసరిపోయివుండదు. ఆనాటినుంచే నా ఆరోగ్యం చెడింది.

వచ్చిన హెన్రీ విషయంకాదు...కాని ఆనాటినుంచీ పిశాచునివలె నన్ను అతను వెన్నాడుతూనే వున్నాడు.

'అంతే — ఆనాటినుంచీ జీవితం దుర్భరమైంది. జీవితంలో నిన్ను విడ నాడ దలచలేదు. యీ సంగతులన్నీ మృత్యుముఖంలో నీకు చెపుదామనుకు న్నాను. నా మనస్సులో యీ దుర్మార్గ మంతా కరుడుకట్టి నన్ను జీవితమంతా బాధిస్తూనేవుంది. అక్కా! అది ఎంత ఘోరమో, ఎంత విషాదమో, ఎంత బాధో చెప్పలేను.

మేల్కొనివున్న ప్రతినిమిషంలోనూ చావబోయ్యే ముందు నీకీ సంగతులన్నీ చెప్పాలనే మాట జ్ఞాపకం చేసుకుంటూ వుండేదాన్ని. చాలాకాలంగా వేచి కూర్చొన్న ఆ సమయం ఇప్పటికి వొచ్చింది ... ఇప్పుడు నా హృదయం తేలికయింది...అక్కా! మాట్లాడకు. నేను నైతికంగా భయపడిపొయ్యాను ...చనిపొయ్యాక అతన్ని చూడటం తటస్థ పడుతుందనుకో...అతన్నిచూడ గలగటం అంటే—దాన్ని నీవు వూహించుకోగలవా? నాకు అతన్ని చూసేం దుకు ముఖం చెల్లదు; నాకు ధైర్యంలేదు కూడాను!...ఏమైతేనేం అతన్నిచూడక తప్పదనుకుంటాను...నేను చనిపోబో తున్నాను. అక్కా! నాకు క్షమా భిక్ష ఇవ్వు. నీ క్షమలేనిదే నేను అతన్ని చూడలేను...ఫాదర్! మా అక్కచేత నాకు క్షమ ఇప్పించమని వేడుకుంటు న్నాను. ఆమె క్షమించనిదే నేను చావ లేను!"

భరించలేని నిశ్శబ్దం గదిని ఆవరించింది. మార్గరెట్ వూపిరికోసం పెనుగులాడుతూ, దుప్పటిని మెలిపెడుతోంది.

సుజన్నీ తన ముఖాన్ని అరచేతుల్లో దాచుకొని కదలక మెదలక ఉండిపోయింది. ఎన్నో సంవత్సరాలు తన స్వప్నసుందరిని ప్రేమలో దొర్లి ఉండవలసింది; ఆ వివాహమే వినట్లయితే తనెంత సుఖపడి ఉండేది! జ్ఞాపకం వుంచుకోలేని గతించిన- ఆ రోజుల్ని ఆమె గుర్తుతెచ్చుకునేందుకు ప్రయత్నిస్తోంది. జరిగిపోయిన కాలంలోకి ఆమె మనస్సు వేగంతో వెనక్కు పరుగెత్తుతోంది...అతనినుంచి ఆమె పొందిన అముద్దు! ఆ ఒక్కముద్దు తాలూకు మాధుర్యమే ఇన్నేళ్లపాటూ తనను బతికించగలిగింది! దాని తాలూకు జ్ఞాపకాన్నే ఆమె హృదయాంతరాళంలో దాచుకొంది...ఆతరువాత- ఏం లేదు- మరెన్నడూ-ఏమీలేదు- అంతే!

మతబోధకుడు లేచి నిలబడి, ఆజ్ఞాపూరిత స్వరంతో 'సుజన్నీ! నీ చెల్లెలు చావబోతోంది' అన్నాడు.

సుజన్నీ కన్నీటితో తడిసిన తన ముఖంనుంచి చేతుల్ని తీసేసింది. చెల్లెల్ని ఆదరణతో, అభిమానంతో, అనురాగంతో కావిలించుకొని ముద్దు పెట్టుకుంది.

'తల్లీ! నిన్ను క్షమించాను; హృదయ పూర్వకంగా క్షమిస్తున్నాను' అందా అక్క!

★



# పాఠకుల ఉత్తరాలు

[ఈ శీర్షికలో ప్రచురించబడిన లేఖలకు ఈ కింది విధంగా బహుమతులు ఇవ్వబడినవి.

మొదటి బహుమానం: రు. **15-0-0** పి. కృష్ణమూర్తి, మద్రాసు, 24.

రెండవ బహుమానం: రు. **10-0-0** నాయుడు సీతాదేవి, కాకినాడ.

మూడవ బహుమానం: రు. **5-0-0** కె. అనసూయమ్మ, టంగుటూరు.

బహుమతుల మొత్తాలు అక్టోబర్ మొదటివారంలో పంపబడుతవి.]

## 14

ఒకప్పుడు నాకూ ఇలాటి సమస్యే ఎదురైంది. నా భర్త మేనమామ కొడుకే కావటంవల్ల, మా మధ్య అరమరికలు లేవు. యీ సమస్యనుగూర్చి అప్పట్లో దీర్ఘంగా ఆలోచించి, మా వారితో ఇలా అన్నాను:

“నా స్నేహితురాలు విశాలాక్షి సంగతి. పాపం ఆమె చాలా గాభరాపడి పోతూవుంది. ఆమెభర్త స్నేహితుడు ఆమె భర్త లేనపుడు, లేడనే సంగతి తెలిసికూడా తెలియని వానిమాదిరి ఇంటికివచ్చి లోకాభిరామాయణం మాట్లాడుతూ ఆమె భర్తసంగతి- అతని వ్యభిచారం సంగతి- తన సంగతి, తనను ఇతర స్త్రీలు ప్రేమించే సంగతి-ఇలాగే ఏమిటేమిటో వాగుతూ వుంటాడట. ఆమె భర్తతో చెప్పటానికి ధైర్యంలేక అతన్ని ఏమీ అనలేక తికమకపడుతూ నాతో చెప్పి ఈ పీడ వదలించుకునే మార్గం చెప్పమంది. దీనికి మీరేమైనా మార్గంచెప్పి ఆమెను కాపాడండి” అన్నాను.

ఈ మాటలు మా వారితో చెప్పేసరికి నాకు ముచ్చెమటలుపోసినాయి. గొంతు బొంగురుపోయింది. గుండె దడ దడలాడింది. పెదిమలు వొణకిపోయినాయి. ఎలాగైతేనేం చెప్పినాను. నేనీమాటలు చెప్పింతర్వాత దీనంగా మావారి ముఖం చూచాను. వారిముఖంలో కూడా కాంతిలేదు. వారిలో చాలా మార్పు వచ్చింది. ఈ సమస్య నా స్నేహితురాలిది గాదనీ- నాదేననీ నన్ను పీడిస్తుండే సమస్యేననీ మావారు గ్రహించారు. వారు గ్రహించారని నేను తెలుసుకున్నాను. ఈ సంగతిలోని వాస్తవికతను వారు తెలుసుకున్నారని నేను గ్రహించిన సంగతికూడా వారు

'ఓరి దుర్మార్గుడా ఎంత పని చేశావ్? ఐదు రూపాయల నోటు, చిల్లర డబ్బులూ అంతా చుట్ట చుట్టుకు పోయావు గదరా? బీడీ ముక్క నన్ను కొనుక్కోడానికి దమ్మిడీకూడా మిగల్చకుండా ఎత్తుకు పోయావు గదరా పాపి!'

సత్తెయ్య ఎక్కడకు పోయినట్టు?

తన శిష్యపరమాణువు సత్తెయ్య ఏమయినట్టు?—ఆలోచిస్తో సదానందులు దిగులుగా మోకాళ్ళ మీద గడ్డం ఆనించి అరుగుమీద అలాగే కూలబడి కూర్చున్నాడు-

'సాధూజీ! యీ రాత్రికూడా వస్తారా?' సదానందుని దీర్ఘాలోచన తెల్లా చెదురు కాగా ఉలిక్కిపడి చూచాడు.

వీధి వాకిలి తలుపులు తెరచిన శబ్దమైంది. సదానందులు చివాలున లేచి నుంచుని రెండు చేతులతో చెవులు మూసుకొని 'పాపం శమించుగాక!' అనుకొన్నాడు. తను ఏ పాపమూ ఎరుగడే? ఇది ఇలా అంటుందేం? యీ లె ముండ!!

'సాధూజీ! రాత్రికి వస్తారుగా?' ఆ మధురమైనగొంతులో ఎన్ని ఆహ్వానాలో! మళ్ళీ ఆమె గొంతు వినపడింది, తలుపు వెనక నుంచి సదానందులకు.

సదానందుల మెదడులో ఒక్కసారి మెరుపులా మెరిసాడు సత్తెయ్య!

అరుగుమీదవున్న తన యోగదండాన్ని చేత్తో తీసుకొని, సదానందులు ఉగ్రుడయి పోయి తలుపులు తోసుకొని, లోపలకు ప్రవేశించాడు.

అప్పుడే బయటికి వస్తోన్న శిష్యుడు సత్తెయ్య, ఉగ్ర స్వరూపం దాల్చి ఎదురుగా వస్తోన్న గురువుగార్ని చూసి గుడ్లు తేలవేసి నిలువునా కొయ్యలా బిగుసుకు పోయాడు!

దండధరుడై కాలరుద్రునిలా రయ్యిన మీద కొస్తోన్న సదానందులను చూసి భయవిహ్వలుడై శిష్యుడు వెనక్కి అడుగులు వేయసాగాడు-కాని మెడమీద పడనే పడింది!! గురువు చేతిలోని దండం - యోగ ముద్రలో మునిగి పోయినప్పుడు చేతికింద ఊతగా ఉండేదండం-శిష్యుడయిన సత్తెయ్య మెడమీద గుప్పెడెత్తు కండను కదలగొట్టి అరిచేతివెడల్పున చర్మాన్ని చితుకగొట్టింది! హాతోస్మి!!

దెబ్బకు సత్తెయ్య బిళ్ళం గోడులా తెరి కెవ్వున కేక వేసి కింద బడ్డాడు!

'లేరా నీచుడా! నన్ను ప్రాణాలతో వదుల్తా ననుకొన్నావా? లే! పాపీ!' అంటూ సదానందులు కిందపడ్డ సత్తెయ్య మీదకు ఉరుకుతోండగా-, 'అయ్యో! మనిషిని చంపుతున్నాడా! ఆగు! ఆగు!' అని అరుస్తో ఆ ఇల్లు గల విధ-రాత్రి సత్తెయ్య తాలూకు ఉప్పు తిన్న ఆడది—సదానందులకు శిష్యుడికీ మధ్య వచ్చి నిలబడింది.

'అసలు నువ్వెవడివిరా నా ఇంట్లో జొరబడి అయన్ని కొట్టడానికి?' చేతులు అడ్డంపెట్టి సదానందుల ముఖంలోకి తీవ్రంగా చూస్తో అడిగింది ఆమె.

ఎదురుగా నుంచున్న ఆమెను మొదటి సారిగా పరీక్షగా, తీక్షణంగా చూశాడు సదానందులు. చూస్తూనే భూమిలోకి పాతేసిన గోవు రాయిలా స్తంభించి పోయాడు! చేతిలోని దండం పట్టుతప్పి కిందపడింది!

'ఆమె ... ... ఆమె ఎవరు? ఎవరూ......?', సదానందుని మెద

డులో విస్మృతపద కవాటాలు—ఏడు సంవత్సరాలుగా బంధించబడ్డ కవాటాలు బరబరా తెరుచుకొన్నయ్---

సందేహం లేదు! ఇది తన పెళ్ళాం-ఆదెమ్మే! అవును తనకు మూడేళ్ళ కొడుకుకూడా వుండాలి! అప్పుడు మూడేళ్ళు! ఏడేళ్ళ కిందట మూడేళ్లు-వుంటే ఇప్పటికి పదేళ్ళవాడై యుండాలి—తన కొడుకు? కాదు ఆదెమ్మ కొడుకు? తనకు కొడుకు కాడా—వాడే మయ్యా—

—సదానందుని బుర్రలో జటాయువు రెక్కల సవ్వడి—గత చరిత్రంతా మనో నేత్రం ముందు తిరిగి పోతూంది—

అంతలోకే పదేళ్ళకుర్రాడూ, ఐదేళ్ళ ఆడపిల్ల మూడేళ్ళ చిన్నవాణ్ని నడిపించుకుంటూ-'అమ్మా! అమ్మా!' అంటూ గాబరాగా వచ్చి ఆమెనుచుట్టుకొన్నారు.

'అవును వాడే! తనకొడుకు! ఐతే వీళ్ళిద్ద రెవరూ? 'ఎడతెగని ఆలోచనలో పడి నివ్వెరపోయి చూస్తోన్నాడు సదానందుడు.

కాషాయ గుడ్డల్లో, స్వేచ్ఛగా పెరిగి జడలు కట్టుకుపోయిన జుట్టూ, గడ్డంతో వున్న 'ఆయన్ను' గుర్తించింది ఆదెమ్మ. ఆమెలో భయం, సంతోషం, కసి, అసహ్యం వరుసగా కలిగాయి. నరనరానా పాకాయి. తన్నీ దుస్థితికి తెచ్చిన నీచుడూ, దుర్మార్గుడూ, పిరికిపంద అయిన సరవయ్యను ఆమె సహించ లేదు; క్షమించలేదు. ఆదెమ్మ భర్తను గుర్తించినట్టు సూచనా మాత్రంగా నైనా బయట పెట్టకుండా నిలదొక్కుకుంది.

అప్పటికే సత్తెయ్య లేచి వళ్లుదులుపుకొని ఆమె వెనకే నిలబడ్డాడు. గురువుగారిచేతులోని దండం కింద పడటంతో శిష్యుడు శరీరంలోకి, పోయిన బలం, ధైర్యాన్ని కూడ తీసుకొని తెచ్చుకొన్నాడు.

'వీళ్ళెవరూ?' కంపిత స్వరంతో పిల్లల్ని చూపించి అడిగాడు సదానందులు ఉరఫ్ సరవయ్య.

'నా బిడ్డలు!' అన్నది ముక్తసరిగా.

'అబద్ధం! నీకు ఒక్కడే కొడుకు! అదుగో ఆ పెద్దవాడే నీ పెద్ద కొడుకు! మిగతా వీళ్లిద్ద రెవరో నిజం చెప్పు!'

'వాళ్ళిద్దరు కూడా నా బిడ్డలే! బుల్లి బుల్లి ఆత్మలు! పరమాత్మ స్వరూపాలు!' అంటూ ఆదెమ్మ చిన్నవాళ్లిద్దర్నూ దగ్గరకు తీసుకొని గుండెలకు హత్తుకొన్నది.

ఆదెమ్మ మాటలు వింటూంటే సదానందులు-అనగా, సరవయ్య ఆత్మ మెడ తెగిన కోడిపెట్టలా గిజగిజలాడిపోయింది! గుండెల్లో బాకులు దూరి వొరుచుకున్నట్టయింది!

'ఛీ! పాడు ముండ! వేదాంతం ఏడుస్తున్నది వేదాంతం! సత్తిగాడితో ఒక్క రాత్రికే ఎంత వేదాంతం అబ్బింది? ఔరా! దీన తస్సాదియ్యా ఏం వేదాంతం?' అని మనసులో మథన పడ్డాడు సరవయ్య. ఇక క్షణం అక్కడ వుండలేకపోయాడు సదానందులు. కిందపడ్డ దండం తీసుకొని, ఆదెమ్మనూ, పిల్లల్నూ వోసారి ఏదో తెలియని భావనతో చూసి, సదానందులు మౌనంగా తలవంచుకొని ఇంట్లో నుంచి బయటికి వచ్చాడు.

అంతవరకూ ఆదెమ్మ చాటున నక్కి వున్న సత్తెయ్య గురువుగారు శాంత

మాటత్తులవడం గమనించి, 'గురూజీ!' అన్నాడు దీనస్వరంతో.

వీధివాకిలి దిగబోతూ సదానందులు చివాలున వెనక్కి తిరిగి ఏహ్యభావంతో శిష్యుడి ముఖంలోకి చూశారు.

'గురూజీ!నన్ను క్షమించరా స్వామీ? క్షమించరా స్వామీ? నా ఆత్మకు——' దుఃఖంతో సత్తెయ్య గొంతు పూడి పోయింది.

'ఇంకా నా శిష్యుడవనే అనుకుంటున్నావా? మహాపాపీ! దూరంగా పో! నువ్వు రౌరవాది నరకాలకు గురి అవుతావ్! నువ్వు చేసిన పాపానికి ఫలితం అనుభవించు! నీఆత్మకు ఏడేడు పధ్నాలుగు జన్మలెత్తినా విముక్తి లేదు!' అన్నాడు సదానందులు.

'అదేమి గురూ? శరీరం చేసిన పాపం ఆత్మకు అంటదని తమరే చెప్పారుగా? అలాంటప్పుడు నాశరీరం చేసిన పాపానికి నా ఆత్మకు శిక్షెందుకు స్వామీ?' అన్నాడు శిష్య పరమాణువు సత్తెయ్య.

'ఆఁ' అని నోరుతెరచి సదానందులు పురఫ్ సరవయ్య వాకిట్లో కాళ్లాడక నిలబడి పోయాడు.

'శరీరం చేసిన పాపానికి ఆత్మ ఎలా బాధ్యురాలు? శరీరం చేసిన పాపం ఆత్మకు అంటదా? ఆత్మ పరమాత్మ స్వరూపమయితే ఏనాటి కయినా అక్కడికి చేరుతుంది కదా? యీమధ్యలో మానవు డెందుకు ఐహిక వాంఛల్నా సుఖాల్నా వదులుకోవాలి? శరీరాన్ని ప్రేరేపించేది ఆత్మా? ఆత్మను శరీరం కానిస్తుందా? శరీరం ఆత్మను కానిస్తోందా? సర్వం పరబ్రహ్మ స్వరూపమే అయినప్పుడు మానవుడిలోని ఆత్మకు మరెక్కడికో చేరుకోవాలనే తపన ఎందుకు? తపస్సు ఎందుకు? ఏది ఆత్మ? ఏది పరమాత్మ? ఏది తప్పు? ఏది ఒప్పు? ఏది ఏది? —— వేదాంత మీమాంస, జిజ్ఞాసలోపడిపోయిన సదానందుని మెదడులో ఆలోచనా తరంగాలు, అంతం కాని సముద్రపు అలల్లా, అనంతంగా ప్రవహించి తీరాన్ని తాకి పగిలిపోతూన్నాయి.

'గురూజీ! నడవండి! పోదాం' వీధిలోకి వచ్చి నుంచున్న సత్తెయ్య అన్నాడు. శిష్యుడు మాటకు 'ఆత్మ-పరమాత్మ' లోకంలో విహరిస్తోన్న సదానందులు వాస్తవలోకంలోకి ఊడిపడ్డాడు.

లోపల అంత దూరంలో కళ్ళ నీరు పైట చెంగుతో తుడుచుకొంటూ తన వంక ఆశతో బాధగా——చూస్తోన్న ఆదెమ్మ——వీధిలో నుంచుని ప్రాధేయ పడుతూ పిలుస్తోన్న శిష్యుడు సత్తెయ్యను చూస్తో, ఎటూ అన్నది తేలకా తోచకా అలాగే, లోపల వొక పాదం, బయట ఒకపాదంపెట్టి ద్వారం మధ్యలో నిలబడి పోయాడు శ్రీ శ్రీ శ్రీ జగద్గురువులు నిత్యానందులవారి ప్రియతమ ఆత్మ శిష్యులైన శ్రీ సదానందులు పురఫ్ సరవయ్య-

## సీరియల్ నవల:




'ఏం లేదమ్మా నీకేమన్నా ఆహారం ఇస్తాను; మందు కూడా మరో మోతాదు వుంది; తాగెయ్!' అన్నాడు.

ఆమె మాట్లాడ లేదు. మందు తాగించి, కాస్త రొట్టె పెట్టాడు. అమ్మ మనస్సేమీ బాగాలేదు; ఎలాగైనా ఆమెను సంతోష పెట్టాలని ఆలోచించాడు.

'అమ్మా! ఇందాక లలిత వొచ్చిందే!' అన్నాడు; ఇంత పచ్చి అబద్ధం జీవితంలో ఆడి ఎరగడు; అందునా తల్లితో.

'ఆఁ. మరి—'

ఆమె మాట పూర్తిగాకుండానే 'నీ వప్పుడు నిద్రపోతున్నావ్. నిన్ను అనవసరంగా మేల్కొల్పడ మెందుకని వూరుకున్నాను. నేను లేపుదా మనుకుంటే, లలితే వొద్దన్నదే' అన్నాడు.

'లేపక పొయ్యావా!...ఏమన్నది రాజా?'

'అనేందుకు ఏమున్న దమ్మా? ఇక తగ్గుతుందని అన్నది. యీ గాడిద చాకిరీతో యీ విధంగా అయ్యావు. సరే ముందు పెద్ద గండం గడిచింది' అని నిట్టూర్చాడు తను.

'ఆ సంగతి పోనీరా—' అందామె విసుగ్గా.

'ఇప్పుడు ఏ సంగతీ వొద్దు లేవే అమ్మా! రెండు మూడు రోజులయ్యాక అన్నీ మాట్లాడుకోవచ్చు. నువ్వెక్కువ మాట్లాడకూడదని డాక్టర్ అన్నాడు. ఇక పడుకోవే!' అని దుప్పటి సరిగ్గా కప్పి దూరంగా జరిగి కూర్చున్నాడు.

ఆమె ఎంతో మాట్లాడా లనుకున్నట్లుంది; కాని ఆమె లలితను గూర్చే మాట్లాడుతుంది; తాను ఆ విషయాన్ని మొట్టమొదటే ఒకపెద్ద అబద్ధం పునాదిగా నిర్మించ సాగాడు; ఇక పైన జరిగే నిర్మాణమంతా ఒకదానికి తోడుగా మరికొన్ని అబద్ధాల సహాయం అవసర మౌతుంది. అవి ఒకదాని కొకటి అతకవని తెలుసు. అందుకనే తెలివిగా తప్పించుకున్నాడు.

అమ్మ మెదలకుండా పడుకుంది; లలిత సంగతి చెప్పినప్పటినుంచీ ఆమె మొహంలో కాస్త కళ వొచ్చింది. ఎంత పిచ్చిది అమ్మ! వెధవ ఒక అబద్ధంలో ఆమె మనస్సు ఎంత తేలికయింది! ముందు ముందు ఇదంతా నిజం కాదని తెలిసినా బాధ లేదు. ఎందుకంటే కఠిన సత్యాన్ని భరించే శక్తి సామర్థ్యాలు ఆమెకు అప్పటికి కలుగుతవి.

మానసికంగానూ, శారీరకంగానూ చాలా అలసి ఉండటం వల్ల, ఆ రాత్రి తనకు వొళ్ళు తెలియనంత నిద్ర పట్టింది.

## 27

వారానికి ఆమెకు చాలా తేలికయింది; డాక్టర్ కూడా రోగస్థితికి తృప్తి కనబరిచాడు; కాని నెలల తరబడి మందులూ, ఇంజక్షన్లూ అవసరమౌతవని అన్నాడు. తనకు మరోదారి లేదు కనుక, బ్యాంకులోని పైకం వంద తీసుకొచ్చాడు.

ఆరోజు కూడా ఆఫీసుకు వెళ్ళకుండా, ఇంటి దగ్గిరే పత్రికలు నింపేందుకు గాను చెత్త తయారుచేయ సాగాడు.

'నాయనా! నా క్కాస్త తేలిగ్గానే వుంది-నీవు కాలేజికి వెళ్ళరాదా?' అందామె.

వెధవ చదువు మానినందుకు తన కెప్పుడూ కలగనంత విచారం కలిగింది సమయంలో. నిజం చెపితే, తన జీవితమంతా కష్టించి నిర్మించిన రమ్య హర్మ్యం, కళ్ళ ముందే కూలటాన్ని చూసి, తల్లికి గుండె పగులుతుందేమో నన్నంత బాధ కలిగింది, తనకు. తనకే ఎంతో వ్యధగా వున్న యీ విషయాన్ని కప్పి పుచ్చేందుకు మరో పెద్ద అబద్ధం ఆడాడు. అబద్ధాలు కూడా మానవజీవితంలో, వ్యాధులకు ప్రక్రియలుగా కాకపోయినా, కనీసం ఔషధాలుగా నన్నా ఉపయోగ పడుతవని ఎన్నడూ అనుకోలేదు.

'రెండు రోజులాగి వెళ్తానమ్మా!' అన్నాడు.

'ఆ అబ్బాయి, కాగితాలూ అవీ పట్టుకొస్తాడు ఎవర్రా?... మొన్న వచ్చి నాయన ఎవరూ?' అందామె.

'పత్రికాఫీసు వాళ్ళమ్మా! చదువుకుంటూ, వారికి పనిచేయటం వల్ల కొద్దిగా ముట్టుతూంటుందిలే' అన్నాడు.

అప్పటి పరిస్థితికి తాను చెప్పింది అతికింది కనుకే తల్లి మరి మాట్లాడ లేదు.

ఆహారం విషయంలో చాలా శ్రద్ధ తీసుకోవాలనీ, పాలూ, పళ్ళూ విశేషంగా ఇవ్వాలనీ డాక్టర్ చెప్పాడు. యీ ఖర్చుచూస్తే, తన దగ్గరవున్న మొత్తమంతా సరిగ్గా రెండు నెలలు కూడా వొచ్చేట్లు లేదు. ముందుగతేమిటనే ఆలోచన ఇప్పుడే ఆరంభమైంది. ఆరోగ్యవంతంగా వుండే మనుషులైతే, కడుపునిండే దాకా నే తినగలరు; కాని అనారోగ్యాన్ని పోషించటం మాటలా?

ఐతే కొంతలో కొంతగా, తాను పడే యీ శ్రమకూ, సేవకూ తల్లి తిరిగి ఆరోగ్యాన్ని పుంజుకో గలదనే ఆశ వుంది. ఇక యీ మెను తిరిగి యీ ఇంటినుంచి బైటికి పోనివ్వరాదు; కలో గంజో, ఉన్నంతలోనే ఇముడ్చుకొని రోజులు వెళ్ల బుచ్చాలి. యీ నిశ్చయాలు ఎప్పుడో చేసుకున్నవి; వాటిని మరిచి పోకుండా మననం చేసుకోవటం అవసరమనిపిస్తూ వుంటుంది మరి!

నాలుగు రోజుల వరకూ తను ఆఫీసుకు వెళ్ళకుండానే గడిపాడు; ఆఫీసుకు వెళ్లలేదని యజమానులు ఏమన్నా అనుకుంటున్నారేమోననే భయం వుంది. ఒక్కగా నొక్క కొమ్మను పట్టుకేళ్ళాడే తను, అందులోనూ యీ స్థితిలో, ఆపట్టు కాస్తా తప్పితే ఒక అధోగతే!

ఒకనాడు డాక్టర్ ఇంటినుంచి తిరిగి వొస్తూండగా శర్మగారు కనిపించారు. అమ్మకు ఎలా వుందో విచారించాక 'ఇక ఆఫీసు కొచ్చేందుకు వీలవుతుందా? ఆ( ఏం లేదు—పైనెలలో ప్రత్యేకదిన సంచిక వేయాలట. ఇప్పట్నుంచే పని ప్రారంభం కావాలి—' అన్నా రాయన.

యీ ప్రత్యేక సంచికల తంతు, కేవలం ప్రకటనల్ని గుంజుకు నేందుకేనని తనకు తెలుసు. యజమానులు ప్రత్యేక లాభాలను పొందినా, అందుకు కృషిచేసిన వారికి దమ్మిడీ కూడా ఎక్కువ ఇవ్వరు. ఎంత అన్యాయాన్ని, అక్రమాన్ని తాను భరించ వలసి వొస్తోందో తలుచుకుంటే, గుండెల్లో జేవినట్లు వుంటుంది. కాని దాన్ని ప్రతిఘటించి తను బతకలేడు కనుక, తల వొంచటం తప్పని సరవుతోంది.

మర్నాటి నుంచీ వొస్తానని శర్మగారికి చెప్పాడు. ఇంటికి వొచ్చాక కూడా, ఆఫీసూ, అమ్మకు సేవా, రెండూ ఎలా కుదురు తయ్యా అనే ఆలోచనలో పడ్డాడు. ఇమడని అనేక విషాలను తాను తాగాడు; హరించుకున్నాడు. ఇదొక లెక్కా—?

'రేపటి నుంచీ కాలేజికి వెళ్తానమ్మా!' అన్నాడు.

'వెళ్ళు... నేను లేచి నా పనులు చేసుకోగలను' అందామె.

నిజానికి ఆమెలో త్రాణ బొత్తిగా లేదు. రక్తంకూడా చాలా తక్కువగా ఉన్నదని డాక్టర్ ఇంజక్షన్లు ఇస్తున్నాడు. కొన ఊపిరితో ఉన్నప్పటికీ, పట్టుదలను

పీడని అమ్మ, తనకోసం చివరి రక్తకణాన్ని కూడా ఆహుతి చేసేందుకు సిద్ధమైన అమ్మకు; తను ఎన్ని జన్మాలెత్తి ఋణాన్ని తీర్చుకోగలడు?

అనుకున్న కార్యక్రమం ప్రకారం, మర్నాడు ఉదయమే వంటచేసి, అమ్మకు మందు తెచ్చి, అమ్మ భోజనానంతరం, తనుకూడా ఇంత నంజి ఆఫీసుకు పరుగెత్తాడు. తిరిగి జీవితాన్ని మరోగాడిలో వేసినట్లు వుంది. ఇలా ఎన్నిసార్లు యీ 'గాడి' మార్చినా అది గాడి తప్పటం, తిరిగి మరో పద్ధతికి మార్చటం జరుగుతూనే వుంది.

నెల జీతాలు పదిరోజులు ముందుగానే అంది వుండవలసింది; ఇంత వరకూ ఆ ఊసే ఎత్తినవారు లేరు. తనా నోరు తెరిచి అడగలేదు. ఏమన్నా జీతాలిచ్చే ఆశ లున్నవేమోనని క్రింది ప్రెస్‌లోకి వెళ్తే, అక్కడ సోదరు లిద్దరూ మూతులు ముడుచుకొని కూర్చొని వుంటారు; వారిని పలకరించటం అంత క్షేమకరంగా తోచక మానేశాడు. ఆఫీసు కుర్రాడు కూడా 'సార్! జీతాల సంగతేమిటి?' అని తనను అడుగుతాడు. తనకే తెలియని సంగతి, వాడికెలా చెప్పటం?

ఇక ఆగలేక శర్మగారికి చెప్పుకున్నాడు తను.

ఆయన నవ్వి 'నేనూ అదే చూస్తున్నాను. వాళ్లంతట వాళ్ళే పిలిచి జీతాలిస్తా రేమోనని ఎదురు చూస్తున్నాను. కాని వాళ్ళ వ్యవహారాలు బొత్తిగా బాగున్నట్లు లేదు. డబ్బులేక కాదనుకో; ఏవో మనస్పర్ధలు పెంచుకుంటున్నారు. మధ్య మన చావుకు వొచ్చింది' అన్నారాయన.

ఇంకా ఎదురు చూడటంలోనే పరిస్థితి ఆగింది.

బ్యాంకులో వున్నదాంతో ప్రస్తుతానికి ఇబ్బంది లేకుండా గడుస్తుంది కనుక, తను సరిపెట్టుకో వొచ్చు. ఆఫీసులో ఉన్నంతసేపూ ఇంటిమీదనే ధ్యాస. అక్కడికీ, పూర్వంకన్నా వేగంగా రాస్తున్నా కంపోజుకు కాగితాలు అందటం లేదు. మధ్యలో అడ్డం వొచ్చే ప్రూఫులు మరికొంత ఇబ్బంది కలుగజేస్తున్నవి. ఒకనాడు విసుగెత్తి మిగతాపని ఇంటిదగ్గర చేసుకుంటానని శర్మగారికి చెప్పి వొచ్చేస్తున్నాడు. శర్మగారు 'ఎవరెట్లా చచ్చినా సరే' అన్నట్టు, పట్టించీ పట్టించుకోకుండా తల వూపుతున్నారు.

ఇప్పుడు రోజు విడిచి రోజు డాక్టర్ వొచ్చి ఇంజక్షన్లు ఇస్తున్నాడు. అమ్మానే డాక్టర్ దగ్గిరికి తీసుకొని వెళ్తే ఇంత ఖర్చు వుండనిమాట నిజమే కాని, అక్కడ పడివుండటం, ఎండదెబ్బ తినటం, యీ శ్రమంతా ఆమె భరించ లేదు. అందుకని ఖర్చును తగ్గించుకోగలగటం ఇప్పట్లో అయేదిగా తోచలేదు.

యీ మందులకు తోడుగా, బలవర్ధ కౌషధాలు కూడా అవసరమైనవి. మనిషి విలువలు, అతని జీవితమంతా ప్రతి విషయంలోనూ, ఏదో విధంగా డబ్బుతో అంక వేయబడే వుంది. ఆ డబ్బు లేనినాడు తనెవరో, యీ ప్రపంచానికి సంబంధ మేమిటో ప్రపంచమే కఠినంగా ప్రశ్నించి, పరీక్షించి, అంతు కనుక్కుంటుంది. కనుచూపు మేరలోనే అలాటి ఘోర పరిస్థితి వున్నదేమో ననే కంపరం కూడా ఆరంభమైంది.

వారం రోజులు గడిచాక—

ఒకనాడు సాయంత్రం, దీపాలు పెట్టేవేళ ఇంటికి వొచ్చాడు తను. రోజూ కన్నా చాలా సంతోషంగా వుంది అమ్మ. జీవితభారంతో కుంగిపోతూన్న తనకు, ఆమె మొహం కళకళ్ళాడుతూ వుంటే ఎంతో ఆనందం కలిగింది. ఒక్క పూటలో ఆమె ఎంతో ఆరోగ్యాన్ని పొందిన చిహ్నాలు కనిపించినవి. ఐతే ఇదంతా డాక్టర్ మహిమ, మందుల ప్రభావం ఐ వుంటుందని తను అనుకోలేక పొయ్యాడు. కారణాన్ని తను ఊహించే శ్రమ లేకుండానే ఆమె చెప్పింది.

'బాబూ! ఇవాళ లలితమ్మ వొచ్చిందిరా—' అందామె.

యీ మధ్య అసలు లలితను గూర్చి తను తలవటం లేదు. జీవిత ప్రవాహంలో ఆమె ఎంతో దూరం కొట్టుకొని పోయింది. తిరిగి అమ్మ చెబుతూన్నప్పుడు ఆ పాత గాథంతా ఒక్కసారిగా స్మృతిపథంలో మెరిసింది.

'చాలాసేపు కూర్చుంది రాజా! నీవు రాలేదు...ఇంతకుముందే వెళ్ళిపోయింది'

చాలాసేపు కూర్చున్న లలిత అనేక విషయాలు అమ్మతో చర్చించివుంటుంది. మామూలు సంగతులైతే తను పట్టించుకోనక్కర్లేదు కాని, తన ఉద్యోగం సంగతీ, చదువు మానేసిన విషయమూ చెప్పి వుంటుందేమోనని భయం వేసింది. ఐతే లలిత ఏం మాట్లాడిందో; అమ్మ చెప్పేవరకూ తను మెదలకుండా ఉండటం తప్ప మరో మార్గం లేదు.

'నాయనా! నీవు చదువు మానావట కదా? ఉద్యోగం చేస్తున్నావట!' అందామె.

గతుక్కుమన్నాడు, తను. దేన్ని గూర్చయితే తను భయపడుతున్నాడో ఏదైతే తల్లికి తెలియకుండా రహస్యంగా ఉంచాలని తను ప్రయత్నిస్తున్నాడో, అదే ఆమెకు తెలిసిపోయింది. కనుక ఆ ఆతృత మరిలేదు. నిర్లిప్తంగా కళ్ళప్పగించి అమ్మవేపు నిస్సహాయంగా చూశాడు.

'నాతో మాటమాత్రమైనా అనలేదేరా బాబూ! చదువు మానేశావంటే మొదట్లో నాకు ఎంతో కష్టమనిపించింది; కాని లలితమ్మ చెప్పాక, అంతా నిజమేననీ, మనబోటి వాళ్ళకు పెద్ద చదువులు అనవసరమనీ అనిపించింది. నీవు చేసినపని, సబబైనదిరా రాజా!'

తల్లిని తనైతే ఇంత తేలిగ్గా సమాధాన పరిచి ఉండేవాడు కాదు. లలిత చెప్పబట్టే అమ్మకు ఎంతో తృప్తి కలిగింది. ఒక గండం గడిచి, తన మనస్సు కూడా చాలా తేలికయింది. మొదట్లో యీ సంగతులు అమ్మకు చెప్పినందుకు లలితంటే తనకు కోపం వొచ్చింది కాని, ఇంత నెలవిగా తేలిగ్గా, అందరికీ సమాధానంగా చెప్పగలిగిన ఆమె కౌశలాన్ని మెచ్చుకోకుండా ఉండలేక పొయ్యాడు.

'ఏం నాయనా! ఇంకా విచారంగానే ఉన్నావ్?' అందామె, కొత్తగా తానుకూడా విషాదానుభూతిని పొందుతూన్న దానివలె. 'వెధవ చదువు పోతేనేం? బతికిన నాలుగురోజులూ కష్టాలేనా? మనసు కష్టపెట్టుకొని బతకటం కష్టం కదా!'

అమ్మను ఊరడించవలసిన తను, అమ్మచేత ఊరడించబడవలసి వొచ్చినందుకు నొచ్చుకున్నాడు. చప్పున మూడ్ మార్చుకుంటూ 'అదికాదమ్మా! నీవు బాధపడి పోతావని భయం వేసింది. నిజానికి లలిత యీ సంగతులన్నీ చెప్పవలసిన సమయం కాదిది. అదే ఆలోచిస్తూండి పొయ్యాను' అన్నాడు.

'రాజా! నాతో చెపితే నేనేమన్నా అంటానా? నీవేమన్నా చిన్నవాడివా? బాధ్యతలు తెలిసిన వాడివాయె. నీకు తోచిందిచెయ్యి బాబూ! ఒకవేళ నాకు తెలియక, ఏమన్నా అన్నా పట్టించుకోకు. లలితమ్మ చెపుతూంటే అంతా కళ్ళకు కట్టినట్లు, నిజమనిపించింది. నిజాన్ని నిజంగా తెలుసుకునేందుకూడా, కొంత మంది సహాయం అవసరమని నేనెప్పుడూ అనుకోలేదు.'

ఏమైనా లలిత యీ చిక్కుల్ని ఇంత తేలిగ్గా విడదీయ గలిగినందుకూ, ముఖ్యంగా తల్లికి ఎంతో సంతోషంగా వున్నందుకూ ఆనందం కలిగింది. కాని ప్రతి విషయానికీ తనకు లలిత సహాయం అవసరమేనా? చివరకు లలిత, అమ్మ ఆరోగ్యాన్ని పొందేందుకూడా కారణభూతురాలయింది! యీ లలిత, జీవితంలో తనకు తోడు నీడగావుంటే-! యీ తలపు రాగానే ఒక్కసారి వొణికిపోయి, తమాయించుకొని, తిరిగి తాను ఊబిలోకి దిగబడి పోతున్నాననే జ్ఞానం కలిగింది. అదృష్టవశాత్తూ చీకటి నలుమూలలా వ్యాపించి ఉండటంవల్ల, తనలో కలిగిన యీ అవస్థను అమ్మ గ్రహించేందుకు అవకాశం లేకపోయింది.

తను చదువుమానటం మీద చర్చలేకుండా పోవటం, తలమీద పాలు పోసినట్లే! లాంతరు వెలిగించి, అమ్మకు భోజన పెట్టాడు ఎవ్వరూ మాట్లాడటం లేదు. ఎవరి తలపుల్లో వారున్నారు. ఆ తరువాత తనుకూడా కాస్తనంజి, రాత పనికి పూనుకున్నాడు.

లలిత ఇంకా యే విషయాలు అమ్మతో మాట్లాడి వుంటుందో అడగాలని వుంది కాని, సిగ్గుపడి ఊరుకున్నాడు. ఆమె తనంతట తానుగా చెప్పినా పట్టించుకోనట్లు ఊరుకోవాల్సే వుంటుంది; ఎందుకంటే, తల్లి అభిప్రాయాలను (అవి ఏ రూపంలో ఉన్నవో తెలిసిన తను) బలపరిచినట్లు కనిపించటం వల్ల, ఆమె ఆడియాసల పాలయే అవకాశాన్ని కలిగించినట్లవుతుంది. అందుకనే కావాలని మౌనం వహించాడు. అమ్మ నిద్రపొయ్యేక కాని, దస్త్రం కట్టివేయలేదు.

## 28

మూడు వారాలు గడిచినయ్. యీలోగా అమ్మ కొంత ఆరోగ్యాన్ని పొందింది; కాని, ఆఫీసు వాతావరణంలో చాలా అనారోగ్యం గడ్డకట్టి, ఎప్పుడో,

ఏ క్షణానో, హఠాత్తుగా బద్దలయేట్లుగా వుంది. రెండో నెల జీతంకూడా రావలసిన సమయమైనా ఎవ్వరూ మాట్లాడటం లేదు. యజమానుల తగవులు, పనివాళ్ళ ప్రాణానికి ఎసరుపెట్టేవిగా తయారైనవి.

అమ్మ తిరిగి పరిపూర్ణారోగ్యాన్ని పొందేందుకు మరో నెలన్నా పట్టేట్లు వుంది. బ్యాంకులో డబ్బుకూడా దాదాపు ఐపోతూన్నది. కట్టుబట్టల్తో తనూ, తల్లీ, మిగిలిపోతే, గతేమిటి? యీ సంగతులన్నీ అమ్మకు చెప్పకుండానే, ఏదో విధంగా తను సమర్థించుకొని రావాలి.

—కాని, యీ అమ్మ, అందరి అమ్మలవలె పట్టించుకోకుండా, యీ వయసులో కూడా సుఖపడుదామనే జ్ఞానం లేని వెర్రిది. కనుకనే ఒకనాడు 'నాయనా! నేను మళ్ళీ పనిలోకి వెళ్తాను. కూర్చుని తింటే అవుతుందా?' అన్నది.

ఆ మాటలు విన్న తనకు, తన రాక్షసత్వపు వేరొక రూపం కళ్ళముందు కదిలింది. ఆరు నూరుకానీ, ఇక తల్లిచేత చాకిరీ చేయించకూడదు.

'నీకేమన్నా, మతి పోతోందా అమ్మా? మరో రెండు నెలలన్నా నీవు విశ్రాంతి తీసుకోవాలని డాక్టర్ అన్నాడు...ఇంకా నీరసంగానే ఉన్నావాయె!' అన్నాడు తను.

'డాక్టర్లు చెప్పటానికేరా బాబూ! డబ్బున్న వాళ్ళకు, మందులూ, అనారోగ్యాలూ, డాక్టర్లూ, విశ్రాంతీను. మనకెలా కుదురుతుంది? అదీగాక, నాకిప్పుడు బాగా కులాసాగా కూడా వుందాయె!' అందామె.

'ఆ సంగతి నాకు తెలుసే. నేనేదో సంపాయిస్తూంటిని. ఇప్పుడు కాదు; ఇంకెప్పటికీ నీవా ఇంటి చాయలకే వెళ్ళవలసిన పని ఉండదు. ఉన్నదాంట్లోనే తింటూ ఇక్కడే వుండు. ఐనా నే నిప్పుడు చదువుకోవటం లేదు కనుక, ఇదివరకల్లే సంపాయించకర్లేదు.—'

'—ఐతే మాత్రం?' అందామె 'యీ మందులకూ, మాకులకూ ఎంతో ఐవుంటుంది. మళ్ళీ అదంతా కూడబెట్టి...' ఆ తరువాత ఆమె కళ్ళు మూసుకొని, బహుశా ఊహాప్రపంచంలో వేరొక జీవితాన్ని, కొడుకు కోడళ్ళ మధ్య తాను సుఖపడటాన్ని ఆలోచించుకొని మురుస్తూండి వుంటుం దనిపించింది, తనకు.

'పెద్ద ఎత్తుల్లో ఆలోచించటం తేలికే కాని, ఆలోచించిన దాంట్లో ఆవగింజంతైనా జరక్కపోవచ్చు. నీకీ వయస్సులో ఎందుకిదంతా? ఏదో ఇంతతిని నీడను పడి వుండవే—మిగతా సంగతులు నేను చూస్తాను' అన్నాడు, తను.

ఆమె కాస్సేపు మాట్లాడ లేదు. ఉత్సాహకరమైన ఆలోచనల పొంగు ఆమె ముఖంలో పూర్తిగా చల్లారిన చిహ్నాలు కనిపించినవి. ఐనా తను లెక్కచేయకుండ టమే ఉభయులకూ క్షేమకరం కనుక, మెదలకుండా వూరుకున్నాడు.

తను ఆఫీసుకు బయలు దేరుతూండగా—'అన్నట్లు మరిచి పొయ్యాను రాజా! బాబుగారి దగ్గిర నేనో రెండొందలు దాచాను. పోయి తీసుకొని రారాదా?' అందామె.

తన కిప్పుడు పెన్నిధి దొరికి నట్లయింది. ఆర్థిక దుస్థితి ఆరంభమయే సూచనలు ప్రస్తుతానికి వాయిదా వేయబడినట్లే అనిపించి 'సాయంత్రం వెళ్ళొస్తాను' అన్నాడు.

ఆ సాయంత్రం ఎలాగో వీలు చూసుకొని, మైలాపూర్ వెళ్ళాడు; కాని బాబుగారికోసం రాత్రి ఎనిమిదింటిదాకా వేచి ఉండాల్సి వొచ్చింది. ఆయన వొచ్చాక 'ఎట్లా వుం దిప్పుడు?' అన్నారు.

'కా స్త నయమే' అన్నాడు తను.

'మళ్ళీ పనిలోకి వొస్తుందా?'

ఇలాటి ప్రశ్నలు తనకు శూలాల్లా తగులుతూన్నప్పటికీ భరించ వలసే వుంటుంది.

'చెప్పలేను. బహుశా రాక పోవొచ్చు'

ఆయన ఏదో చెప్పాలనుకొని, విసుక్కొని రెండొందలూ ఇచ్చాడు.

'వొస్తానండీ—' అని చెప్పి, అప్పటికే చాలా ఆలస్యం కావటం వల్ల, తను ఉరుకులు పరుగుల్తో ఇంటికి వొచ్చి పడ్డాడు.

'నాయనా! ఇంత ఆలస్యమయిందేం? ఇవాళ మళ్ళీ లలిత వొచ్చి వెళ్ళింది. ఆమె వొచ్చినప్పు డల్లా నీవు ఇంట్లో ఉండవాయె. నిన్ను చూడాలని ఆమె ఎంతో అనుకుందిరా'—అందామె.

తాను విడనాడినా, లలిత తనను విడనాడ లేదు. ఇప్పుడు యీ విషయాల్ని గూర్చి ఆలోచించే తీరిక తనకు లేదు. మరో ఊహాంటూ లేకుండానే, కలం పాళీలను అరగదీయట మొక్కటే తన యావ. ఇక తల్లి దగ్గిరికి లలిత వొచ్చి వెళ్తూండటంలోని ఆంతర్యం తనకు తెలియదు. ఏదో రహస్యం వుంటుందనికాదు కాని, ఆమె అమ్మతో మాట్లాడే విషయాలు మాత్రం ఏముంటయ్ కనుక? బహుశా తన కోసమే వొస్తూండి ఉండొచ్చు. అలా రావటం ఎవరికీ క్షేమకరం కాదు సరికదా, ఆమె చాలా నష్టపడగలదు. ఐనప్పుడు యీ దుస్సాహసం జోలి లలితకు ఎందుకు? ఏనాడన్నా పరిస్థితులు చక్కబడితే, అది వేరు సంగతి.

యీ సంగతులన్నీ అమ్మకు తెలియవు; తనా చెప్పలేడు; చెప్పినా ఆమెకు అర్థం కావు. లలిత వొచ్చి వెళ్ళటాన్ని గూర్చి, మిగతా ప్రపంచం వలెనే అమ్మ కూడా వేరు ఉద్దేశ్యాన్ని అంటగట్టి ఉండొచ్చు. తను పట్టించు కోకుండా ఉండి నట్లు నటించటమే సర్వోత్తమమైన పద్ధతి.

'బాబుగారి దగ్గిరికి వెళ్లి డబ్బు తెచ్చానమ్మా' అని మాట తప్పించాడు తను.

'ఆఁ......ఏమన్నారు నాయనా! ఇంటామె కనిపించారా? నన్ను గూర్చి అడిగారా?' అని అమ్మ ఎంతో ఆతృత కనబరిచింది.

నిజంగా అక్కడ జరిగింది చెపితే, అమ్మ ఎంత విచారిస్తుందో తను తేలిగ్గా ఊహించ గలడు. తనకున్న విశ్వాసమే, తన యజమానుల కూడా వుందనుకునే అమాయకురాల్ని, అనవసరంగా క్షోభ పెట్టటం దారుణమే అవగలదు. అందుకని ఏదో బొంకి ఆమెను సంతోష పెట్టాలనుకున్నాడు.

'నీ ఆరోగ్యం సంగతి అడిగారమ్మా! అడిగామని చెప్పమన్నారు. కాస్త కులాసా చిక్కాక, ఒక్కసారి రమ్మన్నారు—' అన్నాడు.

అమ్మ తృప్తికరంగా వున్నట్లు కనిపించింది. ఎంత ప్రపంచానుభవం వున్నా, మానవుడు తిరిగి తిరిగి అవే పొరపాట్లు పడుతూంటాడనేది తన కిప్పుడు స్పష్టంగా కనిపించింది.

(ఇంకావుంది)

వెలువడింది

చాడేశ్వరీదేవి కథల సంపుటి

# జీవితం!

జీవితాన్ని తరిచి తరిచి, వివిధ దృక్కోణాలనుంచి, మనస్తత్వాన్ని కళ్ళముందు కట్టినట్లుగా రచించబడిన అత్యుత్తమ కథలు.

ఆకర్షణీయమైన ద్వివర్ణ ముఖచిత్రం

88 పేజీలు: వెల ౮ అణాలు.

జ్యోతి ఏజెంట్ల దగ్గిరా, హిగ్గిన్ బాథమ్స్ రైల్వే పుస్తక శాలల్లోనూ దొరుకుతవి.

జ్యోతి కార్యాలయం, మద్రాసు-17.

Edited & Published by Dhanikonda Hanumantha Rao at Abhisarika Office, 4, Balu Mudali St., Madras-17, and Printed by M. Venkateswarlu at M. V. S. Press, 72, Govindappa Naicken St. Madras, 1.

# చిత్రసీమ

ఎడిటర్:

ధనికొండ హనుమంతరావు

★

కొత్తఫక్కీలో తారల పరిచయం, విజ్ఞానవిశేషాలు, శంఖారావం, లోకోభిన్నరుచిః, ప్రశ్నోత్తరాలు, చిత్రసీమలో సంచారం, కొత్తస్టిల్సు, సెట్టుమీద దృశ్యాలు ఇంకెన్నో వింతలు, విశేషాలతో, ఆకర్షణీయమైన త్రివర్ణ ముఖచిత్రంతో శరవేగాన వస్తోంది.

★

48 పేజీలు 8 అణాలు

డిపాజిట్ కట్టగలిగినవారికే ఏజెన్సీలు ఖాయంచేయబడుతవి.

★

వివరాలకు:

జ్యోతి కార్యాలయం

మద్రాసు–17.

WRAPPER PRINTED AT THE ASIAN PRINTERS, MADRAS-5.